Pubilshed from Tirupathi

PRGI NO : APTEL/25/A2316

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




తిరుపతి TIRUPATHI | సంపుటి : 01 Vol.No : 01 | సంచిక : 305 Issue No : 305 | గురువారం Thursday | జూలై 23, 2026 23 JULY 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



## గతదశాబ్దకాలంలో 152 ప్రశ్నాపత్రాలు లీక్

### రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : గత దశాబ్దకాలంలో 152 ప్రశ్నాపత్రాల లీకయ్యాయని, దీంతో 7.5 కోట్ల మంది (750 లక్ష?లమంది) విద్యార్థులు, వారి కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురయ్యారని లోక్‌సభ ప్రతిపక్ష? నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. సిజెపి ర్యాలీపై పోలీసుల చర్యలను ఖండించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

విద్యార్థుల డిమాండ్లకు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ప్రకటిస్తుం దని అన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ విద్యా విధానాల్లో ఒకటిగా నిలిచిన మనదేశ విద్యావ్యవస్థ నేడు ఒక అక్రమ వ్యవస్థగా మారిందన్న విషయం అందరికీ స్పష్టంగా తెలుసని అన్నారు.

2 పేజీలో..

# మీకు నేనున్నాను

- చంద్రబాబు పాలనలో అంతా దళారులదే రాజ్యం
- ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు. ఆక్వాది అదే స్థితి
- వ్యాపారులంతా సిండికేట్. లిఎక్కడికక్కడ దోపిడి పర్వం
- సీజన్ ముగుస్తున్నా పొగాకు కొనుగోళ్లు లేవు
- ఇప్పటి వరకు కొన్నది కేవలం 16.5 శాతమే
- తమ ప్రభుత్వంలో అత్యధికంగా కేజీ రూ.411 - 2023--24లో సగటు ధర కేజీ రూ.289
- అది అత్యుత్తమ ధర అని నాడు కేంద్రం రిపోర్ట్
- పొగాకు రైతులకు అండగా, తోడుగా ఉంటాం
- వారి సమస్యలపై గట్టిగా పోరాడుతాం
- రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తాం
- పొగాకు రైతులెవ్వరూ ధైర్యం కోల్పోవద్దు
- వైసీపీ అధినేత వైయస్ జగన్



ప్రజాభూమి ప్రతినిధి,తాడేపల్లి : రాష్ట్రంలో ప్రభుత్వ తీరు వల్ల పొగాకు రైతులు తీవ్ర నష్టాల్లో ఉన్నారని, వారికి తాము అండగా, తోడుగా నిలుస్తామని, వారి సమస్యలపై పోరాడుతామని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడించారు. ఆ దిశలోనే 10 రోజుల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించి, పొగాకు రైతులను కలుసుకోనున్నట్లు ఆయన ప్రకటించారు. చంద్రబాబు పాలనలో అంతా దళారులదే రాజ్యం అని, ఏ పంటకూ గిట్టుబాటు ధర రావడం లేదని, చిరకు ఆక్వా రైతులదీ అదే పరిస్థితి అని గుర్తు చేశారు. వ్యాపారులంతా సిండికేట్‌గా మారి, యథేచ్ఛగా దోచుకుంటున్నారని తెలిపారు. సీజన్ ముగుస్తున్నా, ఇప్పటికీ పొగాకు కొనుగోళ్లు లేవని, ఇప్పటి వరకు 20 శాతం కొనుగోళ్లు కూడా జరగలేదని చెప్పారు. పొగాకు రైతుల కష్టాలు తీరేలా పోరాడుతామన్న వైయస్ జగన్, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని వెల్లడించారు.

2 లో

నెల్లూరు, ప్రకాశం, ఏలూరు, తూర్పు గోదావరి జిల్లాల్లో పొగాకు సాగు చేస్తున్న రైతుల్లో ముఖ్యులతో పార్టీ కేంద్ర కార్యాలయంలో వైయస్ జగన్ భేటీ అయ్యారు. వారి సమస్యలన్నీ సావధానంగా విన్న ఆయన, వారికి అండగా తానున్నానంటూ ఎంతో భరోసా ఇచ్చారు.

**పొగాకు రైతుల సమావేశంలో వైయస్ జగన్ ఏం మాట్లాడారంటే :**

**"94 రోజులు గడిచినా.. :**పొగాకుకు సంబ్యంధించి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతన్నలందరూ తమ బాధలు ప్రస్తావించారు. ఏ రకంగా ఇవాళ్టికి దాదాపు 94 రోజులు అయినప్పటికీ కూడా, 20 శాతం కూడా కొనుగోలు చేయని పరిస్థితులు రాష్ట్రంలో కనిపిస్తున్నాయి. మామూలుగా 100 రోజుల్లోనే పొగాకు కొనుగోళ్లు పూర్తి కావాలి.



## ఎపిలో ప్రధాని మోడి పర్యటన

### ఐఎఎస్ అధికారుల పర్యవేక్షణ

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికిగాను ఆగస్టు 1వ తేదీన ప్రధానమంత్రి మోడి ఎపి కి రానున్నారు. ఈ నేపథ్యంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఐఎఎస్ అధికారులకు ప్రత్యేక బాధ్యతలను అప్పగించింది. పారిశుధ్యం, ఇతర ప్రజా అవసరాలను నలుగురు ఐఎఎస్ అధికారులు పర్యవేక్షించనున్నట్లు మున్సిపల్ పరిపాలన శాఖ ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, విజయవాడ మున్సిపల్ కమిషనర్ హెచ్‌ఎం ధ్యాన చంద్ర, గుంటూరు మున్సిపల్ కమిషనర్ మయూర్ అశోక్ లకు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. వీరికి సహాయంగా 26 మంది నాన్ క్యాడర్ అధికారులను వివిధ కార్పొరేషన్ల నుంచి కేటాయించారు. విజయనగరం జిల్లా కలెక్టర్ కి వీరంతా రిపోర్ట్ చేయాలని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



## ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయండి

- ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్
- ప్రధాని మోదీ జోక్యం చేసుకుని ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలని విజ్ఞప్తి
- యువత హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టీకరణ
- ధర్మేంద్రను తొలగించకుంటే మోదీ రాజీనామా చేయాలన్న ముఖ్యమంత్రి

వివరాలు 2లో..

## భూ రికార్డుల శాశ్వత భద్రతకు బ్లాక్‌చెయిన్

### రేపు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా 'మీభూమి-బ్లాక్‌చెయిన్' పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభం

- 7 జిల్లాల పరిధిలోని 7 మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్ అమలు
- భూ రికార్డులకు 'సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్'గా మీ భూమి-బ్లాక్ చెయిన్ ప్రాజెక్ట్
- భూ మోసాలకు చెక్... వేగవంతమైన, పారదర్శక సేవలే లక్ష్యం



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: భూ రికార్డుల నిర్వహణలో సాంకేతిక విప్లవానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల్లో విడివిడిగా ఉన్న భూ సమాచారాన్ని ఒకే వేదికపైకి తీసుకువస్తూ, రాష్ట్రంలోని భూ రికార్డులకు సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్‌గా నిలిచే 'మీభూమి--బ్లాక్ చెయిన్' వ్యవస్థను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. గురువారం మధ్యాహ్నం రాష్ట్ర సచివాలయంలో ఈ కార్యక్రమం జరగనుంది. కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల కలెక్టర్లు వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రస్తుతం వెబ్‌ల్యాండ్ ద్వారా భూ రికార్డులు డిజిటలైజ్ అయినప్పటికీ, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల్లో సమాచారం వేర్వేరుగా ఉండటం వల్ల డేటా వ్యత్యాసాలు, రికార్డుల్లో మార్పులను గుర్తించడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా మీ భూమి--బ్లాక్ చెయిన్ వ్యవస్థను రూపొందించారు.

2 పేజీలో..

NIC ఆంధ్రప్రదేశ్, NIC బెంగళూరులోని సెంటరాఫ్ ఎక్స్ లైన్స్ ఇన్ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ సంస్థలు సంయుక్తంగా హైపర్ లెడ్జర్ ఫ్యాబ్రిక్ టెక్నాలజీతో ఈ వ్యవస్థను అభివృద్ధి చేశాయి. ఈ వ్యవస్థలో ప్రతి భూ పార్సెల్‌కు ప్రత్యేక బ్లాక్‌చెయిన్ గుర్తింపు కల్పిస్తారు. ప్రతి లావాదేవీ టాంపర్-ప్రూఫ్, సెక్యూర్టీతో జరగనుంది. భూ రికార్డుల్లో ఎలాంటి మార్పు చేయాలన్నా ప్రభుత్వం నిర్దేశించిన ఆన్‌లైన్ సేవల ద్వారానే ఇకపై సాధ్యమవుతుంది. ఒక భూ పార్సెల్‌కు సంబంధించిన అన్ని రకాల లావాదేవీలు, వాటి ప్రతి వెర్షన్‌తో సహా శాశ్వతంగా నమోదయ్యేలా వ్యవస్థను తీర్చిదిద్దారు.

## భూ హక్కుల రక్షణే ప్రభుత్వ ధ్యేయం-ఇకపై '22ఎ' చిక్కుల నుంచి భూములకు విముక్తి

### నిషేధిత జాబితా నుండి భూముల తొలగింపు సరళతరం చేస్తూ కొత్త ఉత్తర్వులు

- పట్టా భూములను 22ఎ జాబితాలో పెడితే సంబంధిత అధికారిపై చర్యలు
- నిషేధిత జాబితా భూమి అని నిరూపించాల్సిన బాధ్యత ఇక ప్రభుత్వానిదే
- గత ప్రభుత్వంలో అనామక కంపెనీకి రిజిస్ట్రేషన్ సేవలు అప్పగించేలా విఫల యత్నం
- డాక్యుమెంట్ రైటర్ల ఉపాధికి ఇబ్బంది లేకుండా చూసుకుంటాం
- రాష్ట్ర రెవెన్యూ,రిజిస్ట్రేషన్లు,స్టాంపుల శాఖామాత్యులు అనగాని సత్యప్రసాద్



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : గత ప్రభుత్వ అక్రమాల కారణంగా వేలాదిమంది రైతులు సామాన్య భూ యజమానుల భూములు 22ఏ నిషేధిత జాబితాలో చిక్కుకుని ఎదుర్కొంటున్న తీవ్రమైన ఇబ్బందులకు శాశ్వత చరమగీతం పాడుతూ నిషేధిత జాబితా నుండి భూముల తొలగింపును సరళతరం చేస్తూ కొత్త ఉత్తర్వులను జారీ చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు.

- మిగతా 2లో..

## సౌదీ అణు ఒప్పందానికి ట్రంప్ ఆమోదం



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సౌదీ అరేబియాతో కీలక అణు ఒప్పందానికి ఆమోదం తెలిపినట్లు ఈ వ్యవహారంపై అవగాహన ఉన్న ఇద్దరు వ్యక్తులు వెల్లడించారు. ఈ ఒప్పందం ద్వారా సౌదీ అరేబియా తన పౌర అణు కార్యక్రమం కోసం యురేనియంను శుద్ధి చేసే సామర్థ్యాన్ని పొందే అవకాశం ఉంది. ఇంకా అధికారికంగా ప్రకటించని ఈ ఒప్పందాన్ని బుధవారం ప్రకటించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ అణు ఒప్పందం 30 సంవత్సరాల పాటు అమల్లో ఉండనుందని సమాచారం. సౌదీ పౌర అణు కార్యక్రమం అభివృద్ధిలో అమెరికా సంస్థలు కూడా భాగస్వామ్యం కానున్నాయి. అమెరికా--సౌదీ సంయుక్త అధ్యయనం అనంతరం, సౌదీ అరేబియాలో యురేనియం శుద్ధి చేసే కేంద్రం నిర్మాణానికి ఈ ఒప్పందం మార్గం సుగమం చేసే అవకాశం ఉంది. ఈ నిర్ణయాన్ని వాల్ స్ట్రీట్ జర్నల్ తొలిసారిగా వెల్లడించింది. అయితే, ఈ వార్తపై వైట్ హౌస్ ఇప్పటివరకు స్పందించలేదు.

## వేగం పుంజుకున్న పల్నాడు-ప్రకాశం 'జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధార' మెగా తాగు నీటి పథకాల పనులు

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో ఈసారి రాష్ట్రవ్యాప్తంగా అధిక ప్రాంతాలు తాగునీటి ఎద్దడి సమస్యను ఎదుర్కొనే అవకాశం ఉందని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు.

- 40 శాతానికి పైగా పూర్తయిన ఇన్ టేక్ వెల్స్
- 200 కి.మీ. పైప్‌లైన్ నిర్మాణం పూర్తి
- పనుల్లో మరింత వేగం పెంచాలి
- ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్నాయి... తాగు నీటి ఎద్దడి ఎదుర్కొనే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశం
- పనుల నాణ్యతను క్షేత్ర స్థాయిలో స్వయంగా పరిశీలిస్తానన్న పవన్ కళ్యాణ్
- నిర్ణీత గడువులోపు ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించే లక్ష్యంతో పని చేయాలని సూచన
- జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టుల పురోగతిపై ఆర్.డబ్ల్యూ.ఎస్. అధికారులతో సమీక్ష



నీటి ఎద్దడి తీవ్రంగా ఉండే పల్నాడు--ప్రకాశం లాంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని దిశా నిర్దేశం చేశారు. జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధార పథకంలో భాగంగా పల్నాడు--ప్రకాశం ప్రాంతాల్లో చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకాల పనులు నిర్ణీత గడువులోపు పూర్తి కావాలని ఆదేశించారు. బుధవారం పల్నాడు--ప్రకాశం మెగా వాటర్ గ్రిడ్

2 పేజీలో..

## సోనమ్‌వాంగ్‌చుక్‌ను కలిసిన కేంద్రమంత్రులు



న్యూఢిల్లీ : పర్యావరణ కార్యకర్త సోనమ్‌వాంగ్‌చుక్‌ను కేంద్ర మంత్రులు కలిశారు. కేంద్రమంత్రులు జె.పి.నడ్డా, జితేంద్ర సింగ్‌లు మంగళవారం రాత్రి గురుగ్రామ్‌లోని మేదాంత ఆస్పత్రిలో ఆయనను పరామర్శించారు. పార్లమెంటులో ఈ అంశంపై చర్చ చేపడతామని, విద్యా సంస్కరణల అంశంపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

2 పేజీలో..

# సంపాదకీయం

## వాంగ్ చుక్ వంటి మేధావుల్ని కాపాడుకోవాలి

విద్యా వ్యవస్థలోని అక్రమాలకూ, నీట్ 2026 పేపర్ లీక్ కూ నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్.టి.ఎ) ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ లోని జంతర్ మంతర్ లో కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) భారీ ధర్నా చేపట్టింది. దానికి మద్దతు తెలుపుతూ ప్రముఖ విద్యావేత్త, పర్యావరణవేత్త సోనమ్ వాంగ్ చుక్ నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. జులై 18 నాటికి ఆయన దీక్ష ఇరవై ఒక్క రోజులకు చేరుకుంది. ఆయన ఆరోగ్యం తీవ్రంగా క్షీణించింది. కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలన్న డిమాండ్లు దేశ వ్యాప్తంగా వెల్లువెత్తాయి. దేశంలోని ప్రముఖ ప్రతిపక్ష పార్టీలన్నీ ఆయనకు సంఘీభావం తెలియజేశాయి. వాంగ్ చుక్ ను డాక్టర్ల పర్యవేక్షణలో ఉంచి, ఆయన ప్రాణాలు కాపాడాల్సిందిగా ఢిల్లీ ప్రభుత్వానికి ఆర్డరువేసింది. ఈ ఉత్తర్వును సాకుగా చూపి కదలలేని స్థితిలోవున్న వాంగ్ చుక్ దీక్షను భగ్నంచేస్తూ ఆయనను బలవంతంగా ఆస్పత్రికి తరలించింది మోడీ ప్రభుత్వం. 'లక్షల మంది యువతీయువకుల భవిష్యత్తు అంధకారమైపోతున్న తరుణంలో ఈ సమస్యలోని తీవ్రతను ప్రభుత్వానికి తెలియజెప్పడానికే తను ఈ నిరాహార దీక్ష చేస్తున్నానని, ఇది ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేస్తున్నది కాదని, ప్రభుత్వానికి సహాయపడేదే " నని సోనమ్ వాంగ్ చుక్ దీక్షాస్థలిలో ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. పేపర్ లీక్ లతో భవిష్యత్తు కోల్పోయిన యువతీయువకుల బాధతో, ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల బాధతో, వారి తల్లిదండ్రుల బాధతో పోలిస్తే తన బాధ చాలా చిన్నదని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఈ విషయాన్ని సాగదీయకుండా సానుకూలంగా వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. కానీ, కేంద్ర ప్రభుత్వపు మొండి వైఖరి ఈ దేశ ప్రజలకు తెలుసు. గతంలో ఢిల్లీ సరిహద్దులో వందల మంది రైతులు ప్రాణాలర్పించినా ఈ ప్రభుత్వం చలించలేదు. వారి ప్రాణత్యాగాలకు విలువ ఇవ్వలేదు. రైతుల న్యాయమైన కోర్కెలను పట్టించుకోలేదు. తమ మూర్ఖత్వాన్ని అలాగే కొనసాగిస్తూ రైతు చట్టాలు మాత్రం వెనక్కి తీసుకున్నారు. అందువల్ల, ఇప్పుడు వాంగ్ చుక్ నిరాహార దీక్ష గురించి గానీ, లక్షల మంది యువతీయువకుల భవిష్యత్తు గురించి గానీ ఈ ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందా అన్నది అనుమానమే! సోనమ్ వాంగ్ చుక్ వంటి మేధావులు చాలా అరుదుగా ఉంటారు. ఆయన ఒక ఇంజనీర్, విద్యావేత్త, సామాజిక కార్యకర్త, పర్యావరణవేత్త, జమ్మూకాశ్మీర్ కు చెందిన వాంగ్ చుక్ లడక్ ప్రాంతంలో పలు విద్యా సంస్కరణలు తీసుకొచ్చారు. 'స్టూడెంట్స్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ మూవ్‌మెంట్ ఆఫ్ లడక్' అనే సంస్థను స్థాపించి నిర్వహిస్తున్నారు. మంచు స్థూపం (ఐస్ స్థూప) సాంకేతికతను అభివృద్ధి చేసి, అంతర్జాతీయంగా గుర్తింపు పొందారు. 2018 లో 'రామన్ మెగసెసే' పురస్కారం లభించినప్పుడు ఆయన పేరు బాగా వెలుగులోకి వచ్చింది. ఈయన కృషిలో మంచు స్థూపం చెప్పుకోదగ్గది. లడక్ ప్రాంతంలో వృథాగా పోయే శీతాకాలపు నీటిని అంటుకట్టి శంఖాకారపు మంచు కుప్పల రూపంలో నిలువ చేస్తారు. వేసవిలో నీటి కొరత ఉన్నప్పుడు, పంటలకు నీరు కావాల్సినప్పుడు ఈ మంచును కరిగించి ఉపయోగిస్తారు. నీటి పారుదల కోసం కాలువలు తవ్వడం, గడ్డ కట్టించడం ఆ ప్రాంతంలో వందల సంవత్సరాలుగా ఉన్నదే. కానీ, వాంగ్ చుక్ మళ్ళీ ఆ పద్ధతిని పునరుద్ధరించి, ఆధునీకరించి, అభివృద్ధి చేసి ప్రాచుర్యంలోకి తెచ్చారు. ఈ ప్రాజెక్ట్ ను తన ఎన్.జి.ఒ సంస్థ ద్వారా నిర్వహించారు. ఇవి అక్కడి వ్యవసాయానికి ఎంతగానో ఉపయోగపడుతూ వచ్చాయి. ఈ పనితో వాంగ్ చుక్ రైతు బాంధవుడిగా, పర్యావరణవేత్తగా వెలుగులోకి వచ్చారు. జమ్మూకాశ్మీర్ లో జన్మించిన వాంగ్ చుక్ శ్రీనగర్ లో చదువుకున్నారు. అక్కడి ఎన్.ఐ.టి ఇంజనీరింగ్ కళాశాల నుండి మెకానికల్ ఇంజనీరింగ్ పట్టా తీసుకున్నారు. తరువాత ఫ్రాన్స్ లోని క్రేటర్ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ లో మట్టి నిర్మాణ శిల్పకళపై ఉన్నత విద్యనభ్యసించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విఫలమైన విద్యార్థులకు ప్రత్యామ్నాయ విద్యావకాశాలు కల్పించడానికి తర్వాత కాలంలో ఆయన స్థాపించిన సంస్థ ఎంతగానో ఉపయోగపడింది. దానితో ఆయన కొన్ని సంస్కరణలు కూడా తీసుకురాగలిగారు. అలాగే 'ఆపరేషన్ న్యూ హోప్' (1994) అనే కార్యక్రమం ద్వారా లడక్ విద్యావ్యవస్థలో మరికొన్ని సంస్కరణలు తేగలిగారు. 1993 -- 2005 మధ్య కాలంలో వాంగ్ చుక్ 'లడగ్స్ మెలాంగ్'(లడఖ్ అద్దం) అనే పత్రికను తన స్వీయ సంపాదకత్వంలో నిర్వహించారు. ఇది లడక్ ప్రాంతంలో అచ్చయి వెలువడిన తొలి, ఏకైక పత్రిక. సోనమ్ వాంగ్ చుక్ గతంలో కూడా అనేక ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, పర్యావరణ రక్షణ, లడక్ ప్రాంత ప్రజల హక్కుల రక్షణ కోసం ఉద్యమిస్తూనే ఉన్నారు. 2024 లో లడక్ కు ప్రత్యేక హోదాకు సంబంధించి, పర్యావరణానికి సంబంధించి ప్రారంభమైన 'క్లైమేట్ ఫాస్ట్' ఉద్యమం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అందులో భాగంగా 2025 సెప్టెంబర్ 24 న లెహ్ లో జరిగిన ఒక విధ్వంసానికి వాంగ్ చుక్ ని బాధ్యుడిని చేస్తూ పోలీసులు జాతీయ భద్రతా చట్టం కింద (ఎన్.ఎస్.ఎ) అరెస్ట్ చేసి, జోద్ పూర్ జైల్లో 170 రోజుల పాటు నిర్బంధించారు. 2026 మార్చి 14 న విడుదలై బయటికి వచ్చారు. అందువల్ల, ఉద్యమాలు, జైలు జీవితం వాంగ్ చుక్ కు కొత్త కాదు.

# గతదశాబ్దకాలంలో 152 ప్రశ్నాపత్రాలు లీక్

దశాబ్దకాలంలో 152 ప్రశ్నాపత్రాలు లీకయ్యాయని, లెక్కవేసి చూస్తే నెలకు ఒక పేపర్ లీకైనట్లని అన్నారు. "ప్రతి నెలా లక్ష?లాది మంది విద్యార్థులతో మీరు గతంలో ఎదుర్కొన్న ఒత్తిడినంతా మళ్లీ ఎదుర్కోవాల్సిందేనని చెబుతారు. ఆ తర్వాత దానితో మాకు ఏమాత్రం సంబంధం లేదని దాటవేస్తారు" అని అన్నారు.7.5కోట్లమంది విద్యార్థులు, వారి కుటుంబాలు తీవ్ర ఒత్తిడికి గురయ్యారని, వారిలో చాలామంది మధ్యతరగతి, పేద కుటుంబాలకు చెందినవారని అన్నారు. తమ కష్టార్జితాన్నంతా ఈ పరీక్ష?ల కోసం వెచ్చిస్తారని, కానీ వారి శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ నిందితులకు మాత్రం శిక్ష?లు పడలేదని మండిపడ్డారు. విద్యార్థులు న్యాయమైన విద్యావిధానం కోరుకోవడం తప్పా అని ప్రశ్నించారు. విద్యార్థులకు ఎందుకు ఇలా జరుగుతోంది. వారిపై ఆయుధాలను గురిపెట్టాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడింది, వారు చేసిన తప్పేంటి అని ప్రశ్నించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతూ, తమ డిమాండ్లను వినిపిస్తున్నారని అన్నారు. దేశం తమకు కల్పించాల్సిన హక్కుల గురించి అడుగుతున్నారు. ఈ దేశ విద్యార్థులుగా మాకు న్యాయమైన విద్యా విధానం కావాలని మాత్రమే కోరుతున్నారని అన్నారు. తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, ప్రశ్నాపత్రాల లీకేజీలతో ఎంతో మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. విద్య కోసం కేంద్రప్రభుత్వం 1.4లక్ష?ల కోట్లు కేటాయిస్తుండగా.. ప్రతి ఏడాది నీట్ పరీక్ష? కోసం విద్యార్థులు 1.32లక్ష?ల కోట్లు ఖర్చు పెడుతున్నారని అన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయండి

న్యూఢిల్లీ : నీట్ పేపర్ లీకేజీ వివాదంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. యువత హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.ధర్మేంద్ర ప్రధాన్‌ను బాధ్యతల నుంచి తొలగించలేకపోతే, ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన పదవికి రాజీనామా చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. మోదీని గద్దె దించి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు తన నియోజకవర్గం నుంచే ప్రతిన బూనుతున్నానని ఆయన వెల్లడించారు. బీజేపీ గాడ్సే వారసత్వానికి ప్రతీక అయితే, కాంగ్రెస్ పార్టీ మహాత్మా గాంధీ సిద్ధాంతాలను పుణికిపుచ్చుకున్న వారసత్వం కలిగిన పార్టీ అని ఆయన వ్యాఖ్యానించారు.నరేంద్ర మోదీ, ధర్మేంద్ర ప్రధాన్ కలిసి ఈ దేశాన్ని దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో వారిని ఏమాత్రం విజయం సాధించనివ్వబోమని హెచ్చరించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో వీధుల నుంచి పార్లమెంటు వరకు పోరాటం సాగించి బీజేపీని ఓడిస్తామన్నారు. యువత భవితవ్యంతో, దేశ భవిష్యత్తుతో మోదీ చెలగాటమాడుతున్నారని ఆయన మండిపడ్డారు.నీట్ పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాలపై నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)తో పాటు ఇతర విపక్షాలు కూడా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఈ పరిణామాల వల్ల విద్యార్థులు మానసికంగా, విద్యాపరంగా తీవ్రంగా నష్టపోతున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థపై ప్రజలకు తిరిగి నమ్మకం కలిగించాలంటే తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలంటూ ఇప్పటికే పలు వర్గాల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. పరీక్షల నిర్వహణలో లోపాలు జరిగాయని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించి, భవిష్యత్తులో సంస్కరణలు చేపడతామని ప్రకటించినప్పటికీ, విపక్షాలు మాత్రం కేంద్ర మంత్రిపై వేటు వేయాల్సిందేనని పట్టుబడుతున్నాయి.

# 'మీకు నేనున్నాను'

అలాంటిది 94 రోజులు దాటినా కూడా ఇంతవరకు కేవలం 38 మిలియన్ కేజీలు మాత్రమే కొనుగోలు చేశారు. పండిందేమో 232 మిలియన్ కేజీలు. కొనుగోలు చేసిందేమో 38 మిలియన్ కేజీలు. అంటే పండిన పంటలో కేవలం 16.5% మాత్రమే కొనుగోలు చేశారు. 100 రోజుల్లో మొత్తం కొనుగోళ్లు పూర్తి కావాల్సిన చోట, 94 రోజులు అయినా కూడా ఇంత తక్కువ శాతం మాత్రమే కొనుగోళ్లు జరిగిన నేపథ్యంలో, ఏ రకంగా రైతు బ్రతకగలుగుతాడు? అసలు ఎన్ని రోజులు ఇది కొనసాగుతుంది? ఇక్కడ అర్థమవుతోంది ఏమంటే.. కర్ణాటకలో సెప్టెంబరులో పొగాకు కొనుగోళ్లు మొదలవుతాయి. అప్పుడు సగం మంది ట్రేడర్లు సహజంగా అటువైపుకి వెళ్ళిపోయే పరిస్థితి వస్తుంది కాబట్టి, అందుకని ఫుల్ స్టాప్ పెట్టే కార్యక్రమమే జరిగింది. ఇప్పుడు మన దగ్గర ఇంకా పంట కొనుగోలు చేసే కార్యక్రమం కూడా జరగని పరిస్థితి ఉంటుందన్న భయాందోళనల మధ్య, చంద్రబాబునాయుడుగారు రివ్యూ మీటింగ్స్ పెట్టి పొగాకు ధర కేజీ రూ.200 కు తగ్గకూడదని చెప్పిన మర్నాడే పొదిలిలో రూ.179, టంగుటూరులో రూ.184, కనిగిరిలో రూ.184, కందుకూరులో రూ.186, జంగారెడ్డిగూడంలో రూ.170, గోపాలపురంలో కూడా రూ.170. ఈ రేట్లు తగ్గిపోయి కొనుగోలు చేస్తున్నారు అంటే, సిండికేట్ ఏ రకమైన బలం ఉంది అన్నదానికి నిదర్శనం.అసలు టుబాకో బోర్డు ఎందుకు పెట్టారు? రైతులకు మంచి జరగాలి అనే ఉద్దేశంతో వ్యాపారులను ఒక ప్లాట్‌ఫామ్ మీదకి తీసుకొచ్చి, ఆ ప్లాట్‌ఫామ్‌లో వివిధ రకాల వ్యాపారులు పార్టిసిపేట్ చేస్తే, ఒక పోటీ వాతావరణం ఏర్పడుతుందని, తద్వారా రైతులకు మేలు జరుగుతుందనే ఉద్దేశంతో టుబాకో బోర్డు ఏర్పాటు జరిగింది.

కానీ చంద్రబాబునాయుడుగారి ప్రభుత్వ పుణ్యాన పరిస్థితి ఎలా మారిందంటే.. ఆయనగారు అధికారంలోకి వస్తూనే సిండికేట్‌లో అందరికీ కొమ్ములు వస్తాయి. సిండికేట్ మొత్తం ఏకమై, చంద్రబాబునాయుడు చెప్పేది చెబుతూ ఉంటాడు.. మనం చేసేది మనం చేస్తుంటాం అన్న ధైర్యంతో ఉంటారు. ఈ ఒక్క పంటే కాదు. ఏ పంట పరిస్థితి అయినా అంతే. దళారీలే వ్యవస్థను నడుపుతున్నారు. అందుకే వెంటనే ధరలు పతనం అయిపోయి, చివరికి ఈ రకమైన దారుణమైన రేట్లకు పడిపోయిన పరిస్థితి. దీంతో రైతులు విసిగిపోయి, ఏదో ఒక రేటుకు కొనండి. మమ్మల్ని బ్రతికించండి స్వామి అనే పరిస్థితి. అలా రైతులు తెగ అమ్ముకునే పరిస్థితిలోకి వ్యవసాయం అంతా కూడా దిగజారిపోతున్న దారుణ పరిస్థితి కనిపిస్తోంది. ఇటువంటి పరిస్థితి రాకూడదు అనే ఉద్దేశంతో మన ప్రభుత్వ హయాంలో మార్క్ ఫెడ్ ను పోటీగా దించాం. రాష్ట్రంలో ఎప్పుడు జరగని విధంగా మార్క్ ఫెడ్ ను కూడా ప్లాట్‌ఫామ్ మీదకు తీసుకొచ్చాం. ఎప్పుడైతే రాష్ట్ర ప్రభుత్వం అలా మార్క్‌ఫెడ్‌ను ప్లాట్‌ఫామ్‌పైకి తీసుకొచ్చి, ఎప్పుడైతే కొనుగోళ్లలో పార్టిసిపేట్ చేసే కార్యక్రమం చేసిందో, ఎప్పుడైతే రైతుల తరఫున మార్క్ ఫెడ్ రంగప్రవేశం చేసిందో, అప్పుడు మార్కెట్లో ఒక పోటీ మొదలైంది. అప్పుడు మార్కెట్లో మనం ఆ రకమైన కాంపిటీషన్ క్రియేట్ చేయగలిగాం కాబట్టి, సిండికేట్‌ను కూడా బ్రేక్ చేశాం. సిండికేట్ కాటన్ ఎప్పుడైతే బ్రేక్ అయిందో, గవర్నమెంట్ ఎప్పుడైతే సీరియస్‌గా తీసుకోవడం మొదలు పెట్టిందో, అప్పుడు భయం మొదలై రేట్లు పెరిగాయి. ఆ మేరకు 2023--24లో మా ప్రభుత్వ హయాంలో కేజీ పొగాకు సగటు ధర రూ.289 కాగా, ఆ ఏడాది అత్యధికంగా రూ.411కి కొనుగోళ్లు జరిగాయి. అది అత్యుత్తమ ధర అని అప్పుడు కేంద్ర ప్రభుత్వం కూడా రిపోర్టు ఇచ్చింది.అదే ఈరోజు చంద్రబాబునాయుడు చెప్పిన తర్వాత కూడా రేట్లు ఇంత దారుణంగా ఉన్న పరిస్థితి ఏంటి అని అంటే, 94 రోజులు అయిపోయినా కూడా కొనుగోలు చేసింది కేవలం పండిన పంటలో 16.5% మాత్రమే. అంత తక్కువ పంట కొనుగోలు చేసిన పరిస్థితి ఒకవైపున ఉంటే, మరోవైపున పరిస్థితులు చూస్తే నో బిడ్లు. భారీగా పొగాకు బ్యారెళ్లు రిజెక్ట్ చేయడం కనిపిస్తోంది. మరి అలా చేస్తున్న కంపెనీలపై చంద్రబాబునాయుడుగారి ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంది? ఇంతవరకు ఎన్ని కేసులు పెట్టారు? ఎన్ని లైసెన్సులు సస్పెండ్ చేశారు? ఎంత మందిని బ్లాక్‌లిస్టులో పెట్టారు? అంటే, ఇంత వరకు లైసెన్సులు సస్పెండ్ చేసింది లేదు. ఎవరినీ బ్లాక్‌లిస్టులో పెట్టింది లేదు. అలా చంద్రబాబునాయుడుగారు ఏ రకమైన భయాన్ని కలిగించకుండా, మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి రానివ్వకుండా మొత్తం అడ్డుకుంటే రైతులకు ఏ రకంగా లాభం జరుగుతుంది?.

రైతులకు లాభం జరగాలి అని అంటే.. రెండు జరగాలి. ఒకటి మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించాలి. అలా ప్రభుత్వం రైతుల తరఫున నిలబడడానికి సీరియస్‌గా ఉంది అని మెసేజ్ ఇవ్వాలి. రెండోది. ఎవరైతే లైసెన్స్‌దార్లు ఉన్నారో.. వాళ్ళందరికీ లైసెన్సులు ఎందుకు ఇచ్చారు?. వాళ్లు ఫలానా రేటుకు పంట కొంటాము. ఇంత పంట మీరు వేయండి అని చెప్పారు కాబట్టి, రైతులందరూ పంట వేశారు. ఇంత క్వాంటిటీకి మీరు వేయండి అని వాళ్ళు చెప్తేనే కదా, మనం పంట కూడా వేశాం. వాళ్ళు చెప్పిన ఆ క్వాంటిటీ కొనుగోలు చేస్తామని చెప్పి, అషూరెన్స్ ఇచ్చిన క్వాంటిటీ, రైతులు నష్టపోకుండా లాభం వచ్చే రేటుకి వాళ్ళు కొనుగోలు చేయాలి కదా? అది వారి నైతిక బాధ్యత కూడా.మరి ఆ బాధ్యతను వాళ్ళు విస్మరించినప్పుడు, ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. ఈ రకంగా సిండికేట్ ఫామ్ అయితే, ప్రభుత్వం ఒప్పుకోదు. ఈ రకంగా సిండికేట్ ఫామ్ అవుతే, ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. అన్న సంకేతం ఎప్పుడైతే ఇవ్వగలుగుతామో, అప్పుడే సిండికేట్ వ్యవస్థ అనేది బ్రేక్ అవుతుంది. అప్పుడే రైతులకు న్యాయం జరుగుతుంది. కానీ, చంద్రబాబునాయుడుగారి ఆధ్వర్యంలో ప్రభుత్వం నడుస్తున్నప్పుడు ఏవీ జరగవు. ఒక రైతు అన్న ఇంతకు ముందు చెప్పినట్లు.. ఐదు సంవత్సరాలు వరుసగా పక్కన తెలంగాణకు 100 మీటర్ల దూరంలో మన ఆంధ్ర ఉంది. పక్కన తెలంగాణలో ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేట్ 18.9% ఉంటే, ఆంధ్రాలో దాన్ని 14 శాతానికి అటు ఇటు పెట్టారు. క్లియర్‌కట్‌గా 100 మీటర్లు అవతల ఒక ఫ్యాక్టరీలో ఆ మేరకు ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేటు బెటర్‌గా ఉండి, రైతులకు బెటర్ రేట్ అక్కడ వస్తుంటే.. ఇక్కడ ఆంధ్రలో ఐదు సంవత్సరాలు చంద్రబాబునాయుడు హయాంలో ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ పర్సెంటేజ్ తగ్గించి, రైతులు నష్టపోయేలా చేసినా, పట్టించుకునే నాథుడు లేదు.

**రైతులు నష్టపోనిలే అన్నట్లుగా వ్యవహరించిన తీరు. :** రైతులు ఎప్పుడు నష్టపోకూడదు. రైతు చల్లగా ఉంటేనే రాష్ట్రం బాగు పడుతుంది. రాష్ట్రం బాగుండాలి అంటే, రైతు ముఖంలో చిరునవ్వు ఉండాలి అని చెప్పి.. రైతు పక్షపాత ప్రభుత్వంగా మనం వచ్చినప్పుడు మాత్రమే మార్పులు జరిగాయి. మనం వచ్చినప్పుడు మాత్రమే ఆయిల్‌పామ్‌లో ఆ వ్యత్యాసం తీయడం జరిగింది. నేను ఆ మార్పు చేసి ఆయిల్‌పామ్ సాగులో నష్టపోయిన రైతులకు దాదాపు రూ.90 కోట్లు ఇచ్చి అండగా నిలబడి, ఒక మెసేజ్ పంపించాను. ఆ మెసేజ్ పంపించడంతో, ఆ తర్వాత రేట్లన్నీ ఆటోమేటిక్‌గా 10 ఏళ్లు పెరుగుతాయి. ఇంకా రూ.3 వేల కోట్లతో ప్రభుత్వం తరపు నుంచి మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ తీసుకొచ్చి, ఆ 5 ఏళ్లలో రైతుల తరఫున రూ.7,800 కోట్లు ఖర్చు చేశాం. ప్రతి ఆర్బికేను ఒక కేంద్రంగా ప్రకటించి, ప్రతి జిల్లాలోనూ జాయింట్ కలెక్టర్ మార్క్ ఫెడ్ జాయింట్ ఎండిగా ప్రకటించాం. ప్రతి ఆర్బికేలో పంటల కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ) ప్రకటించి, ఆ వివరాలతో ఏకంగా ఒక బోర్డు పెట్టాం.

ఆ రేట్ల కన్నా తక్కువ రేట్లకు ఏదైనా పడిపోతే, వెంటనే ఆర్బికే పరిధిలో ఉన్న అసిస్టెంట్ అగ్రికల్చరల్ గ్రాడ్యుయేట్ వెంటనే అలర్ట్ సిగ్నల్ ఇచ్చేవాడు. ఆ అలర్ట్ సిగ్నల్ సీఎం--యాప్ (కంటిన్యూస్ మానిటరింగ్ ఆఫ్ అగ్రికల్చరల్ ప్రైస్ అండ్ ప్రొక్యూర్‌మెంట్)ని యాక్టివేట్ చేసేది. దాంతో ఏ ఆర్బికే పరిధిలో అయితే పంట ధర పడిపోయిందో, అక్కడ జాయింట్ కలెక్టర్ ఎంటర్ అయి, వెంటనే పంట కొనుగోలు చేసేవాళ్లు. అలా రేటులో పోటీ ఏర్పడేది. దాని వల్ల ఏ రైతూ నష్టపోయే పరిస్థితి ఉండేది కాదు. ఆ ప్రక్రియలో ఏకంగా రూ.7,800 కోట్లు మనం ఖర్చు చేశాం కాబట్టే, ఏ పంటకు, ఏ రైతు ఆరోజు నష్టపోలేదు.

అందుకే అప్పుడు గిట్టుబాటు ధర రాని పరిస్థితి అనేది ఏ రోజు ఒక ఇష్యూ కింద కూడా రాలేదు. రైతులకు ప్రభుత్వం ఉందన్న భరోసా ఎప్పుడైతే మార్కెట్‌లోకి వెళ్ళిపోయిందో, ఆటోమేటిక్‌గా ప్రతి పంటకు రేట్లు వచ్చాయి. కానీ, ఈరోజు ఆ పరిస్థితి పూర్తిగా సన్నగిల్లిపోయింది. రైతులకు ఈ ప్రభుత్వం తోడుగా లేదు అన్న మెసేజ్ ఉంది కాబట్టి, దళారీల వ్యవస్థ ఈరోజు సిండికేట్‌గా మారి, రైతులందరినీ పూర్తిగా నష్టపరుస్తోంది. అందుకే రైతులకు తోడుగా నిలుస్తాం. ప్రభుత్వాన్ని మేలుకొలిపే కార్యక్రమం చేయగలిగినంత చేస్తాం. రైతులకు నిజంగా మంచి జరగాలన్నా, శాశ్వత మంచి జరగాలన్నా, మనం ఏదైనా చేయాలంటే మూడేళ్లు ఓపిక పట్టాల్సిందే. అయినా ఆలోపు కచ్చితంగా రైతుల తరఫున ఈ ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చే కార్యక్రమం చేస్తాం. అలా అన్ని రకాలుగా రైతులకు తోడుగా ఉండే కార్యక్రమం చేస్తాం. ఏయే జిల్లాల్లో రైతులు ఇబ్బంది పడుతున్నారో.. అక్కడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతులకు అండగా నిలబడుతుంది.

అలాగే వారం, పది రోజుల్లో నా పర్యటన కూడా ఉంటుంది. గత ఏడాది ప్రకాశం జిల్లాకు వెళ్లాను కాబట్టి, ఈసారి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో గోపాలపురంలో కానీ, జంగారెడ్డిగూడెంలో కానీ పర్యటిస్తాను. అలా పొగాకు రైతుల సమస్యను రాష్ట్రమంతా వినిపించే ప్రయత్నం చేస్తాను. ఆ తర్వాత కూడా ప్రభుత్వం నుంచి ఎలాంటి చలనం లేకపోతే, కొంత గ్యాప్ ఇచ్చి మళ్లీ కార్యక్రమాలు ప్లాన్ చేస్తాము. ఈ ప్రభుత్వం నిద్ర నటిస్తోంది. నిద్ర పోయే వాళ్ళను లేపొచ్చు. కానీ, నిద్ర నటించే వాళ్లను లేపడం కష్టం. అయినా గట్టిగా ప్రయత్నించి, ప్రభుత్వాన్ని నిద్ర లేపేందుకు ప్రయత్నిస్తామని వైయస్ జగన్ వివరించారు.

### వేగం పుంజుకున్న పల్నాడు-ప్రకాశం 'జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధార'

# మెగా తాగు నీటి పథకాల పనులు

పథకాల పనుల పురోగతిపై గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని ఆర్.డబ్ల్యూ.ఎస్. అధికారులు వివరించారు. రెండు మెగా ప్రాజెక్టుల అంచనా వ్యయం దాదాపు రూ. 2,500 కోట్లు కాగా, అందులో రూ. 1,290 కోట్ల అంచనా వ్యయంతో ప్రకాశం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో, 593 ఆవాసాలకు తాగునీరు అందించే లక్ష్యంతో ప్రారంభించిన ప్రకాశం మెగా వాటర్ గ్రిడ్ పథకానికి సంబంధించి ఇంటేక్ వెల్ నిర్మాణం పనులు 40 శాతానికి పైగా పూర్తయ్యాయి. 119 మిలియన్ లీటర్ల నీటి శుద్ధి ప్లాంట్ పనులు, సంపులు, గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు పురోగతిలో ఉన్నాయి. ప్రకాశం వాటర్ గ్రిడ్ పథకం కింద ఇప్పటి వరకు 53 కిలోమీటర్ల మేర పైపు లైన్ల నిర్మాణం పూర్తి చేసినట్టు వివరించారు.రూ. 1,200 కోట్లతో చేపట్టిన పల్నాడు వాటర్ గ్రిడ్ పథకాన్ని 235 ఆవాసాలకు తాగునీరు అందించే లక్ష్యంతో ప్రారంభించగా, ఇప్పటికే 152 కిలోమీటర్ల మేర పైపు లైన్ నెట్వర్క్ పూర్తయ్యింది. ఇన్ టేక్ వెల్స్, రిజర్వాయర్లు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం పనులు కూడా పురోగతిలో ఉన్నట్టు తెలిపారు. ఇప్పటికే రూ. 95 కోట్లు విలువ చేసే పనులు పూర్తి చేసినట్టు తాగునీటి సరఫరా విభాగం అధికారులు వివరించారు.

అనంతరం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "తాగు నీటి సమస్యతో ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులుపడుతున్న పల్నాడు, ప్రకాశం ప్రాంతాల ప్రజలకు ఈ ప్రాజెక్టులు జీవనాధారంగా మారనున్నాయి. ఈ రెండు ప్రాంతాల్లో జల్ జీవన్ మిషన్ కింద చేపట్టిన అమరజీవి జలధార మెగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులు చాలా కీలకమైనవి. వీటి నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. నిర్ణీత గడువులోపు ఈ రెండు ప్రాజెక్టులను పూర్తి చేసి, లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి ఇంటికీ తాగు నీటి సౌకర్యం అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టాలి. గ్రామాల మధ్య పైపు లైన్ల నిర్మాణం, అటవీ అనుమతులు లాంటి సమస్యలు ఉంటే తక్షణం పరిష్కరించుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయండి.

పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా నిర్మాణ కార్యకలాపాలను సాధ్యమైనంత వేగంగా ముందుకు తీసుకువెళ్లాలి. భుజం శస్త్ర చికిత్స నుంచి పూర్తిగా కోలుకున్న తర్వాత పనుల పురోగతిని పరిశీలించేందుకు క్షేత్ర స్థాయి పర్యటనలు చేపడతాను. స్వయంగా పనుల నాణ్యతను పరిశీలిస్తా. జల్ జీవన్ మిషన్ పనుల్లో అలసత్వానికి తావివ్వొద్దు. పల్నాడు, ప్రకాశం మెగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులు పూర్తయితే ఈ రెండు ప్రాంతాల పరిధిలోని సుమారు 10 నియోజకవర్గాల పరిధిలో 16 లక్షల మందికి పైగా ప్రజలకు శాశ్వత తాగునీటి భద్రత ఏర్పడుతుంద"న్నారు.

### భూ హక్కుల రక్షణే ప్రభుత్వ ధ్యేయం-ఇకపై

# '22ఏ' చిక్కుల నుంచి భూములకు విముక్తి

బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి అనగాని మాట్లాడుతూ ఆస్తుల నిర్వహణకు పారదర్శకమైన విధానం ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం సరళీకృత విధానాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని దీంతో పేదలకు సామాన్యులకు రైతులకు మరింత ఊరట లభించనుందని అన్నారు. ఈ నూతన ఉత్తర్వులు గతంలో జారీ చేసిన పాత సర్క్యులర్లు అన్నింటినీ రద్దు చేయడంతో పాటు భూ రికార్డుల్లో అక్రమ మార్పులకు ఆస్కారమిచ్చే మాన్యువల్ ఎంట్రీలకు స్వస్తి పలుకుతుందని అన్నారు.వ్యవసాయ భూములకు సంబంధించి 'వెబ్‌ల్యాండ్ 2.0' మాత్రమే ఉంటుందన్నారు.నిషేధిత ఆస్తుల యొక్క ఏకైక సెంట్రలైజ్డ్ మరియు అధికారిక డేటాబేస్ నిర్వహణ ఇక రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ ఐజీ వద్ద ఉంటుందని అన్నారు.18-06-1954 నాటికి ముందు అసైన్ చేసిన భూములు,సుప్రీంకోర్టు ఉత్తర్వులకు లోబడి దేవాలయాలు లేదా వక్ఫ్ బోర్డుల నుండి చట్టబద్ధంగా వేలంలో కొనుగోలు చేసిన భూములు,విలేజ్ సర్వీస్ ఇనాంలు,షరతులతో కూడిన పట్టా భూములు,పాత కాలంనాటి అన్-అప్రూవ్డ్ లేఅవుట్ల భూములను 22ఏ నిషేధిత జాబితా నుండి పూర్తిగా తొలగిస్తున్నామని అనగాని సత్యప్రసాద్ తెలిపారు.అలాగే గ్రామకంఠం భూములు ఎట్టి పరిస్థితుల్లోనూ 22ఏలో పెట్టకూడదన్నారు.ఏపీఎస్ఎఫ్సీ వేలంలో కొన్న భూములు 22ఏలో ఉంటే తొలగించాలని కొత్త ఉత్తర్వుల్లో పేర్కొన్నామన్నారు. నిర్ణీత విస్తీర్ణం మించిన ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టేందుకు ప్రభుత్వమానికే అథారిటీ ఉంటుదని గ్రామంలో అయితే ఎకరం,పట్టణాల్లో అయితే వెయ్యి చదరపు గజాలకు మించి ఉంటే రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని మంత్రి సత్యప్రసాద్ స్పష్టం చేశారు.నిషేధిత ఆస్థుల జాబితాలో ఉన్న భూమికి సంబంధించి కోర్టులు ఆదేశాలు ఇస్తే 5 రోజుల లోపు రెవెన్యూ అధికారులకు తెలియపర్చాల్సి ఉంటుందన్నారు.ఏదైనా భూమి పట్టాభూమి కాదు ప్రభుత్వ పరిధిలోకి వచ్చే భూమి అని నిరూపించాల్సిన బాధ్యత ఆ సంబంధిత పౌరులది కాదని ప్రభుత్వానిదేనని అన్నారు.ఏ ఆస్తినైనా 22ఏ లో చేర్చేముందు సబ్ డివిజన్ పూర్తిచేసి భూ యజమానికి డిజిటల్ డెలివరీ,రిజిస్టర్డ్ పోస్ట్,ఇంటికి నోటీస్ అంటించడం ద్వారా ముందస్తు షోకాజ్ నోటీస్ ఇవ్వడం తప్పనిసరి చేశారని తెలిపారు. అభ్యంతరాల సమర్పణకు పౌరులకు 30 రోజుల గడువుతో పాటు లాయర్ల ద్వారా వాదనలు వినిపించడానికి మరో 14 రోజుల ప్రత్యేక సమయం ఇచ్చి విచారణ అనంతరం అధికారి రికార్డుల్లో నమోదయ్యేలా కారణాలతో కూడిన 'స్పీకింగ్ ఆర్డర్' జారీ చేయాల్సి ఉంటుందని వివరించారు.22ఏ లో భూములను చేర్చే,తొలగించే అధికారాన్ని కేవలం సబ్-కలెక్టర్,ఆర్డీఓ స్థాయి అధికారులకు మాత్రమే పరిమితం చేస్తూ వారి నిర్ణయంపై అభ్యంతరాలుంటే జిల్లా జాయింట్ కలెక్టర్ కి అప్పీల్ చేసుకునేందుకు ఆ తర్వాత ప్రభుత్వానికి రివిజన్ పిటిషన్ దాఖలు చేసుకునేందుకు పారదర్శకమైన అప్పీలు వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రైవేటీకరణ జరుగుతోందంటూ వైసిపి నేతలు చేస్తున్న కుట్రపూరిత ప్రచారాన్ని మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్రంగా ఖండించారు.పీపీపీ మోడల్ లో ప్రయివేట్ భాగాస్వామి కేవలం భవనాలు,ఆధునిక ఫర్నిచర్,కంప్యూటర్లు,క్యూ మేనేజ్‌మెంట్ వంటి నాన్-స్టాట్యుటరీ మౌలిక వసతుల కల్పనకు మాత్రమే పరిమితమని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 297 కార్యాలయాల్లో కేవలం జిల్లా కేంద్రాల్లోని 26 ఆఫీసుల్లో మాత్రమే దీనిని పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేస్తున్నామని తెలిపారు.దస్తావేజుల పరిశీలన,రిజిస్ట్రేషన్లు,స్టాంప్ డ్యూటీ వసూలు,చట్టబద్ధమైన నిర్ణయాధికారాలన్నీ 100 శాతం ప్రభుత్వ సబ్-రిజిస్ట్రార్ పరిధిలోనే ఉంటాయని,డాక్యుమెంట్ రైటర్ల వృత్తికి,వారి కుటుంబాల ఉపాధికి రూపాయి నష్టం కూడా జరగకుండా ప్రభుత్వం సంపూర్ణ రక్షణ కల్పిస్తుందని ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు.గత వైసీపీ ప్రభుత్వం అనామక కంపెనీకి రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను 90 కోట్ల రూపాయలకు అప్పగించాలని ప్రయత్నించిందని అయితే ఆ కంపెనీకి ఉన్న అసమర్థత కారణంగా వాటిని ఏర్పాటు చేయడంలో విఫలమయిందని అన్నారు.తమ ప్రభుత్వం రెండేళ్ల పాటు అధ్యయనం చేసి ఉత్తమ పద్దతుల్లో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తుంటే ఆపార్టీ విష ప్రచారం చేస్తోందని అన్నారు.ఇతర రాష్ట్రాల్లో విజయవంతం అయిన విధానాలను మన రాష్ట్రంలో అమలు చేయటం వల్ల పరిపాలన మరింత సౌలభ్యవంతంగా మారుతుందని, ప్రజలకు పారదర్శకమైన,వేగవంతమైన సేవలు అందుబాటులోకి వస్తాయనే అభిప్రాయం వ్యక్తం చేశారు.మహారాష్ట్రలో అమలు జరుగుతున్న విధానాలను అధ్యాయనం చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో రీ సర్వే పై చేస్తున్న విమర్శల్లో నిజం లేదని మంత్రి అనగాని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రీ సర్వేను తప్పుల తడకగా నిర్వహించిందని ఇప్పటికీ కూడా ఆ తప్పులను సరి చేస్తున్నామని చెప్పారు.గత ప్రభుత్వం రీ సర్వేకు సరైన సమయం ఇవ్వలేదని కానీ కూటమి ప్రభుత్వం పాలనలో రీ సర్వేకు 200కి పైగా రోజులు కేటాయించామని గ్రౌండ్ ట్రూతింగ్ కే 90 రోజులు కేటాయించామని సర్వే అధికారులు వంద రోజుల పాటు గ్రామాల్లోనే ఉండి రీ సర్వేను నిర్వహిస్తున్నారని చెప్పారు.గత ప్రభుత్వం రీ సర్వేకు కేవలం వంద రోజులు మాత్రమే కేటాయించి తప్పుల తడకగా మార్చిందని తమను కూడా అలాగే చేయమని వైసీపీ నాయకులు చెబుతున్నారా అని మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రశ్నించారు. ఈసమావేశంలో రాష్ట్ర రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖ ఐజి డా.బిఆర్.అంబేద్కర్ పాల్గొన్నారు.

### భూ రికార్డుల శాశ్వత భద్రతకు బ్లాక్‌చెయిన్

ఇక ప్రతి లావాదేవీని ఏ అధికారి, ఎప్పుడు నిర్వహించారనే వివరాలు కూడా శాశ్వతంగా రికార్డుల్లో ఉంటాయి. రికార్డుల్లో ఏమైనా వ్యత్యాసం ఉంటే లావాదేవీ వెంటనే ఆగిపోయేలా వ్యవస్థను రూపొందించారు. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలను ఒకే వేదికపైకి తీసుకువస్తున్న ఈ వ్యవస్థలో ప్రస్తుతం ఆటో మ్యూటేషన్, సబ్-డివిజన్, ఎక్స్‌టెంట్ కరెక్షన్ సహా ఎనిమిది పౌర సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. వ్యవసాయం, మత్స్యశాఖ, గనులు, పరిశ్రమలు, విద్యుత్ శాఖ, సీఆర్‌డీఏ, ఆర్థిక సంస్థలు వంటి విభాగాలు కూడా అవసరమైన మేరకు ఈ సమాచారాన్ని వినియోగించుకునే అవకాశాన్ని కల్పించారు. మొదటి దశలో కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల పరిధిలోని అస్పరి, పెనుమూరు, రేపల్లె, గన్నవరం, కడియం, గుమ్మలక్ష్మీపురం, కొత్తవలస మండలాల్లో ఈ పైలట్ ప్రాజెక్టుగా అమలు కానుంది. ఈ పైలట్ ప్రాజెక్టులో 89 రీ-సర్వే గ్రామాలు, 1,37,763 ల్యాండ్ పార్సెల్ మ్యాప్‌లు కవర్ అవుతున్నాయి.

# సోనమ్‌వాంగ్‌చుక్‌ను కలిసిన కేంద్రమంత్రులు

ప్రభుత్వ విధానాలపై విశ్వాసం ఉంచాలని, పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేయకుండా చూడాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేయాలని వాంగ్‌చుక్‌ను కోరినట్లు పేర్కొన్నాయి. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు వాంగ్‌చుక్‌ను మంగళవారం సఫ్దర్‌గంజ్ నుండి ప్రైవేట్ ఆస్పత్రి మేదాంతకు తరలించిన సంగతి తెలిసిందే. మరోవైపు బుధవారం కూడా జంతర్‌మంతర్‌కు పలువురు విద్యార్థులు చేరుకుంటున్నారు. కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి ) జంతర్‌మంతర్‌లోని నిరసన ప్రాంతాన్ని పునరుద్ధరించింది. కేంద్రం కోల్‌కతా నుండి 20 సిఆర్‌పిఎఫ్ బృందాలను విమానాల ద్వారా ఢిల్లీకి తరలిస్తున్నట్లు సమాచారం.

**ఢిల్లీలో 16 మెట్రో స్టేషన్ల మూసివేత**

మొదట నాలుగు మెట్రో స్టేషన్లను మూసివేసిన ప్రభుత్వం.. మరో 12 స్టేషన్లను మూసివేయాలని ఆదేశించింది. భద్రతా కారణాల దృష్ట్యా తదుపరి ఆదేశాలు వచ్చేంతవరకు మొత్తం 16 స్టేషన్లను మూసివేస్తున్నట్లు ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది.

# పెనమలూరు మండలంలో విద్యుత్ రంగ అభివృద్ధికి మరో ముందడుగు



## యనమలకుదురు - పెదపులిపాకలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటన

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

కృష్ణా జిల్లా పెనమలూరు మండలంలోని యనమలకుదురు, పెదపులిపాక గ్రామాల్లో రాష్ట్ర విద్యుత్, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే బోడే ప్రసాద్, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

పర్యటనలోని ప్రధాన అంశాలు:

33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన:యనమలకుదురులో రూ.4.20 కోట్ల హడ్కో నిధులతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ ఉపకేంద్రం అందుబాటులోకి వస్తే యనమలకుదురు పరిసర ప్రాంతాలకు మరింత నాణ్యమైన, విశ్వసనీయమైన విద్యుత్ సరఫరా లభిస్తుంది.


సోలార్ రూఫ్ టాప్ యూనిట్ ప్రారంభం:పెదపులిపాక ఎస్సీ కాలనీలో రూ.1.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్‌టాప్ యూనిట్‌ను మంత్రి ప్రారంభించారు. పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా ఈ ప్రాజెక్టు ఆదర్శవంతంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

మరో సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవం:రూ.4.20 కోట్ల హడ్కో నిధులతో పెదపులిపాకలో నిర్మాణం పూర్తి చేసుకున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని మంత్రి అధికారికంగా ప్రారంభించారు. దీని ద్వారా పెదపులిపాక, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా సామర్థ్యం పెరిగి, వినియోగదారులకు మెరుగైన సేవలు అందుతాయి."రాష్ట్రంలో ప్రజలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని కార్యక్రమాలు చేపడతాం అని గొట్టిపాటి రవికు మార్ అన్నారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథులుగా మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పాల్గొన్నారు.విద్యుత్ శాఖ తరపున ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి, డైరెక్టర్ (టెక్నికల్) మురళీకృష్ణ యాదవ్, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) టీవీఎస్ఎస్ మూర్తి, సూపరింటెండింగ్ ఇంజ నీర్ హనుమయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విశ్వేశ్వర ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (కన్స్ట్రక్షన్) ఆర్. రవికిషోర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బోడేపూడి నవీన్, సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్లు (AEలు), విద్యుత్ శాఖ సిబ్బంది, కూటమి నాయకులు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా లేదా కైకలూరు ఇంచార్జిగా అవకాశం ఇవ్వండి

## సీఎం చంద్రబాబును కోరిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్రకుమార్ (నాగబాబు)సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి



ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

గవర్నర్ కోటాలో శాసనమండలి సభ్యునిగా (ఎమ్మెల్సీ) లేదా కైకలూరు నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ ఇన్చార్జిగా అవకాశం కల్పించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్రకుమార్ (నాగబాబు) విజ్ఞప్తి చేశారు. సచివాలయాల్లోని ముఖ్యమంత్రి కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడిని కలిసిన ఆయన ఈ మేరకు వినతిపత్రం అందించారు.తెలుగు విద్యార్థి విభాగం నుండి టిడిపి రాష్ట్ర కార్యదర్శి వరకు పార్టీకి అంకితభావంతో పనిచేశానని ఈ సందర్భంగా నాగబాబు పేర్కొన్నారు. సుదీర్ఘకాలంగా కాపు సామాజిక వర్గ నేతగా రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందానని తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో (ప్రస్తుత ఏలూరు జిల్లా) ఎలాంటి రాజకీయ వారసత్వం లేకుండా, నిబద్ధతతో పనిచేస్తూ ఎదిగినట్లు చెప్పారు. గడచిన 35 ఏళ్లుగా పార్టీ అప్పగించిన ప్రతి బాధ్యతనూ సమర్థవంతంగా నిర్వహించానని వివరించారు.పార్టీలో సుదీర్ఘ సేవా ప్రస్థానం:తన రాజకీయ ప్రస్థానంలో ఉమ్మడి కృష్ణా జిల్లా తెలుగు యువత కార్యాలయ కార్యదర్శిగా, జిల్లా టిడిపి కార్యాలయ కార్యదర్శిగా, 2014-2019 మధ్య కృష్ణా జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గా, టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా, ఉండి నియోజకవర్గం రాష్ట్ర పార్టీ పరిశీలకునిగా సేవలు అందించినట్లు తెలిపారు.అలాగే 2009-2014 మధ్య స్థానిక సంస్థలు, మున్సిపల్, ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల్లో జిల్లా పార్టీ ఎలక్షన్ మానిటరింగ్ సెల్ సభ్యునిగా బాధ్యతలు నిర్వర్తించానన్నారు. కైకలూరు నియోజకవర్గ ప్రచార కార్యదర్శిగా, 2019 సార్వత్రిక ఎన్నికల్లో పెడన నియోజకవర్గ పరిశీలకునిగా, నూజివీడు, ఆకివీడు మున్సిపల్ ఎన్నికలు, తిరుపతి పార్లమెంట్ ఉపఎన్నికల సమయంలో శ్రీకాళహస్తి పరిశీలకునిగా విజయవంతంగా పనిచేసినట్లు గుర్తుచేశారు.పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా నిబద్ధతతో సేవలు అందించానని, పరిశీలకునిగా రాష్ట్రం లోని 45 నియోజకవర్గాల్లో నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసిన అనుభవం ఉందన్నారు. కూటమి నిర్ణయాలను గౌరవించే క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా తన సేవలను గుర్తించి ఎమ్మెల్సీగా లేదా కైకలూరు ఇంచార్జిగా అవకాశం ఇవ్వాలని కోరారు.స్పందించిన సీఎం:నాగేంద్రకుమార్ వినతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారు. పార్టీ కోసం చేసిన సేవలను గుర్తించి, ఈ అభ్యర్థనను తప్పకుండా పరిశీలిస్తానని హామీ ఇచ్చారు.

# బల్క్ వేస్ట్ జనరేటర్లను గుర్తించి మూలంలోనే వ్యర్థాల నిర్వహణ చేపట్టాలి

## మున్సిపల్ కమిషనర్లకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజి ఆదేశం



మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

స్వచ్ఛ గ్రామం – సుపరిపాలన గ్రామం – అభివృద్ధి గ్రామం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొం దిస్తున్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్–2026కు అనుగుణంగా పట్టణాల్లో బల్క్ వేస్ట్ జనరేటర్లను గుర్తించి, వ్యర్థాలను మూలంలోనే శాస్త్రీయంగా నిర్వహించేలా చర్యలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ, పొల్యూషన్ తదితర సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఘన వ్యర్థాల నిర్వహణ, బల్క్ వేస్ట్ జనరేటర్ల గుర్తింపు, కంపోస్టింగ్ విధానాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానాల వినియోగంపై విస్తృతంగా చర్చిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రోజుకు 100 కిలోలకుపైగా తడి చెత్త ఉత్పత్తి చేసే సంస్థలు, 20 వేల చదరపు అడుగులకు పైబడిన భవనాలు, 40 వేల లీటర్లకు పైగా నీటిని వినియోగించే సంస్థలు బల్క్ వేస్ట్ జనరేటర్ల పరిధిలోకి వస్తాయని తెలిపారు.

ఫంక్షన్ హాల్స్, హోటళ్లు, ఆస్పత్రులు, విద్యాసంస్థలు, అపార్ట్‌మెంట్లు, షాపింగ్ కాంప్లెక్సులు, పరిశ్రమలు తదితర సంస్థలను తప్పనిసరిగా గుర్తించి నిబంధనల పరిధిలోకి తీసుకురావాలని సూచించారు.ఈ నెలాఖరులోగా అన్ని మున్సిపాలిటీల్లో బల్క్ వేస్ట్ జనరేటర్ల సమగ్ర జాబితాను సిద్ధం చేయాలని కమిషనర్లను ఆదేశించిన కలెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలు, సుప్రీంకోర్టు ఆదేశాలు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనలను ప్రతి సంస్థ తప్పనిసరిగా అమలు చేసేలా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.బల్క్ వేస్ట్ జనరేటర్లు తడి, పొడి, ప్రమాదకర, శానిటరీ వ్యర్థాలను మూలంలోనే వేరు చేయడం, తడి చెత్తను కంపోస్టింగ్ లేదా బయోగ్యాస్ ద్వారా శుద్ధి చేయడం, ప్లాస్టిక్, కాగితం, లోహం వంటి పొడి వ్యర్థాలను రీసైక్లింగ్‌కు పం పించడం, వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో లేదా కాలువల్లో వేయకుండా శాస్త్రీయంగా నిర్వహించడం వంటి బాధ్యతలను తప్పనిసరిగా నిర్వర్తించాలని కలెక్టర్ తెలిపారు.

తడి చెత్తను విలువైన సేంద్రీయ ఎరువుగా మార్చేందుకు ఆధునిక కంపోస్టింగ్ పద్ధతులు, డబుల్ కంపోస్టింగ్ బిన్స్, బయోగ్యాస్ యూనిట్లు, కంపోస్ట్ పిట్స్ వంటి విధానాలను విస్తృతంగా ప్రోత్సహించాలని సూచించారు. గ్రీన్ రిచ్ సంస్థ రూపొందించిన డబుల్ బిన్స్ ద్వారా ఒక బిన్ నిండిన తర్వాత మరో బిన్ వినియోగిస్తే సుమారు 30 రోజుల్లో సేంద్రీయ ఎరువు సిద్ధమవుతుందని, రోజుకు 5 కిలోల నుంచి ఒక టన్ను వరకు తడి వ్యర్థాలను శాస్త్రీయంగా ప్రాసెస్ చేసే పరికరాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.సమావేశంలో మచిలీపట్నం, గుడివాడ, పెడన, ఉయ్యూరు మున్సిపల్ కమిషనర్లు బాపిరాజు, మనోహర్ రావు, కొండయ్య, సుభాష్ చంద్రబోస్, జిల్లా పంచాయతీ అధికారిణి ఎం ధనలక్ష్మి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ శ్రీనివాస్, గ్రీన్ రిచ్ సంస్థ డైరెక్టర్ ఎస్ శరవణ రాజ్ తదితర అధికారులు పాల్గొన్నారు.



# వైకాపా నేతలకు శాంతిభద్రతలపై మాట్లాడే నైతిక హక్కు లేదు

## అంబటి రాంబాబు, పేర్ని నాని వ్యాఖ్యలకు కృష్ణాజిల్లా తెదేపా అధ్యక్షుడు వీరంకి వెంకట గురుమూర్తి ఘాటు కౌంటర్

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

రాష్ట్రంలో శాంతిభద్రతల గురించి మాట్లాడే నైతిక అర్హత వైకాపా నాయకులకు లేదని తెదేపా కృష్ణాజిల్లా అధ్యక్షుడు వీరంకి వెంకట గురుమూర్తి తీవ్రంగా ధ్వజమెత్తారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, పేర్ని నాని చేసిన వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు.గత వైకాపా పాలనలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా దెబ్బతిన్నదని, రాజకీయ హత్యలు, దాడులు, ప్రత్యర్థులపై అక్రమ కేసులు, పోలీసు వ్యవస్థపై తీవ్ర రాజకీయ ఒత్తిళ్లు నిత్యకృత్యంగా మారాయని విమర్శించారు. వైకాపా పాలన అంతా అరాచకమే!రేపల్లెలో అమర్‌నాథ్ గౌడ్ హత్య, తెదేపా కార్యకర్త తోట చంద్రయ్య దారుణ హత్య, డాక్టర్ సుధాకర్ ఉదంతం, ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య వంటి భయంకర ఘటనలు వైకాపా హయాంలోనే జరిగాయని గురుమూర్తి గుర్తుచేశారు. ఆ సమయంలో శాంతిభద్రతల గురించి పేర్ని నాని, అంబటి రాంబాబు ఎందుకు నోరు విప్పలేదని ప్రశ్నించారు."తెదేపా కార్యకర్త తోట చంద్రయ్యను దారుణంగా హత్య చేసిన నిందితుల్లో ఒకరిని ఏకంగా ఎంపీపీగా చేసిన చరిత్ర వైకాపాది. అలాంటి వారు నేడు చట్టవ్యవస్థ గురించి నీతులు మాట్లాడటం ప్రజలను మోసం చేయడమే! అని వీరంకి వెంకట గురుమూర్తి అన్నారు.2024 ఎన్నికల సమయంలో పేర్ని నాని కుమారుడు కిట్టు పోలీస్ స్టేషన్‌లోకి వెళ్లి హంగామా చేసిన ఘటనను ప్రజలు ఇంకా మర్చిపోలేదని, అప్పట్లో పోలీసు వ్యవస్థను ఎవరు బెదిరించారో రాష్ట్ర ప్రజ లందరికీ స్పష్టంగా తెలుసని అన్నారు.కూటమి పాలనలో చట్టం తన పని తాను చేస్తోందికూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే రాష్ట్రంలో శాంతిభద్రతలు మళ్లీ గాడిన పడ్డాయని గురు మూర్తి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో చట్టం తన పని తాను నిష్పక్షపాతంగా చేసుకుపోతోందని, తప్పు చేసిన వారు ఏ పార్టీకి చెందినవారైనా సరే ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

తక్షణ చర్యలు: గుంటూరు ఘటనలో ప్రభుత్వం అత్యంత వేగంగా స్పందించి నిందితులను వెంటనే అరెస్ట్ చేసి జైలుకు పంపింది.

పార్టీ క్రమశిక్షణ: ఆరోపణలు ఎదుర్కొంటున్న సొంత పార్టీ వ్యక్తిని కూడా వెనుకాడకుండా పార్టీ నుంచి సస్పెండ్ చేసి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకుంది.

బాధితులకు అండగా: ఘటన జరిగిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే గల్లా మాధవి బాధితుల కుటుంబాన్ని పరామర్శించి, ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా నిలిచారని చెప్పారు.గతంలో రాష్ట్రాన్ని అరాచకాలకు నిలయంగా మార్చిన వైకాపా నేతలు ముందుగా తమ పాలనలో జరిగిన ఘోరాలపై ప్రజలకు సమాధానం చెప్పాలని, ఆ తర్వాతే నీతులు మాట్లాడాలని గురుమూర్తి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెదేపా కృష్ణాజిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి బత్తిన దాస్ కూడా పాల్గొన్నారు.

# పచ్చదనమే ప్రగతికి పునాది –ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి..

## మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణతో పాటు మచిలీపట్నాన్ని హరిత నగరంగా తీర్చిదిద్దుతాం నగరంలోని 13వ డివిజన్లో మొక్కలు నాటిన రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర



ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

పచ్చదనం పెంపొందించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేప డుతున్న హరిత కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్ ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, కూటమి నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులతో కలిసి మంత్రి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సంద ర్భంగా మంత్రి మాట్లాడుతూ, గతంలో ఇదే ప్రాంతంలో నాటిన మొక్కలకు ట్రీ గార్డులు ఏర్పాటు చేసి వాటిని సంరక్షించడం అభినందనీయమని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రి రహదారిపై నీడనిచ్చే చెట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, నేడు నాటిన మొక్కలు భవిష్యత్తులో ఈ ప్రాంతానికి చల్లని నీడను, స్వచ్ఛమైన వాతావరణాన్ని అందిస్తాయని తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో గ్రీన్ కవర్‌ను పెంచేందుకు వర్షాకాలాన్ని సద్వినియోగం చేసుకుని పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని పిలుపునిచ్చారని, ఆ లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా హరిత కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.ఇటీవల గుడివాడలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌కు 'క్లీన్ స్వీప్' అవార్డు లభించడం పట్టణానికి గర్వకారణమని మంత్రి అన్నారు. రాష్ట్రం లో తొలి స్థానంలో నిల వడం వెనుక మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజల సహకారం ఎంతో ఉందని వారందరినీ అభినందించారు.పట్టణంలో చెత్త, మురుగు పేరుకుపోయే బ్లాక్ స్పాట్లను గుర్తించి వాటిని గ్రీన్ స్పాట్లుగా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక శ్రద్ధతో డ్రైనేజీలపై ఉన్న ఆక్రమణలను తొలగించడం వల్ల మురుగునీటి పారుదల పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు.ధర్మంచెరువు, మూడు స్తంభాల సెంటర్ పరిసర ప్రాంతంలో సుమారు 18 ఎకరాల్లో అర్బన్ ఫారెస్ట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొం దించిందని మంత్రి తెలిపారు. న్యాయపరమైన చిన్నచిన్న ఆటంకాలు తొలగిన వెంటనే పనులు ప్రారంభిస్తామని, పట్టణంలోకి ప్రవేశించే వారికి ఆహ్లాదకరమైన హరిత వాతావరణాన్ని అందిం చేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు.రైల్వే స్టేషన్ సమీపంలోని ఐలాండ్ పార్క్ అభివృ ద్ధి పనులు దాదాపు పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులతో రూ. 12 కోట్ల వ్యయంతో పార్కులు, శ్మశానవాటికలు, ఇతర ప్రజా ప్రదేశాలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. వీటి నిర్వహణ కోసం స్థానిక ప్రజలతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.మచిలీపట్నం పట్టణంలో అంతర్గత డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి రూ.75 కోట్ల నిధులు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్‌టీపీలు), పంపింగ్ వ్యవస్థల పనులు త్వరలోనే పూర్తి చేసి వచ్చే ఏడాదిలోపు డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని చెప్పారు.పట్టణానికి ప్రత్యేక గుర్తింపుగా రూ.1 కోట్ల వ్యయంతో మచిలీపట్నం ప్రవేశ ద్వారం (ఎంట్రీ గేట్) నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. పట్టణ సౌందర్యాన్ని పెంపొందించేలా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.ప్రజలందరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలని మంత్రి ఈ సందర్భంగా కోరారు.కార్యక్రమంలో మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ నాని, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పీవీ ఫణి కుమార్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, కూటమి నాయకులు లోగిశెట్టి వెంకటస్వామి, రాజేంద్ర ప్రసాద్, లంకే శేషగిరిరావు, మధు తదితర నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## ప్రతి అర్జీని సత్వరమే పరిష్కరించేలా చర్యలు మచిలీపట్నంలో ప్రజా దర్బార్ నిర్వహించిన రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం ప్రజాభూమి ప్రతినిధి

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం మచిలీపట్నం నగరంలోని బృందావనం థియేటర్ సమీపంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను స్వయంగా ఆలకించి, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి వీలైన వాటిని అక్కడికక్కడే పరిష్కరించాలని ఆదేశించారు. మిగిలిన అర్జీలను సంబం ధిత శాఖలకు పంపించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సందర్భం గా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి వారం నియోజకవర్గ స్థాయిలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తూ పారదర్శక పాలన అందిస్తోందన్నారు. బుధవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో సుమారు 50కు పైగా అర్జీలు అందాయని తెలిపారు.ఇప్పటి వరకు ప్రజా ఫిర్యాదుల కింద 489 అర్జీలు అందగా, వాటిలో 370 అర్జీలు నిర్ణీత గడువులో (ఎస్ఎల్ఏ) పరిష్కార ప్రక్రియలో ఉండగా, 110 అర్జీలు గడువు దాటిన (బియాండ్ ఎస్ఎల్ఏ) కేసులుగా ఉన్నాయని తెలిపారు. వాటిని కూడా అత్యంత త్వరలో పరిష్కరించి ప్రజలకు న్యా యం చేస్తామని మంత్రి పేర్కొన్నారు.ప్రధానంగా రెవెన్యూ, గృహ నిర్మాణం, పెన్షన్లకు సంబంధించిన సమస్యలే అధికంగా వస్తున్నా యని తెలిపారు. వాటిపై ప్రత్యేక దృష్టి సారించి సంబం ధిత అధికారులతో సమన్వయం చేస్తూ త్వరితగతిన పరిష్కార చర్యలు చేపడుతున్నామని చెప్పా రు. పెన్షన్ల విషయంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తోందని మంత్రి తెలిపారు. గతంలో వివిధ కారణాలతో నిలిచిపోయిన అర్హులైన లబ్ధిదారులకు కూడా పెన్షన్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి అర్హులందరికీ న్యా యం చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల గురిం చి వివరిస్తూ, 'తల్లికి వందనం' పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 68 లక్షల మంది విద్యార్థులు, 48 లక్షల మంది తల్లుల ఖాతాల్లో రూ.15 వేల చొప్పున ఆర్థిక సహాయం జమ చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకానికి ప్రభుత్వం సుమారు రూ.10,500 కోట్లు వ్యయం చేస్తోందన్నారు.అదేవిధంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, ప్రతి నెల ఒకటో తేదీన సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు.ప్రజలకు అందుబాటులో ఉండే బాధ్యతాయుతమైన పాలనను అందించాలనే ఉద్దేశంతో ప్రజా దర్బార్ కార్యక్రమాలను నిరంత రం నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే ఈ నెల 27వ తేదీ నుంచి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు.కార్యక్రమంలో జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండి రామకృష్ణ, కృష్ణా జిల్లా తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ,మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ నాని, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పీవీ ఫణి కుమార్, , జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు లోగిశెట్టి వెంకటస్వామి, సుబ్రహ్మణ్యం, గడ్డం రాజు, కే సుశీల తదితర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ఎల్నినో కారణంగా రైతులు ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలి

### లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో పంట పొలాల వద్ద రైతులతో మాట్లాడిన అనంతరం ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి.





**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.**

ఎల్నినో కారణంగా సాగునీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ఆరుతడి పంటలు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి రైతులకు సూచించారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో బుధవారం పొలాల వద్ద నున్న రైతల వద్దకు వెళ్లి వారి సమస్యలను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఎల్నినో కారణంగా జిల్లాలో సాగు, త్రాగునీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నదని, జిల్లా యంత్రాంగం సాగునీరు అందించేందుకు ప్రత్యేక ప్రణాలిక రూపొందించి అమలు చేస్తున్నదని, అయినప్పటికీ అధిక నీటివినియోగ పంటల నుండి ఆరుతడి పంటల సాగుకు రైతులు ప్రయత్నించాలన్నారు. సాగునీటి లభ్యతపై సవివరంగా కలెక్టర్ రైతులకు తెలియజేసి, వారి సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. సాగునీటి లభ్యత, ఆరుతడిపంటలపై రైతులకు అవగాహన కలిగించాలని వ్యవసాయశాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం గ్రామంలోని రామకృష్ణ మాన్యుర్ డిపోని ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలో యూరియా, డిఏపి ఎరువుల నిల్వలను తనిఖీ, రిజిస్టర్ లను పరిశీలించారు. ఎరువుల నిల్వలను దుకాణంలోని నోటీసు బోర్డులో తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు. యాప్ ద్వారా మాత్రమే రైతులకు ఎరువులను అందించాలన్నారు. ఎరువులను నిర్దేశించిన ధరలకే అమ్మాలని, అధిక ధరలకు అమ్మినా, అక్రమంగా నిల్వ చేసి, బ్లాక్ మార్కెటింగ్ చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పాత్రికేయులతో మాట్లాడుతూ జిల్లాలో ఎరువుల జిల్లాలో ఎరువుల పంపిణీని పారదర్శకంగా చేపట్టామన్నారు. జూలై నెలలో యూరియా అవసరాలు 7089 మెట్రిక్ టన్నుల కాగా, 17 వేల 967 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాదులో ఉన్నాయని, అదేవిధంగా డిఏపి 3506 మెట్రిక్ టన్నులకు గాను 5044 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని, జిల్లాలో ఎరువులకు ఎటువంటి కొరతా లేదన్నారు. రైతులకు అవసరమైన ఎరువులను ఏపిఏఐఎంఎస్ ద్వారా అందిస్తున్నామని, ఇప్పటివరకు 6197 మెట్రిక్ టన్నుల ఏరియా, 1712 మెట్రిక్ టన్నుల డిఏపి అందించామన్నారు. జిల్లాలో ఎరువుల అక్రమ నిల్వ, బ్లాక్ మార్కెటింగ్ నియంత్రణకు ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ఇంతవరకు 174 ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి 11 దుకాణాల లైసెన్స్ లు రద్దు చేశామని, 4గురిపై 6ఏ కేసులు నమోదు చేసి, 71 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. 140. 24 లక్షల రూపాయల విలువైన స్టాక్ ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ బి. వినూత్న, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా, తహసీల్దార్ నజీముల్లాషా, ఎంపిడిఓ వాణి , ప్రభృతులు పాల్గొన్నారు.

## నీట్ ఉద్యమంపై లాఠీచార్జీకి నిరసనగా ఏలూరులో ఆందోళన



**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు**

నీట్ పరీక్షా పత్రాల లీకేజీ వ్యవహారంపై ఢిల్లీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు, యువజనులపై జరిగిన లాఠీచార్జిని ఖండిస్తూ మంగళవారం ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లో ఐఎఫ్‌టీయూ,పీవైఎల్, ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వి., పీవైఎల్ జిల్లా నాయకుడు టి. బాబురావు, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు పోరండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, నగర అధ్యక్షుడు బి. సోమయ్య, నగర ప్రధాన కార్యదర్శి ఎర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## అమెరికాతో ఫ్రీ ట్రేడ్ డీల్‌కు వ్యతిరేకంగా ఏలూరులో రైతు సంఘాల నిరసన



**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు**

అమెరికాతో కేంద్ర ప్రభుత్వం కుదుర్చుకోనున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఫ్రీ ట్రేడ్ డీల్) దేశ వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం కలిగిస్తుందని ఆరోపిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) పిలుపు మేరకు ఏలూరులో రైతు, కార్మిక సంఘాలు నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు పోరండ్ల శ్రీనివాస్,బీకేఎంయూ జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు,కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకుడు రాజనాల రామ్మోహనరావు, ఏఐయుకేఎస్ జిల్లా నాయకుడు సిరికొండ రామారావు మాటాడుతూ, అమెరికాతో ఫ్రీ ట్రేడ్ డీల్ రైతుల పాలిట ఉరితాడుగా మారుతుందని విమర్శించారు. ఈ ఒప్పందంపై కేంద్ర ప్రభుత్వం సంతకం చేయవద్దని, రైతులకు మద్దతు ధరల గ్యారంటీ చట్టం తీసుకురావాలని,రైతు రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస డాంగే, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు మాట్లాడుతూ రైతు వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. వివిధ రైతు,కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు నిరసనలో పాల్గొన్నారు.

## రాజరాజేశ్వరి నగర్‌లో రూ.31 లక్షల సీసీ రోడ్డు ప్రారంభించిన ఎమ్మెల్యే బడేటి చంటి



**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు**

నగరంలోని 13వ డివిజన్‌లోని రాజరాజేశ్వరి నగర్‌లో రూ. 31 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన సీసీ రహదారిని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి బుధవారం ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఆయన, ప్రజలకు ఇచ్చిన హామీల అమలే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఏలూరు అభివృద్ధికి ప్రధాన రహదారుల విస్తరణ, నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నామని, రాజరాజేశ్వరి నగర్‌లోని రహదారి సమస్యను పరిష్కరించామని తెలిపారు. స్థానికులు కోరిన ఇతర అభివృద్ధి పనులను కూడా దశలవారీగా చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ విజయవాడ జోన్-2 చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఏఎంసీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, డిప్యూటీ మేయర్ కర్రి శ్రీనివాస్, ఎస్సెమ్మార్ పెదబాబు,పైడి వెంకట్రావు,మెరుగుమాల శ్రీను,మెరుమాల యేసుమని, దావూద్, ఊడి రాజశేఖర్,లంకపల్లి మాణిక్యాలరావు,దొడ్డి గట్ల శుభమాలిక్,తెర్లి వెంకటేశ్వరరావు,కటికతల యేసు తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రక్తహీనత నివారణతోనే ఆరోగ్యవంతమైన విద్యార్థి జీవితం - పోషకాహారం, ఐరన్ మాత్రలు తప్పనిసరి: వైద్యుల సూచన

**ప్రజాభూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**



బొద్దనపల్లి మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ హాస్టల్‌లో ఈదర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో 164 మంది విద్యార్థినులకు రక్తహీనత (అనీమియా) నిర్ధారణ పరీక్షలు నిర్వహిం చారు. పరీక్షల్లో హీమోగ్లోబిన్ స్థాయి తక్కువగా ఉన్న విద్యార్థినులకు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలను పంపిణీ చేసి, వాటిని వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వైద్యుడు జ్ఞానసందీప్ మాట్లాడుతూ, శరీరంలో ఐరన్ లోపం, సరైన పోషకాహారం తీసుకోకపోవడం వంటి కారణాల వల్ల రక్తహీనత ఏర్పడుతుందని తెలిపా రు. ఆకుకూరలు, పప్పుధాన్యాలు, శనగలు, బెల్లం, ఖర్జూరం, గుడ్లు వంటి ఐరన్ అధికంగా ఉండే ఆహారాన్ని నిత్యం తీసుకోవడం, వైద్యులు సూచించిన మాత్రలను క్రమం తప్పకుండా విని యోగించడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని వివరించారు. జ్వరం, దగ్గు, అలసట వంటి సాధారణ ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. ప్రతి విద్యార్థిని ఆరోగ్యంగా ఉంటూ క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.

## ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ -2026
## క్షేత్రస్థాయిలో పరిశీలించి, అభ్యంతరాలు లేని ఓటరు జాబితాను రూపొందించాలి.

- **స్వర్ణగ్రామ, స్వర్ణవార్డు సచివాలయాలు ప్రజలు తృప్తిచెందేలా సేవలు అందించాలి.**
- **జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి**



**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.**


ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ -2026 క్షేత్రస్థాయిలో పరిశీలించి, అభ్యంతరాలు లేని ఓటరు జాబితాను రూపొందించాలని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆదేశించారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెం స్వర్ణగ్రామ సచివాలయంలో బుధవారం అధికారులు, బిఎల్వో లతో జిల్లా కలెక్టరు సమీక్షించారు. 50 మంది బిఎల్వోలు, 50 పోలింగు స్టేషన్లు యాప్ లను పరిశీలించారు. వివరాలను అడిగితెలుసుకున్నారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీలు చేశారు. వివిధ ప్రభుత్వ పథకాలు అమలు తీరుపై వెరిఫై చేసి, అందుతున్న సేవలుపై ప్రజలను జిల్లా కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ -2026 ప్రక్రియ జూలై 24, 2026 వరకు కొనసాగుతుందని ప్రతి బూత్ లెవెల్ అధికారి, తమ పోలింగు కేంద్రం పరిధిలో ప్రతి ఇంటిని సందర్శించి గణన ఫారంను ఓటర్లకు అందించి పూర్తిచెయ్యాలని ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతీ పౌరుడు ఓటరు జాబితాలో నమోదు కావడం, అదేసమయంలో అనర్హులైన వ్యక్తులు పేర్లు ఓటరు జాబితాలో చేరకుండా ఉండడం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ యొక్కప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. ఈ ప్రక్రియ నిర్దేశించిన సమయంలో పూర్తి అయ్యేందుకు ప్రజలు సహకారం అతి ముఖ్యమని, సమయం రెండు రోజులు మాత్రమే ఉందని విధులను అత్యంత బాధ్యతతో పూర్తిచెయ్యాలని అన్నారు. అనామలస్ భారత ఎలక్షన్ కమీషన్ వారి నియమ నిబంధనలను తూచ తప్పనిసరిగా పాటించి ప్రక్రియను పూర్తిచెయ్యాలని అన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ చేసి ఖచ్చితమైన ఏఎస్డి లిస్టును అత్యంత బాధ్యతగా రూపొందించాలని అన్నారు. గ్రామ సభలో గాని వివిధ రాజకీయ పార్టీలు ద్వారా నిర్ధారణ చేసుకుని ఎటువంటి అభ్యంతరాలు లేని ఓటర్ల జాబితాను పొందించడానికి కృషి చెయ్యాలని జిల్లా కలెక్టరు బిఎల్వో లను ఆదేశించారు.

**స్వర్ణగ్రామ, స్వర్ణవార్డు సచివాలయాలు ప్రజలు తృప్తిచెందేలా సేవలు అందించాలి: జిల్లా కలెక్టరు.**

ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగంగా, పారదర్శకంగా, నాణ్యతతో అందేలా కృషిచెయ్యాలని సూచించారు. ప్రజలు నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించి, పెండింగులో ఉంచకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సచివాలయ పరిధిలో అమలు అవుతున్న ప్రభుత్వ పథకాలుపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యాలయ పరిశుభ్రత, రికార్డులు నిర్వహణ, సేవలు అందజేతలో నిర్లక్ష్యం లేకుండా విధులు నిర్వర్తించాలని సిబ్బందికి తెలిపారు. ఒక్క ఫిర్యాదు వచ్చినా శాఖా పరమైన చర్యలు తప్పవని, ప్రతి ఉద్యోగి బాధ్యతగా పనిచేసి లక్ష్యాలను అధిగమించాలి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా సంక్షేమ పథకాలు, ఇతర కార్యక్రమాలుపై ప్రజలు నుండి నేరుగా ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని అందుకు అనుగుణంగా క్రమశిక్షణతో, మనస్సుపెట్టి పనిచెయ్యాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, చింతలపూడి ఇఆర్వో వి.వి.యస్. శర్మ, స్వర్ణగ్రామ, స్వర్ణవార్డు జిల్లా అధికారి జి.వెంకట నాయుడు, జిల్లా పంచాయతీ శాఖ అధికారి జి.వి.మల్లిఖార్జున రావు, తహశీల్దారు నజీముల్లాషా, యంపిడివో కె.వాణీ, మండల వివిధ శాఖలు అధికారులు, బిఎల్వోలు, స్వర్ణ గ్రామ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## వెన్ను సమస్యలకు 'మినిమల్లీ ఇన్వాసివ్'తో ఆధునిక చికిత్స

**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు**



సమస్యలకు అత్యాధునిక 'మినిమల్లీ ఇన్వాసివ్ స్పైన్ సర్జరీ' ద్వారా తక్కువ కోత, స్వల్ప రక్తస్రావంతో సురక్షితంగా చికిత్స అందిస్తున్నామని సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ స్పైన్ సర్జన్ డాక్టర్ దాట్ల జి. సత్యనారాయణ రాజు తెలిపారు. ఏలూరులోని రంగూన్ మేడ వీధిలో ఉన్న సుస్మిత దయాగ్నస్టిక్ సెంటర్‌లో ఆయన స్పైన్ సర్జన్ సేవలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఆధునిక జీవనశైలి, గంటల తరబడి కంప్యూటర్లు, మొబైల్ వినియోగం, వ్యాయామం లేకపోవడం, ఊబకాయం కారణంగా యువతలోనూ వెన్ను సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. తొలిదశలో గుర్తిస్తే మందులు, ఫిజియోథెరపీ, జీవనశైలి మార్పులతోనే నయం చేయవచ్చని, వైద్యుల సలహా లేకుండా పెయిన్‌కిల్లర్లు వాడొద్దని సూచించారు. శస్త్రచికిత్స అవసరమైన సందర్భాల్లో మినిమల్లీ ఇన్వాసివ్ విధానంతో నొప్పి, రక్తస్రావం తక్కువగా ఉండి రోగులు త్వరగా కోలుకుంటారని తెలిపారు. బరువును అదుపులో ఉంచుకోవడం, రోజూ నడక, సరైన భంగిమలో కూర్చోవడం, వెన్ను కండరాలకు వ్యాయామం చేయడం ద్వారా వెన్నెముక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. ఈ సమావేశంలో యశోద హాస్పిటల్స్ ఏపీ మార్కెటింగ్ మేనేజర్ బాల వీరభద్ర నల్లం, సీనియర్ ఎగ్జిక్యూటివ్ ప్రవీణ్ అబ్బ దాసరి పాల్గొన్నారు.

## పైడిమెట్ట పాఠశాలలో జాతీయ జెండా దినోత్సవం

**ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి**

తాళ్లపూడి మండలం పైడిమెట్ట మండల పరిషత్ బేసిక్ ప్రాథమిక పాఠశాలలో జాతీయ జెండా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు దున్నా దుర్గారావు విద్యార్థులకు జాతీయ జెండా చరిత్ర, పింగళి వెంకయ్య సేవలు, త్రివర్ణ పతాకంలోని రంగుల ప్రాముఖ్యత, అశోక చక్రం విశిష్టతను వివరించారు. జాతీయ జెండా దేశ సార్వభౌమత్వానికి, ఐక్యతకు ప్రతీక అని తెలిపారు. కార్యక్రమంలో సహోపాధ్యాయులు ధర్మాన రాము, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు కొప్పాక మధు, పి. రమేష్, పాఠశాల ఆయా కొప్పాక చిట్టెమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రులను కలిసిన ఆక్వా రైతు సంఘ రాష్ట్ర నేత గాంధీ భగవాన్ రాజు

- **ఏపీలో ఎన్ఎఫ్‌డిబి, ఆక్వా క్వారంటిన్ ఏర్పాటుకు అంగీకారం**
- **జీఎస్టీ 18 శాతం నుంచి 5% తగ్గింపు**
- **సంఘ రాష్ట్ర నేత గాంధీ భగవాన్ రాజు వెల్లడి**

**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**



ఏపీ రాష్ట్ర ఆక్వా రైతు సంఘ అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, సంఘ నాయకులు యశ్వంత్ కుమార్ రాజు, సుబ్బరాజు,మల్ల రాంబాబు ల తో ఢిల్లీలోని కేంద్ర మంత్రులను కలిసిన పర్యటన విజయవంతమై సత్ఫలితాలను ఇచ్చింది. ఈ విషయమై అక్కడ జరిగిన విషయాలను రాష్ట్ర సంఘ అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు స్థానిక పాత్రికేయ సమావేశంలో బుధవారం వెల్లడించారు. గాంధీ భగవాన్ రాజు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు, సూచనల మేరకు ఢిల్లీ పర్యటన లో భాగంగా ఏపీ రాష్ట్ర మంత్రులు అచ్చం నాయుడు, గొట్టిపాటి రవికుమార్, వీరాంజనేయులు, డిప్యూటీ స్పీకర్ రఘురాం కృష్ణంరాజు తో పాటు రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు శ్రీనివాస్ వర్మ, రామ్మోహన్ నాయుడు లతో కలిసి కేంద్ర మంత్రులు పియూష్ గోయల్, లాల్ రంజన్ సింగ్ లను కలిసి ఏపీ రాష్ట్రంలో ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించినట్లు తెలిపారు. ఫీడ్ రేట్లు ఇప్పటికే కిలోకు 10 రూపాయలు పెంచి, మళ్లీ మరో 15 రూపాయలు పెంచడానికి సిద్ధంగా ఉన్నారనే విషయాన్ని కేంద్ర మంత్రులు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. అదేవిధంగాకిలో రొయ్యలు రు.50 నుంచి 60 రూపాయలు వరకు తగ్గించి కొంటున్నారు దీనివల్ల రైతులు నష్టాన్ని గురవుతున్నారని వివరించినట్లు తెలిపారు. రొయ్యల మేతలో వినియోగించే ఫిష్ మీల్, సోయా మిల్ 50 శాతం విదేశాలకు ఎగుమతి చేయకుండా స్వదేశంలో ఉంచి రైతులకు ధరలు తగ్గించి ఇచ్చేలా చూడాలని కోరినట్లు తెలిపారు. రైతులకు రుణాలు ఇచ్చే జాతీయ మత్స్యశాఖ అభివృద్ధి బ్యాంకు ఎం. ఎఫ్ బీడీ, అలాగే నాణ్యమైన రొయ్యలను పెంచడానికి అనువైన క్వారంటీన్ చెన్నై నుంచి ఏపీకి రప్పించడం కోరగా అందుకు కేంద్ర మంత్రులు సానుకూలంగా స్పందించి దీనికోసం అనుమతుల కోసం హామీ ఇచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ కలిసి ఐదు శాతం జీఎస్టీ అమలు జరగడం లేదని తెలియజేయగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ను వెళ్లి కలవాలని సూచించినట్లు తెలిపారు. రాబోయే కాలంలో రాష్ట్ర ఆక్వా రైతు సంఘం మంత్రి నిమ్మల ఆధ్వర్యంలో ఆక్వా రైతులకు మేలు జరిగేలా కృషి చేస్తామని ఈ సందర్భంగా గాంధీ భగవాన్ రాజు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు బోనం వెంకట నరసయ్య చినబాబు, సంఘ నాయకులు మేడిది జాన్ డేవిడ్ రాజు, పి. సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ప్రేమా ఆప్యాయతలను పంచాలి.

**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.**
విద్యార్థులకు విద్యతో పాటు సామాజిక, వైజ్ఞానిక విషయాలను తెలియచెప్పి, భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని అన్నారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెం బుధవారం మండల పరిషత్తు పాఠశాల 4,5 తరగతి విద్యార్థులకు పాఠాలు చెప్పి, వారి నుండి సంతృప్తికరమైన సమాధానాలు రావడంతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం భవిత దివ్యాంగులు పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉన్నతచదువులు చదవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టిందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పాఠశాలలో బోధన, విద్యార్థులు హాజరు, మౌళిక వసతులు, మధ్యాహ్న భోజన నిర్వహణ తదితర అంశాలు పక్కగా అమలు చెయ్యాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమని, ప్రతి విద్యార్థి విద్యలో రాణించేలా ఉపాధ్యాయులు కృషిచెయ్యాలని సూచించారు. పాఠశాల ఉత్తీర్ణ శాతాన్ని మరింత పెంచేలా ఉపాధ్యాయులు కలసికట్టుగా పనిచేసి లక్ష్యాలను అధిగమించాలన్నారు. భవిత దివ్యాంగులు పాఠశాలను: జిల్లా కలెక్టరు సందర్శించారు. దివ్యాంగులు పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్య, వసతి, భోజనం, వైద్య సేవలు, పునరావాస సౌకర్యాలు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు



కె.సెల్విసెల్వి మాట్లాడుతూ దివ్యాంగులకు రాష్ట్రప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని, ప్రతి పథకం ప్రతి దివ్యాంగులకు చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. కొంతమంది దివ్యాంగులు పెన్షన్ రావడంలేదని నా దృష్టికి తీసుకువచ్చారని, పెన్షన్ మంజూరు చర్యలు తీసుకుంటామని తెలిపారు. 1వ తరగతి నుండి 10వ తరగతి చదువుకునే 20 మంది దివ్యాంగులు ఉన్నారని, వారు ఉన్నత చదువులు చదువుకునే వరకు అన్నివిధాలుగా సహాయ సహకారాలు జిల్లా యంత్రాంగం అందిస్తుందని స్పష్టం చేశారు. క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ సేవలు అందించాలని, వారికి పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, చింతలపూడి ఇఆర్వో వి.వి.యస్.శర్మ, తహాశీల్దారు నజీముల్లాషా, యంపిడివో కె.వాణీ, ప్రధానోపాధ్యాయులు షేక్ సాజీధా బేగం, ఉపాధ్యాయులు, నాన్ టీచింగు సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

### మూడవ శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర,

# ప్రతి బుధవారం స్వచ్ఛ పథం కార్యక్రమాలు సమర్ధవంతంగా నిర్వహించాలి

- క్లాప్ మిత్రాలు సేవలు అభినందనీయం.
- జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి



**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా**
లింగపాలెం మండలం ధర్మాజీగూడెం స్వర్ణగ్రామ సచివాలయ ఆవరణలో బుధవారం స్వచ్ఛ పథం కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మొక్కలను నాటారు. అనంతరం క్లాప్ మిత్రాలకు నూతన దుస్తులను అందజేసి, శాలువాలు కప్పి జిల్లా కలెక్టరు ఘనంగా సన్మానించారు. క్లాప్ మిత్రాలు ఆరోగ్య, కుటుంబ పరిస్థితులను జిల్లా కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. వారికి క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు, వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కనీసం రెండు మొక్కలను నాటి సంరక్షించి, పచ్చదనం పెంపొందించాలని అన్నారు. పరిశుభ్రమైన పరిసరాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంపకం ఎంతో అవసరమని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, గ్రామం, పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాలను క్రమం తప్పకుండా చేపట్టాలని, ప్లాస్టిక్, క్యారీ బ్యాగులు, వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు భాగస్వామ్యం అవసరమని సూచించారు. స్వచ్ఛ పథం కార్యక్రమాలను ప్రజాఉద్యమంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు అధికారులు, స్థానిక సంస్థలు ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు చురుకుగా పాల్గొని విజయవంతం చెయ్యాలని జిల్లా కలెక్టరు పిలుపునిచ్చారు.

**క్లాప్ మిత్రాలు సేవలు అభినందనీయం: జిల్లా కలెక్టరు.**

పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు ప్రతిరోజూ అంకితభావంతో పనిచేస్తున్న క్లాప్ మిత్రాలు సేవలు సమాజానికి ఆదర్శనీయం అని పేర్కొన్నారు.

వారి సేవలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములై సహకరించాలని పిలుపునిచ్చారు. క్లాప్ మిత్రాలు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వాటిని సద్వినియోగం చేసుకోవాలని, వారి సేవలకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, స్వర్ణగ్రామ, స్వర్ణ వార్డు జిల్లా అధికారి జి.వెంకట నాయుడు, జిల్లా పంచాయతీ శాఖ అధికారి జి.వి.మల్లిఖార్జున రావు, తహాశీల్దారు నజీముల్లాషా, యంపిడివో కె.వాణీ, మండల వివిధ శాఖలు అధికారులు, స్వర్ణగ్రామ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

### పిల్లలు వర్ధిల్లాలి అనే పుస్తకం ఆవిష్కరణ

**ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం**
మండల కేంద్రంలోని విద్యా వనరులు కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ జనవిజ్ఞాన వేదిక ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పిల్లలు వర్ధిల్లాలి అనే పుస్తకాలు ఆవిష్కరణ కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా జెవివి. పోలవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. కన్నారావు మరియు యుటిఎఫ్. మండల అధ్యక్షులు ఎ. నాగేశ్వరావు మాట్లాడుతూ ఈతరం తల్లిదండ్రులు ప్రస్తుత ప్రపంచంలో పిల్లలే మన భవిష్యత్, పిల్లలే మన ప్రపంచం అనుకుంటూ పిల్లల పెంపకం కొరకు అలాగే చదువు కోసం అప్పులు కూడా వెనుక- అడుగు వేయకుండా కష్టపడి చదువులు చదివించుకుంటున్నారు. బడి అనగానే మొత్తం బాధ్యత ఉపాధ్యాయుడి మీద వెయ్యడం సర్వసాధరణమైపోయింది.

# అనే సాయి హత్య కేసులో బాధిత కుటుంబానికి వైఎస్సార్సీపీ అండ

- మాజీ ఎంపీ నందిగామ సురేష్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయెల్ పరామర్శ.
- నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్.



**ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట**
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం రావులపాలెం మండలం కొత్తకాలనీలో ఇటీవల హత్యకు గురైన అనే సాయి కుటుంబాన్ని వైఎస్సార్సీపీ నేతలు మాజీ ఎంపీ నందిగామ సురేష్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయెల్ బుధవారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనే సాయి హత్య కేసులో నిందితులపై కఠిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి త్వరితగతిన న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుటుంబానికి వైఎస్సార్సీపీ అన్ని విధాలా అండగా ఉంటుందని, న్యాయం జరిగే వరకు పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మాజీ ఎంపీ నందిగామ సురేష్ స్థానిక డీఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి కేసు దర్యాప్తు పురోగతిపై ఆరా తీశారు. దర్యాప్తును నిష్పక్షపాతంగా నిర్వహించి, నిందితులను వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# వాడపల్లిని టెంపుల్ టౌన్ కోసం ప్రణాళిక

- ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నిమ్మల పర్యటనలను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు
- కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.

**ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట**
వాడపల్లిని టెంపుల్ టౌన్ గా అభివృద్ధి చేయడానికి అన్ని విధాలుగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. మూడో బుధవారం సందర్భంగా రావులపాలెం క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన నియోజకవర్గ సమావేశంలో ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ నియోజకవర్గంలో జరిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు పర్యటనలను విజయవంతం చేసినందుకు కూటమి కార్యకర్తలకు, నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. వాడపల్లి అభివృద్ధిపై ముఖ్యమంత్రి సైతం దృష్టిసారించినట్లు తెలిపారు. వాడపల్లి టెంపుల్ టౌన్ గా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి సైతం చెప్పినట్లు తెలిపారు. వాడపల్లి అభివృద్ధి చెందితే అక్కడ ఒక బస్టాండ్, హాస్పిటల్, మొదలైన అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటవుతాయన్నారు. వాడపల్లి అభివృద్ధి తోటే రావులపాలెం అభివృద్ధి సైతం ముడిపడి ఉందన్నారు.




శ్రీనివాసం 2 కాంప్లెక్స్ నిర్మాణం నిమిత్తం టిటిడి నిధులు మంజూరు చేయించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

## తల్లికి వందనం.. విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా

**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**



రాష్ట్రంలో ఏ విద్యార్థి కూడా ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకం విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు బలమైన భరోసాగా నిలుస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార-పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. ఎన్నికల హామీ మేరకు ఒక కుటుంబంలో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న ప్రతి అర్హ విద్యార్థికి రూ.13 వేల చొప్పున తల్లి ఖాతాలో జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. వరుసగా రెండో ఏడాది 67.47 లక్షల మంది తల్లు ల ఖాతాల్లో రూ.10,120.78 కోట్లు జమ చేయడం ప్రభుత్వం విద్యకు ఇస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనమన్నారు. అర్హుల ఖాతాల్లో ఈ నెల 24వ తేదీ వరకు నిధులు జమ అవుతాయని, ఏవైనా లోపాలు ఉంటే స్థానిక సచివాలయం లేదా విద్యాశాఖ అధికారులను సంప్రదించి సరిచేసుకోవాలని సూచించారు. ఈ పథకం లబ్ధి పొందుతున్న తల్లులు, విద్యార్థులందరికీ మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

## దానయ్య కుటుంబానికి మంత్రి కొలుసు భరోసా.. రూ.5 లక్షల ఆర్థికసాయం



**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**
పలాసలో జరిగిన ఘటనలో మృతిచెందిన దుబ్బ దానయ్య కుటుంబాన్ని రాష్ట్ర గృహనిర్మాణం, సమాచార-పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పరామర్శించి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి కొలుసు పెదరెడ్డయ్య చారిటబుల్ ట్రస్ట్, యాదవ సంఘం తరఫున రూ.5 లక్షల ఆర్థికసాయం అందజేసి, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, యాదవ సంఘం నాయకుడు రొండి కృష్ణయాదవ్‌తో పాటు కూటమి నాయకులు, యాదవ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## నారుమడిలో జాగ్రత్తలే అధిక దిగుబడికి పునాది




**ప్రజాభూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**
ఆగిరిపల్లి మండలం చిన్న ఆగిరిపల్లి, చొప్పరమెట్ల గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి జె. భవాని రైతులకు నారుమడుల నిర్వహణ, ఆరోగ్యవంతమైన విత్తనాల ఎంపిక, వరి నాట్లకు ముందు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. శాస్త్రీయ సాగు పద్ధతులు, సకాలంలో సస్యరక్షణ చర్యలు పాటిస్తేనే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులందరూ తప్పనిసరిగా పంట బీమా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

# 2028 జనవరి నాటికి నిడదవోలు పట్టణ ప్రజలకు పైప్‌లైన్ ద్వారా గోదావరి శుద్ధి జలాలు

- మంత్రి కందుల దుర్గేష్
- రూ. 94.31 కోట్ల వ్యయంతో అమృత్ 2.0 తాగునీటి ప్రాజెక్టు పనులకు పర్యాటక శాఖ మంత్రి కందు ల దుర్గేష్ శంకుస్థాపన
- ఎన్నికల హామీని నిలబెట్టుకుంటున్న కూటమి ప్రభుత్వం.. ప్రొక్లెయిన్ ఎక్కి స్వయంగా పనులు ప్రారంభించిన మంత్రి దుర్గేష్





**ప్రజా భూమి ప్రతినిధి-నిడదవోలు**
నిడదవోలు పట్టణ ప్రజానీకానికి సురక్షితమైన, నాణ్యమైన తాగునీటిని అందించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. బుధవారం నిడదవోలులో అమృత్ 2.0 పథకం కింద రూ. 94.31 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శాస్త్రోక్తంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ స్వయంగా ప్రొక్లెయిన్ ఎక్కి స్వయంగా మట్టి తొలగించి, కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. 2027 డిసెంబర్ 31 నాటికి ఈ ప్రాజెక్టు పనులన్నీ పూర్తి చేసి, 2028 జనవరి నాటికి నిడదవోలులోని ప్రతి ఇంటికీ పైప్‌లైన్ ద్వారా శుద్ధి చేసిన గోదావరి జలాలను అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. రూ. 94.31 కోట్ల అభివృద్ధి పనుల్లో భాగంగా రూ. 83.82 కోట్లతో చేపట్టనున్న అమృత్ 2.0 గ్రిడ్ లైన్ పనులు బుధవారం మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. ఇందులో భాగంగా విజ్జేశ్వరం సమీపంలోని ధవళేశ్వరం నుండి గ్రిడ్ లైన్ ద్వారా తాగునీటి సరఫరా వ్యవస్థ మెరుగుదలతో పాటు, సంత వద్ద 10 మీఎల నీటి శుద్ధి కర్మాగారం మరియు అనుబంధ యూనిట్ల నిర్మాణం చేపడతామన్నారు. సంత వద్ద 1000 కేఎల్, సెయింట్ ఆంబ్రోస్ స్కూల్ సమీపంలో 700 కేఎల్ సామర్థ్యం గల ఎలివేటెడ్ సర్వీస్ రిజర్వాయర్లతో కూడిన ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపడతామన్నారు. అదే విధంగా నిడదవోలు పట్టణవ్యాప్తంగా 90 కి.మీ. మేర పైప్‌లైన్ వ్యవస్థ ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే 20 కి.మీ. పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. చిన్నకాశీరేవు వద్ద నీటి సంపు నిర్మాణం చేపట్టనున్నామన్నారు.

ఇవే గాక రూ. 5.96 కోట్లతో ఎన్టీఆర్ నగర్ లేఅవుట్ ప్రాజెక్ట్ వద్ద స్థానిక వాసులకు ప్రత్యేక నీటి సరఫరా కార్యక్రమం చేపట్టామని మంత్రి దుర్గేష్ అన్నారు. రూ. 4.53 కోట్లతో మాలకోడు చెరువు పునరుద్ధరణ పనులు ప్రారంభించామన్నారు..పునరుద్ధరణ పనుల్లో భాగంగా రెండు విడతల్లో చెరువు పూడికతీత, కొత్త కట్ట నిర్మాణం, రాతి కవచం ఏర్పాటుతో ఐ అండ్ డి నిర్మాణాల ద్వారా మురుగునీటి మళ్లింపు, బహిరంగ కాలువ నిర్మాణం, 858 మీటర్ల పొడవు, 2 మీటర్ల ఎత్తుతో రక్షణ కంచె, వాకింగ్ ట్రాక్ మరియు చెరువు మధ్యలో ఆకర్షణీయమైన ఫౌంటెన్ నిర్మాణం చేపట్టనున్నట్లు మంత్రి దుర్గేష్ వివరించారు.

**గత ప్రభుత్వం వైఫల్యం - కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధి**

ఈ సందర్భంగా గత ప్రభుత్వ తీరుపై మంత్రి కందుల దుర్గేష్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గోదావరి పక్కనే ఉన్నప్పటికీ ప్రజల దాహార్తిని తీర్చడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. 2014-19లో తెదేపా ప్రభుత్వం శ్రీకారం చుట్టిన జల్ జీవన్ మిషన్, అమృత్ నిధులను 2019-24 మధ్య పక్కదారి పట్టించారని ఆరోపించారు. రూ. 73 కోట్లు ఖర్చు చేశామని ప్రచారాలు చేసుకున్నా, కనీసం ఒక్క పైప్‌లైన్ కూడా వేయక పోవడంతో నిధులు సమకూర్చిన 'ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్' తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు గతేడాది గ్రామీణ ప్రాంతాలకు నీరు అందించే అమరజీవి జలధార వాటర్ గ్రిడ్ పనుల శంకుస్థాపన కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పెరవలిలో ప్రారంభించిన విషయాన్ని ప్రస్తావించారు.

**పనుల్లో ఆలస్యాన్ని సహించేది లేదు..అధికారులకు మంత్రి దుర్గేష్ హెచ్చరిక**

తన ప్రాతినిధ్యంలో పట్టణ అభివృద్ధికి రూ. 196 కోట్లు, శాస్కి పథకం కింద గ్రామీణ రోడ్ల కోసం రూ. 28 కోట్లు తీసుకువచ్చానని మంత్రి దుర్గేష్ తెలిపారు. నిధుల సమీకరణ తన బాధ్యత అని, పనులను శరవేగంగా పూర్తి చేయాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉందన్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

**నిడదవోలు మున్సిపాలిటీకి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అవార్డుపై మంత్రి దుర్గేష్ ప్రశంసలు**

రాష్ట్రవ్యాప్తంగా 50,000 జనాభా ఉన్న పురపాలక సంఘాల విభాగంలో నిడదవోలు పట్టణంలో చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కు 'స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్' ద్వారా సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ప్రథమ బహుమతి రావడం పట్ల మంత్రి దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. వేదికపై మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణిని,సిబ్బందిని అభినందిస్తూ ఆ అవార్డును ప్రజలకు ప్రదర్శించారు. తాగునీరు అందించే కార్యక్రమాన్ని ఒక పవిత్రమైన బాధ్యతగా భావించి స్థానిక నాయకులు, అధికా రులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నిడదవోలు అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న మంత్రి కందుల దుర్గేష్‌ను స్థానిక ప్రజలు, నాయకులు ఘనంగా సన్మానించారు.

ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

గురువారం 23 జూలై 2026

# స్మశాన వాటికకు వెళ్లేదారిని కాపాడండి

## తాసిల్దార్ కు వినతిపత్రం సమర్పించిన అరకటి వేముల గ్రామస్తులు

ప్రజాభూమి, పుట్లూరు.

పుట్లూరు మండలంలోని అరకటవేముల గ్రామ దళిత వాడకు సంబంధించిన స్మశానానికి పోవు దారి (దింపుడు కల్లాలు ) సమస్యపై తాసిల్దార్ కార్యాల యం వద్ద గ్రామస్తులతో కలిసిసిపిఐ, సిపిఎం, పార్టీ లుధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ, సిపిఎం, కార్యదర్శులు,పెద్దయ్య, సూరి,గ్రామస్తులు మాట్లాడుతూ! అరకట వేముల గ్రామంలో తరతరాల నుంచి స్మశానానికి పోవు దారి దింపుడుకల్లాలు ఉన్నాయని అయితే ఇప్పుడు కొంతమంది పరిమి ఓబుల నాయుడు, ప్రకాష్ నాయుడు, ప్రదీప్ నాయుడు ఆక్రమించడం జరిగినది, అలాగే గ్రామ దేవత అయిన మారెమ్మ గుడికి కాలనీ పక్కల వారి తోటలో తరాల నుంచి గుడికి పోవడం జరుగుతున్నది. ఆ దారి కూడా ఆక్రమించి ముల్లకంచ ఏర్పాటు చేయడం జరిగినది. అలాగే ఆర్డిటి సంస్థ త్రాగునీరు సమస్య పరిష్కారం కోసం బోరుబావి వేయడం జరిగినది. ఆ బోరుబావికి కరెంట్ కనెక్షన్ దింపుడుకల్లాల దగ్గర నుంచి నుంచి సుశానానికి పోవు దారి పక్కన నుంచి కరెంటు వేరు గ్రామస్తులు కలిసి తగిలించుకోవడం జరిగినది. ఆ వైరు కూడా కనెక్షన్ తొలగించి కరెంట్ లేకుండా చేయడం తో త్రాగునీటి సమస్య ఏర్పడిందని అలాగే కాలనీ పక్కన ఉన్న కాళీ స్థలంలో కొన్ని సంవత్సరాల క్రితం ఆంజనేయ గుడి ఏర్పాటు చేయాలని ఒక బండకు ఆంజనేయ స్వామి ప్రతిరూపాన్ని ఆర్ట్ వేసి అక్కడ స్థాపించి పూజలు జరుపుకోవడం జరుగుతున్నది ఆ స్థలాన్ని కూడా పూర్తిగా ఆక్రమించి కంచె వేయడం జరిగినది. నిజంగా స్థలం వారిదే అయితే కొన్ని తరాల నుంచి ఎందుకు వారు కంచ వేయలేదు. నిజంగా వారిదే స్థలం అయితే ఆర్ హెచ్,నక్కలు, డైక్లాట్, ఇతర భూ రికార్డులు ప్రజలకు చూపించాలి. కొన్ని తరాల నుంచి మారెమ్మ గుడికి పోయే దారి ఎలా అడ్డుకుంటారు. కావున వెంటనే గ్రామ దేవత అయిన మారెమ్మ గుడికి రస్తా యధావిధిగా ఇవ్వాలి, అలాగే (దింపుడు కల్లాలు ) స్మశానానికి పోవు దారి వదిలి పెట్టాలి. అలాగే త్రాగునీరు బోరు కరెంటు కనెక్షన్ యధావిధిగా తగిలించాలి. వీటన్నిటి వెంటనే పరిష్కరించాలని తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాల్సి వస్తుందని తాసిల్దారు గారికి తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు,సిపిఐ మండల సహాయ కార్యదర్శి బాలు, దళిత హక్కుల పోరాట సమితి మండల కార్యదర్శి, రాఘవేంద్ర, సిపిఐ నాయకులు, వెంకటనారాయణ, బలరాముడు, నారాయణ, గుర్రప్ప, పెద్దిరాజు, గ్రామస్తులు, బాల నారాయణ, కాలేశ్వర, నాగేంద్ర, ఆదినారాయణ, కుల శేఖర, సూరి,ధన, చిన్న కొండయ్య, కుళ్లాయప్ప, ఏ, రామాంజనేయులు, పెద్దయ్య, మారుతి, బి,లక్ష్మీనారాయణ , శ్రీనివాసులు, కిట్ట, నాగరాజు, నాగేంద్ర నరసింహులు, శివలక్ష్మి, లక్ష్మీదేవి, రత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.




## తాసిల్దార్ కు వినతిపత్రం సమర్పించినవ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. సూరి

ప్రజాభూమి, పుట్లూరు



పుట్లూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నందు బుధవారం తహసీల్దార్ బాలమ్మకు వినతి పత్రం సమర్పించడం జరిగినది. ఈ సందర్భంగా సూరి మాట్లాడుతూ భారత ప్రభుత్వం స్వస్వ ఒప్పందం చేసుకోబోతున్నట్లు వార్తలు వస్తున్నాయని స్వామి నాథన్ సూచన సి 2o 50 సూత్రం అమలు చేయనందున మన రైతాంగం ఏటా మూడు లక్షల కోట్లు నష్టపోతున్నట్లు చెబుతున్నారు. మొక్కజొన్న, పత్తి, మామిడి, కోకో తదితర పంటలు కనీస మద్దతు ధరలు కూడా రాక రైతులు తీవ్రంగా నష్టపోయారు ఈ స్థితిలో అమెరికా నుండి దిగుమతులు వచ్చి పడితే మన రైతాంగం పూర్తిగా నష్టపోతారు కావున స్వస్వ వాణిజ్య ఒప్పందం పై కేంద్ర ప్రభుత్వాన్ని సంతకము చేయకుండా నిలువు చేయగలరని కోరుతున్నాము గతంలో ఎస్ కే యం న్యాయకత్వానికి హామీ ఇచ్చిన విధంగా అన్ని పంటలకు సీ2o50 ప్రకారం మద్దతుధరల చట్టం చేయుంచాలని రైతుల వ్యవసాయ కార్మికుల రుణాలు ఒకసారి రద్దు చేయుంచగలరని కోరుచున్నాము ఈ కార్యక్రమంలోపుట్లూరు మండల రైతు సంఘం నాయకులు శివారెడ్డి, బి భాస్కర్ రెడ్డి , మండల నాయకులు టి పెద్దయ్య, కే నాగభూషణ్, అన్నయ్య, నాగలింగం, నాగేంద్ర రైతులు పాల్గొన్నారు.

## గరికపాటిని కలిసిన లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్

### -దేవాలయానికి విచ్చేయాలని ఆహ్వానం

ప్రజాభూమి, హిందూపురం టౌన్



ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త, బ్రహ్మర్షి, పద్మశ్రీ గరికపాటి నరసింహారావును తెలంగాణ రాజధాని హైదరాబాద్ లో బుధవారం లేపాక్షి వీరభద్రాలయ కమిటీ చైర్మన్ పరిగె వేణుగోపాలరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గురువు లేపాక్షి ఆలయానికి విచ్చేసి ప్రజలకు దివ్యమైన ప్రవచనం చేయాల్సిందిగా పరిగె వేణు గోపాల్ రావు ఆహ్వానించారు. ఇందుకు గరికపాటి సానుకూలంగా స్పందించి తప్పకుండా వస్తాను, తగు ఏర్పాట్లు చేసుకోండి అని పేర్కొన్నట్లు వేణుగోపాల రావు తెలిపారు. అలాగే పరిగె వేణు గోపాల్ రావు తమ వ్యక్తిగత ట్రస్ట్ దివ్య ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలు, ఈ మాసం వ్యవధిలో లేపాక్షి ఆలయంలో నిర్వహించిన కార్యక్రమాలు, అభివృద్ధి పనుల వివరాలు గరికపాటి దృష్టికి తీసుకెళ్లగా మంచి కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆశీర్వదించినట్లు వేణుగోపాలరావు వివరించారు.

## న్యూఢిల్లీ విమానాశ్రయంలో ధన స్వాగతం పలికిన ఎంపీ అంబిక

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం



న్యూఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యేందుకు, అలాగే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ప్రధాని ని ఆహ్వానించేందుకు ఢిల్లీకి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ న్యూఢిల్లీ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికడం జరిగింది.

## ఐటీఐలో రెండో విడత అడ్మిషన్లు

ప్రజాభూమి, హిందూపురం టౌన్ పట్టణంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో మొదటి విడత అడ్మిషన్స్ తర్వాత మిగిలిన సీట్లకు రెండో విడత అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 3వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ పూర్తి అయిన దరఖాస్తుదారులు ప్రభుత్వ ఐటిఐ శ్రీకంఠపురం రూస్సీ లక్ష్మీబాయి పురపాలక ప్రాథమిక పాఠశాల ప్రాంగణం, హిందూపురం నందు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఆగస్టు 4వ తేదీ సాయంత్రం 6 గంటల లోపు వెరిఫికేషన్ చేయించుకోగలరు. అలా వెరిఫికేషన్ చేయించుకున్న దరఖాస్తుదారులు మాత్రమే అడ్మిషన్లకు అర్హత పొందుతారని తెలిపారు. కౌన్సిలింగ్ 06-08-2026 ఉదయం 9 గంటలకు ప్రారంభవుతుందని, అభ్యర్థులు ఆన్ లైన్ ద్వారా చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, అర్హత ఉన్న వ్యక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## కే సీ నారాయణ జీవితం స్ఫూర్తిదాయకం

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం



శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల లో కేసీ నారాయణ నాలుగో వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పించారు. కే సీ నారాయణ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని వక్తలు అన్నారు. గుంతకల్ శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో ప్రముఖ విద్యావేత్త, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, కళాశాల మాజీ కరస్పాండెంట్ కేసీ నారాయణ నాలుగో వర్ధంతిని బుధవారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్ బాబు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కే సీ నారాయణ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాంత ప్రజలకు ఉన్నత విద్యను అందుబాటులోకి తేవడానికి కళాశాలలను స్థాపించి ఎందరికో ఉపాధి కల్పించారన్నారు.. కేసీ నారాయణ జీవితం విలువలతో కూడిన ప్రజాసేవకు అంకితం చేసారని, వారి సేవలు చిరస్మరణీయము అన్నారు. ఆదర్శానికి నిలువెత్తు రూపం ఆయనని, వారి ఆశయ సాధనలో మనమంతా పయనించాలని కోరారు. అధ్యాపకులు వెంకటరమణ, క్రిష్ణయ్య, ఖాజావలి, రాకేష్, నటరాజ్, వరప్రసాద్ మరియు అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బాలకృష్ణ కోలుకోవాలని ప్రత్యేక పూజలు

### -101 కొబ్బరికాయలు కొట్టిన కార్యకర్తలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



కథానాయకులు, హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ త్వరగా కోలుకోవాలని బుధవారం టిడిపి నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. షూటింగ్ సమయంలో గాయపడ్డ నందమూరి బాలకృష్ణ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని పట్టణంలోని సూగూరు ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి -ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

నీట్ ప్రశ్నపత్రం లీకేజ్‌కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24వ తేదీన చేపట్టిన విద్యాసంస్థల బంద్ ను విజయవంతం చేయాలని ఐక్య విద్యార్థి సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా బుధవారం ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు నరసింహమూర్తి, బాబావలి,భారత్, కమల్ భాషా, వీరేష్, బద్రి, నాగేంద్ర, మాట్లాడుతూ, లీకేజ్‌కు బాధ్యులైన వారిపై వేగవంతమైన, కఠిన చర్యలు తీసుకోవాలని, పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకతను కల్పించి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని, దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల భద్రతను బలోపేతం చేసి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం, న్యాయమైన విద్యా వ్యవస్థ కోసం బంద్ చేపడుతున్నట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ ప్రవేశ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజ్ ఘటన లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురి చేసిందన్నారు. సంవత్సరాల పాటు కష్టపడి చదివిన విద్యార్థుల భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం అత్యంత బాధ్యతారాహిత్యమైన చర్యగా పేర్కొన్నారు. పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరగాల్సిన జాతీయ స్థాయి పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ కావడం వల్ల విద్యా వ్యవస్థపై విద్యార్థుల్లో విశ్వాసం దెబ్బతిందని, ఇలాంటి తీవ్రమైన వైఫల్యానికి నైతిక బాధ్యత వహిస్తూ సంబంధిత కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి, ప్రశ్నాపత్రం లీకేజీకి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుని, పూర్తి స్థాయి నిష్పాక్షిక విచారణ నిర్వహించి బాధ్యులందరిని చట్టపరంగా శిక్షించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరీక్షల నిర్వహణలో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలనే లక్ష్యంతో ఈ నెల 24వ తేదీన ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బంద్ ఏ ఒక్క సంఘానిదో కాదని, దేశ విద్యా వ్యవస్థలో పారదర్శకత, న్యాయం, జవాబుదారీతనం కోసం జరుగుతున్న ప్రజాస్వామ్య నిరసనగా చెప్పారు. విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు, అధ్యాపకులు ఈ బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలియజేసి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యను వ్యాపారంగా కాకుండా హక్కుగా పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. విద్యార్థుల శ్రమకు విలువ దక్కేలా, పరీక్షలపై నమ్మకం నిలిచేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని, 24న జరిగే విద్యాసంస్థల బంద్‌లో ప్రతి విద్యార్థి చైతన్యంతో పాల్గొని, ప్రశాంతంగా, క్రమశిక్షణతో బంద్‌ను జయప్రదం చేయాలని ఐక్య విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు మహేష్ ,ఆకాష్, నందీష్, అనిల్, పవన్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.



## ఓటరు జాబితా సవరణలో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం

### -అర్హులందరి పేర్లు నమోదు చేయాలి -లోపాలను వెంటనే సరిచేయాలి-ఆకస్మిక తనిఖీలో జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్

ప్రజాభూమి, హిందూపురం టౌన్

జిల్లాలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పురోగతిని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా హిందూపురం శాసనసభ నియోజకవర్గ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి, ఓటరు జాబితా సవరణ పనుల అమలు తీరును క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి పంపిణీ చేసిన దరఖాస్తుల పంపిణీ, స్వీకరణ, కంప్యూటరీకరణ, ఓటర్ల వివరాల అనుసంధానం, అనుమానాస్పద నమోదుల పరిశీలన, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్ల వివరాల ధ్రువీకరణ, లోపాల గుర్తింపు, క్షేత్రస్థాయి పరిశీలన, ఓటరు వివరాల నమోదు, ఎన్నికల రికార్డుల నిర్వహణ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. బూత్ స్థాయి అధికారులు నిర్వహించిన ఇంటింటి సర్వే, నమోదు చేసిన వివరాలు, సంబంధిత ఆధార పత్రాలు, క్షేత్రస్థాయి ధ్రువీకరణ విధానాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని నాణ్యత, పారదర్శకతతో నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో నమోదు చేయాలని, అనర్హులైన నమోదులను నిబంధనల ప్రకారం పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న లోపాలన్నింటిని అత్యంత ప్రాధాన్యంతో పరిష్కరించాలని, ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎన్నికల రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి ధ్రువీకరణ సమయంలో తగిన ఆధారాలను తప్పనిసరిగా సేకరించి, ప్రతి నమోదును ఎన్నికల సంఘం నిర్దేశించిన విధివిధానాలకు అనుగుణంగానే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రత్యేక సవరణ కార్యక్రమానికి నిర్ణయించిన గడువులను తప్పనిసరిగా పాటించాలని, ప్రతి బూత్ స్థాయి అధికారి తన పోలింగ్ కేంద్ర పరిధిలో పూర్తి బాధ్యతతో పనిచేసి ఎలాంటి పెండింగ్ లేకుండా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం హిందూపురం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఓటరు జాబితాలోని లోపాల గుర్తింపు, పెండింగ్ అంశాల పరిష్కారం, క్షేత్రస్థాయి ధ్రువీకరణపై బూత్ స్థాయి అధికారులకు జాయింట్ కలెక్టర్ పలు దిశానిర్దేశాలు చేశారు. ప్రతి నమోదు ఖచ్చితత్వంతో ఉండేలా తగిన ఆధారాలతో పరిశీలించి మాత్రమే నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో హిందూపురం తహసీల్దార్ వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, లేపాక్షి తహసీల్దార్ సౌజన్య లక్ష్మి, మండల అభివృద్ధి అధికారి దామోదరమ్మ, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ మహేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అమరేంద్ర, ఎన్నికల పర్యవేక్షకులు, బూత్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంపార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించాం

- ప్రజలకు నాయకులకు కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా...
- అన్ని ప్రధాన సమస్యలను తీర్చే ప్రయత్నం చేస్తా - ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజా భూమి ప్రతినిధి, తిరుపతి రూరల్

తిరుపతి రూరల్ మండలంలోని తనపల్లి వద్ద గల చంద్రగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ఎమ్మెల్యే పులివర్తి నాని సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ నలుమూలల నుండి విచ్చేసిన ప్రతి ఒక్క కార్యకర్తను, నాయకుడిని పేరుపేరునా ఆప్యాయంగా పలకరించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలలో ఉన్న ప్రధాన సమస్యలను నాయకులను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో చేసిన అభివృద్ధిని సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి చేరేలా చేయాలని కోరారు. మనలో మనకు చిచ్చులు పెట్టడానికి వైసిపి నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని... కుల మతాల మధ్య చిచ్చు పెట్టి కూటమి నాయకులలో చీలికలు తేవడానికి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి విశ్వప్రయత్నం చేస్తున్నారని మనం అప్రమత్తంగా ఉండి వారి ట్రాప్ లో ఎవరు పడకూడదని కోరారు. నియోజకవర్గ , మండల, గ్రామస్థాయిలలో ప్రతి ఒక్కరు కూటమి నిబంధనలు పాటిస్తూ సఖ్యతతో ఉండి కూటమి విజయానికి దోహదపడాలని కోరారు. మీ అందరి కష్టం... సహకారం వల్లే నేను ఎమ్మెల్యేగా గెలిచానని ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వ పాలనలో అంగన్వాడి టీచర్ల పిల్లలకు తల్లికి వందనం అందకుండా చేశారు... వారి బాధను అర్థం చేసుకొని మన కూటమి ప్రభుత్వం వారి పిల్లలకు కూడా తల్లికి వందనం వర్తింపజేసే విధంగా చర్యలు తీసుకున్నాం. నియోజకవర్గంలోని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు తీర్చే ప్రయత్నం చేస్తున్నానని అందుకు మీరందరూ సహకరించాలని కోరారు. నియోజకవర్గ స్థాయిలో ఉన్న మండల కార్యాలయాలలో ఉద్యోగులను పూర్తిస్థాయిలో నియమించే విధంగా చర్యలు చేపడతానని తెలిపారు. మన కూటమి ప్రభుత్వంలో గత వైసిపి ప్రభుత్వ పాలనలో లాగా కుటుంబ పాలన కొనసాగదని ... ప్రజా పాలన కొనసాగిస్తానని తెలిపారు. మీ కష్టసుఖాలను తెలుసుకోవడానికి... మీ గ్రామాలలో, పంచాయతీలలో ఉన్న ప్రధాన సమస్యలను తెలుసుకోవడానికి నా వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. రాబోయే పంచాయతీ ఎన్నికలలో కూటమి నాయకులు సమిష్టిగా కృషిచేసి మన అభ్యర్థుల విజయానికి దోహదపడాలని కోరారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కూటమి నాయకులు కార్యకర్తలు, ప్రతి ఒక్కరూ వైసీపీ పార్టీ సోషల్ మీడియాలో మనపై చేస్తున్న అసత్య ఆరోపణలను ఎప్పటికప్పుడు ఖండించాలని తెలిపారు. ఈనెల 25 నుండి మన కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని ప్రతి గడపకు తెలియజేసే కార్యక్రమం చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని మండల నాయకులు, క్లస్టర్, కో క్లస్టర్, యూనిట్ నాయకులతో పాటుగా సీనియర్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.








## 7 లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం... హౌస్ బ్రేకర్ అరెస్ట్

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం



అనంతపురం నగరంలో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని ఫోర్త్‌టౌన్, సిసిఎస్ పోలీసులు సంయుక్తంగా బుధవారం అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి సుమారు రూ.7 లక్షల విలువ చేసే 3.14 తులాల బంగారు నగలు, 203.5 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.80 వేల నగదు, టీవీ, గ్యాస్ సిలిండర్, నాలుగు చేతి గడియారాలు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. సి.ఐ లు మస్తాన్ , జయపాల్ రెడ్డి, ఎస్సై గోపిల కథనం ప్రకారం... స్థానిక కక్కలపల్లి కాలనీకి చెందిన బలిజ సాయి కిరణ్ (26) మద్యం, జూదం వ్యసనాలకు బానిసై సులభంగా డబ్బు సంపాదించేందుకు చోరీలను ఎంచుకున్నాడు. పగటిపూట తాళం వేసిన ఇళ్లను గుర్తించి, రాత్రివేళల్లో తాళాలు పగులగొట్టి బంగారం, వెండి వస్తువులను అపహరించేవాడు. ఈ ఏడాది జూన్ నెల నుంచి అనంతపురం నగరం, పరిసర ప్రాంతాల్లో మూడు చోరీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఆదేశాల మేరకు, అనంతపురం అర్బన్ సబ్ డివిజనల్ ఆఫీసర్ ఇన్‌చార్జి అదనపు ఎస్పీ మహబూబ్ బాష పర్యవేక్షణలో సీసీఎస్ సీఐ జయపాల్ రెడ్డి, ఫోర్త్‌టౌన్ సీఐ ఏ.పీ. మస్తాన్, ఎస్సై గోపీల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం కేశవరెడ్డి పాఠశాల సమీపంలో నిందితుడిని అరెస్ట్ చేసింది. కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు.

# మదర్ తెరెసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోరుమామిళ్ల కస్తూరిబా బాలికల పాఠశాలలో మెన్స్ట్రువల్ హైజిన్ అవగాహన కార్యక్రమం

ప్రజాభూమి పోరుమామిళ్ల : మదర్ తెరెసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైఎస్సార్ కడప జిల్లా, పోరుమామిళ్ల మండలం, రంగసముద్రం గ్రామపంచాయతీ పరిధిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం లో బాలికల కోసం మెన్స్ట్రువల్ హైజిన్ అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని మదర్ తెరెసా ఫౌండేషన్ ప్రతినిధి చిత్తా ప్రజ్వలా రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యుక్తవయస్సు బాలికలలో ప్రతి నెల జరిగే నెలసరి అనేది సహజమైన శారీరక ప్రక్రియ అని, దీనిపై ఎలాంటి అపోహాలు లేదా భయాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని వివరించారు. నెలసరి సమయంలో పాటించాల్సిన వ్యక్తిగత పరిశుభ్రత, శానిటరీ ప్యాడ్లను సరైన విధంగా ఉపయోగించడం, వాటిని సమయానికి మార్చుకోవడం, పరిశుభ్రమైన దుస్తులు ధరించడం, పోషకాహారం తీసుకోవడం, తగినంత నీరు తాగడం, శారీరక మరియు మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం వంటి అనేక ముఖ్యమైన అంశాలపై విద్యార్థినులకు సులభమైన భాషలో అవగాహన కల్పించారు. అదేవిధంగా, నెలసరిపై సమాజంలో ఉన్న అపోహాలను తొలగించి, బాలికలు ఆత్మవిశ్వాసంతో తమ విద్యను కొనసాగించాలని, ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఎదురైనా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లేదా వైద్యులను సంప్రదించాలని సూచించారు. బాలికలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం ద్వారా భవిష్యత్తులో ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపగలరని పేర్కొన్నారు. విద్యార్థినులకు ఈ అంశాలు మరింత సులభంగా అర్థమయ్యేలా "మెన్స్ట్రోపీడియా" కామిక్ పుస్తకాలను అందజేసి,




అందులోని చిత్రాలు మరియు కథల ద్వారా నెలసరి పరిశుభ్రతకు సంబంధించిన అవగాహనను వివరించారు. ఈ పుస్తకాలు బాలికల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేయడంలో ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు ఆసక్తిగా వినడంతో పాటు తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని పాఠశాల యాజమాన్యం మరియు ఉపాధ్యాయులు అభినందిస్తూ, ఇటువంటి ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు బాలికలకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మదర్ తెరెసా ఫౌండేషన్ వాలంటీర్లు మురళి, నవీన్, సాగర్ పాల్గొని కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో సహకరించారు. సమాజంలో మహిళల ఆరోగ్యం, బాలికల సంక్షేమం, పరిశుభ్రత మరియు ఆరోగ్య అవగాహన పెంపొందించడంలో భాగంగా మదర్ తెరెసా ఫౌండేషన్ భవిష్యత్తులో కూడా ఇటువంటి సేవా కార్యక్రమాలను మరిన్ని విద్యాసంస్థల్లో నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.

# విద్యార్థులపై లాఠీఛార్జీ చేయడం సరికాదు. ఉపాధ్యాయ,విద్యారంగ సమస్యలు పట్టని కేంద్ర విద్యాశాఖామంత్రి రాజీనామా చేయాలి: ఏఐఎఫ్ఇటిఓ జాతీయ కార్యదర్శి పి.రమణారెడ్డి

ప్రజాభూమి పోరుమామిళ్ల : దేశ రాజధాని న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర నిరసన చేస్తున్న విద్యార్థులపై లాఠీఛార్జి చేయడం సరికాదని,ప్రభుత్వ ఉపాధ్యాయ,విద్యారంగ సమస్యల పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్న కేంద్ర విద్యా శాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలిమెంటరీ టీచర్స్ ఆర్గనైజేషన్(ఏఐఎఫ్ఇటిఓ) జాతీయ కార్యదర్శి పి.రమణారెడ్డి డిమాండ్ చేశారు. కొన్ని రోజులుగా దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న పరిణామాలపై స్పందిస్తూ, బుధవారం కలసపాడులో రమణారెడ్డి మాట్లాడుతూ నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తూ,లక్షలాదిమంది విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడటం తగదన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేపట్టి నిందితులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టిన విద్యార్థులపై లాఠీఛార్జి చేయడం సరికాదన్నారు. అదేవిధంగా అన్ని రకాల విద్యార్హతలతో పరీక్షలు రాసి,ఉపాధ్యాయులుగా నియామకాలు పొంది,బోధనలో సుదీర్ఘ అనుభవం కలిగిన ఇన్ సర్వీస్ టీచర్లందరికీ



టెట్ తప్పనిసరి అన్న నిబంధనతో దేశవ్యాప్తంగా లక్షలాదిమంది ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఆందోళనతో కొట్టుమిట్టాడుతుంటే,స్పందించి పార్లమెంటులో విద్యాహక్కు చట్టసవరణ చేసి,ఉపశమనం కల్పించాల్సిన కేంద్ర విద్యాశాఖ మంత్రి తమకు సంబంధం లేదన్నట్లు నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు.ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి, కేంద్రమంత్రివర్గం నుండి ధర్మేంద్ర ప్రధాన్ ను తొలగించి,నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపి, నిందితులకు శిక్ష పడేలా చూడాలని,అదేవిధంగా పార్లమెంటులో విద్యాహక్కు చట్ట సవరణబిల్లు ప్రవేశపెట్టి, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి అనే నిబంధనను ఎత్తివేసేలా చర్యలు చేపట్టాలన్నారు.

# ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికి చేర్చాలి: బీటెక్ రవి

## డోర్ టు డోర్ క్యాంపెయిన్‌తో ప్రజల్లోకి టీడీపీ

## పులివెందుల టీడీపీ విస్తృత స్థాయి సమావేశం



ప్రజాభూమి,పులివెందుల,

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేయాలనే లక్ష్యంతో "డోర్ టు డోర్ క్యాంపెయిన్"ను విజ యవంతం చేయాలని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.మంగళవారం పులివెందుల టీడీపీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ పరిశీలకుడు సామాకోటి ఆదినారాయణ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.ప్రతి కార్యకర్త గ్రామాల్లో, వార్డుల్లో ప్రజలతో నేరుగా మమేకమై ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించాలని సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని, పార్టీని మరింత బలోపేతం చేయవచ్చని దిశానిర్దేశం చేశారు. కుటుంబాలకు అందుతున్న సంక్షేమ ఫలాలను వివరిస్తూ, ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని మరింత పెంచాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని అన్నారు. ఈ సమావేశంలో మండల ఇన్‌చార్జ్‌లు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# యువత తెలుసుకో... గంజాయి మత్తుతో బతుకు చిత్తు అవుతుంది- జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్




ప్రజాభూమి,పులివెందుల

గంజాయి వంటి మాదక ద్రవ్యాల బారిన పడితే యువత భవిష్యత్తు అంధకారమవుతుందని, మత్తు పదార్థాల వ్యసనం వ్యక్తిగత జీవితాలను, కుటుంబాలను, సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. ఆయన పులివెందుల పర్యటన లో భాగంగా నిర్వహించిన మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు కలెక్టర్‌ను కలిసి గంజాయి నిర్మూలనకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇటీవల యువతలో మాదక ద్రవ్యాల వినియోగం పెరుగుతుండటం ఆందోళన కరమని పేర్కొన్నారు.గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడిన యువత చదువు, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలను కోల్పోయి జీవితాన్ని ప్రమాదంలోకి నెట్టుకుంటున్నారని అన్నారు. మత్తు పదార్థాల వల్ల నేరప్రవృత్తి, కుటుంబ కలహాలు, ఆరోగ్య సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని తెలిపారు.యువత తమ శక్తి, సామర్థ్యాలను సానుకూల దిశగా మలుచుకుని విద్య, క్రీడలు, సామాజిక సేవా కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై నిరంతరం పర్యవేక్షణ ఉంచి, మాదక ద్రవ్యాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం ప్రభుత్వం, పోలీసు శాఖ, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి చేపడుతున్న అవగాహన కార్యక్రమాలను అభినందిస్తూ, సమాజంలో మంచి మార్పు తీసుకురావడంలో ఇటువంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు.యువత తెలుసుకో గంజాయి మత్తుతో బతుకు చిత్తు అవుతుంది. మత్తుకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకోండిఅని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పిలుపునిచ్చారు.అనంతరం స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ, గ్రామాలు, పాఠశాలలు, కళాశాలల్లో మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి యువతను చైతన్యవంతం చేస్తామని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి దేశాభివృద్ధికి తోడ్పడాలని కోరారు.ఈ కార్యక్రమం లో జిల్లా విద్యా శాఖ అధికారి షంషుద్దీన్, డి ఆర్ డి ఏ పీడీ రాజ్యలక్ష్మి,ఎస్ ఎస్ ఏ ఏ పీడీ అనురాధ,మండల విద్యా శాఖ అధికారులు చంద్రశేఖర్ రావు, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కోదండరామ ఆలయ నిర్మాణ హామీ అమలు చేయాలని ఎస్టీ కాలనీవాసుల విజ్ఞప్తి



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని లింగంపల్లి గ్రామంలోని ఎస్టీ కాలనీలో కోదండరామ ఆలయ నిర్మాణానికి గతంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని కాలనీవాసులు కోరారు. బుధవారం వారు మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికల సందర్భంగా ఆలయం నిర్మిస్తామని హామీ ఇచ్చి, పునాదులు మాత్రమే వేసి పనులను నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయ నిర్మాణం పూర్తి కాకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని కోదండరామ ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసి తమ చిరకాల కోరికను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

# వైసీపీ నాయకుడు సిద్ధారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

## సిద్ధారెడ్డి మృతి పట్ల ఎంపీ అవినాష్ రెడ్డి సంతాపం



ప్రజాభూమి,పులివెందుల

వేముల మండలం నల్లచెరువుపల్లికి చెందిన వైఎస్ఆర్సీపీ నాయకుడు రామిరెడ్డి రామ సిద్ధారెడ్డి మంగళవారం రాత్రి ఆరోగ్యం క్షీణించి మరణించారు.ఈ విషయం తెలుసుకున్న ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సిద్ధారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని, ఆయన మృతి చెందడం ఎంతో బాధాకర మన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సిద్ధారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి దుఃఖాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు ఇవ్వాలని ప్రార్థించారు.

# రామాలయంలో కొనసాగుతున్న భాగవత సప్తహ పఠనం



ప్రజాభూమి,సింహాద్రిపురం

సింహాద్రిపురం మండలం ముసలరెడ్డి పల్లి గ్రామంలోని శ్రీ సీతారాముల ఆలయం లోబుదవారం 2 వ రోజు విజయవంతంగా భాగవత సప్తహ పఠనం కార్యక్రమా న్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీబమ్మెర పోతన దంతలపల్లి శాఖ భాగవత భక్త సమాజం నిర్వహణలో దాతల సహకారంతో దిగ్విజయ వంతంగా సాగుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

# అడవిలో స్పీడ్ బాల్స్, విత్తనాలు చల్లిన ఫారెస్ట్ ఆఫీసర్ గోపాలకృష్ణ

ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల నియోజకవర్గం లోని వేమన మండలం పాత కదిరి రోడ్డు సమీపంలో ఉన్న అడవిలో బుధవారం పులివెందుల ఫారెస్ట్ ఆఫీసర్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో స్పీడ్ బాల్స్, రావి, మఱ్ఱి, జీవి, మారేడు, నిర్ది, కుంకుడు , ఎర్రచందనం మొదలగు విత్తనాలను కూలీలతో, డ్రోన్ సహాయంతో విత్తనాలు చల్లే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవిలో ఇప్పటికే చెట్లు తక్కువయ్యాయి వర్షాలు కూడా సమృద్ధిగా పడడం లేదని ఆయన అన్నారు. వర్షాకాలం కావడంతో అడవిలో విత్తనాలు చల్లితే వర్షాలు పడినప్పుడు అవి మొలకెత్తి అడవి సంపద పెరుగుతుందన్నారు. తద్వారా వర్షాలు సమృద్ధిగా పడడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తోటల వద్ద, ఇండ్ల వద్ద మొక్కలు



నాటుకుంటే అవి రేపటి వృక్షాలై భావితరాలకు భాషటగా నిలుస్తాయి అన్నారు. చెట్లు లేక వర్షాలు పడక భూగర్భ జలాలు అడుగంటుతున్నాయన్నారు. అంతకుముందుగా అడవిలో ఉన్న పుట్టను పూజించి ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టినట్టు ఆయన తెలిపారు.

# రైతుల భూ సమస్యల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలి: జాయింట్ కలెక్టర్

## రీ-సర్వేపై సమీక్ష.. స్మార్ట్ కిచెన్ నిర్మాణ పనులు, చౌకదుకాణం ఆకస్మిక తనిఖీ

ప్రజాభూమి, సిద్ధవటం: రైతుల భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించి చర్యలు వేగవంతం చేయాలని కడప జాయింట్ కలెక్టర్ మీది మీనా అధికారులను ఆదేశించారు. బుధవారం సిద్ధవటం తహసీల్దార్ కార్యాలయంలో లింగంపల్లి, మూలపల్లి, నేలనూతలపురం గ్రామాల రైతుల పట్టాదారు భూముల రీ-సర్వేపై సమీక్ష నిర్వహించి సంబంధిత వివరాలను తెలుసుకున్నారు. ఉద్దిమడుగు ప్రాజెక్టు



పరిధిలోని రైతుల భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి వారికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సిద్ధవటంలోని స్మార్ట్ కిచెన్ భవన నిర్మాణ పనులను పరిశీలించిన జాయింట్ కలెక్టర్, షాప్ నంబర్--10 చౌక దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి నిర్వహణపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమార్, డిప్యూటీ తహసీల్దార్ మాధవీలత, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

# మాధవరం చేనేత క్లస్టర్‌ను పరిశీలించిన జాయింట్ కలెక్టర్

- చేనేత కార్మికుల సమస్యలపై వినతులు స్వీకరణ
- క్లస్టర్ స్థలం ఆన్ లైన్ చేయాలని వినతి
- హ్యాండ్లూమ్ టెక్స్టైల్ పార్క్ ఏర్పాటు అంశంపై హామీ
- శ్మశాన స్థల ఆక్రమణ పైన ఫిర్యాదు



ప్రజాభూమి, సిద్ధవటం: సిద్ధవటం మండలం మాధవరం-1 గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్.కె.ఆర్ నగర్‌లో ఉన్న మాధవరం చేనేత క్లస్టర్‌ను బుధవారం జాయింట్ కలెక్టర్ మిధీ ష్నె పరిశీలించారు. క్లస్టర్‌లో ప్రస్తుతం జరుగుతున్న కార్యకలాపాలు, చేనేత కార్మికులకు కల్పిస్తున్న ఉపాధి అవకాశాలపై గుత్తేదారు శ్రీకాంత్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చేనేత సహకార సంఘాల ప్రతినిధులు, కార్మికులతో సమావేశమైన జాయింట్ కలెక్టర్, వారి సమస్యలు, సూచనలు తెలుసుకున్నారు. గ్రామస్థులు మాధవరం క్లస్టర్‌ను హ్యాండ్లూమ్ టెక్స్టైల్ పార్క్‌గా అభివృద్ధి చేసి స్థానిక చేనేత కార్మికులకు స్థిరమైన ఉపాధి కల్పించాలని కోరారు. అలాగే క్లస్టర్ స్థలాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, అర్హులైన కార్మికులకు లీజు కేటాయించి అభివృద్ధి చర్యలు చేపట్టాలని, గ్రామ శ్మశానవాటిక ఆక్రమణకు గురైందని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుని న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కడప చేనేత జౌళి శాఖ ఏడీ ఎస్. అహ్మద్ మొహిద్దీన్, డెవలప్‌మెంట్ ఆఫీసర్ శేషగిరిరావు, చేనేత సహకార సంఘాల నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# కలసపాడు మండలంలో భూ కబ్జాలను అరికట్టాలి : సిపిఐ




ప్రజాభూమి పోరుమామిళ్ల : కడప జిల్లా కలసపాడు మండలం లో భూ ఆక్రమణదారులు దళిత, పేద, బడుగు బలహీన వర్గాల పేర్ల ముసుగులో భూ ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవడంలో రెవిన్యూ అధికారుల తీరుపై సిపిఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్. మండల కార్యదర్శి గుడిమే సునీల్ కుమార్ వారి బృందంతో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మస్తాన్, సునీల్ మాట్లాడుతూ కలసపాడు మండలంలోని తెల్లపాడు పంచాయతీలో "వన్ బి" లో ఉన్న ప్రభుత్వ భూమి వందల ఎకరాల పైబడి భూమిని,గతంలో కొంతమంది వ్యక్తులు ఆన్ లైన్ ఎక్కించుకొని ఎలాంటి అనుభవంలో లేకుండా ఉన్నందున 2024 లో నూతనంగా ఎన్నికైన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,రెవిన్యూ మినిస్టర్ అణగాని సత్యప్రసాద్ విజయవాడలో రెవెన్యూ భూ సమస్యలపై ప్రజా వేదిక ఏర్పాటు చేసిన సందర్భంగా కలసపాడు మండలంలో ఉన్నటువంటి భూ సమస్యలను పైన లిఖిత పూర్వకంగా వినతి పత్రం సమర్పించిన తరువాత, అప్పటి తాసిల్దార్ మధురవాణి మేడం గారు భూ ఆక్రమణదారులను పిలిపించి వారిని అడుగగా, ఆ భూమికి మాకు ఎటువంటి సంబంధం లేదని ప్రభుత్వం వారు ప్రభుత్వ అవసరాలకు వినియోగించు కోవాలని తెలిపారు. ప్రభుత్వ భూమిని కాపాడి ప్రతి పేదవాడికి అసైన్మెంట్ కమిటీ ద్వారా పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఏరియా సమితిగా అధికారులకు తెలుపుతున్నాం. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

# యుద్ధప్రాత పదికన చెరువుల మారమ్మతులు

ప్రజాభూమి పోరుమామిళ్ల : వర్షాకాలం ప్రారంభమావనున్న నేపథ్యంలో కలసపాడు మండలంలోని చెరువుల మారమ్మతులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. కలసపాడు మండలం కలసపాడు,పెండ్లిమఱ్రి, పిడుగుపల్లి, అక్కసిద్దుపల్లి చెరువులకు తెలుగుగంగా కెనాల్ నుండి వచ్చే కాలువలలో పూడిక తీసే పనులు, చెరువు కట్టలకు ఇప్పటికే మారమ్మతు పనులు పూర్తయ్యాయి. చెరువులలో నీరు వృధాకాకుండా తూములకు మారమ్మతులు చేస్తున్నట్లు ఎగువ సగిలేరు నీటి సంఘం అధ్యక్షులు కొత్తపల్లి చిన్నరంగారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుగంగా ఏ ఈ ఈ నవీన్ రెడ్డి, టీడీపీ నాయకులు స్వామి రంగారెడ్డి పాల్గొన్నారు.



ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 8
గురువారం 23 జూలై 2026

# అలిపిరి పోలీసుల నిర్లక్ష్యంపై సీబీసీఐడీ విచారణ జరిపించాలని బాధిత కుటుంబం డిమాండ్

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

తిరుపతి అర్బన్ జిల్లా ఎస్పీకి బాధితురాలు నీరజ వినతిపత్రం సమర్పిస్తూ, తమ కుటుంబానికి జరిగిన అన్యాయంపై సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం, ఉపాధ్యాయ నగర్‌లో నివాసముంటున్న తమ కుటుంబం పలుమార్లు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఏ అధికారి కూడా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టలేదని ఆరోపించారు. ఈ ఏడాది మే 22న అలిపిరి పోలీసులు కరెంట్ మీటర్ దొంగతనం కేసు పేరుతో తన భర్త గుండ్రాజు సుకుమార్ రాజును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారని తెలిపారు. అనంతరం మరుసటి రోజు సుమారు 20 మంది వ్యక్తులు తమ ఇంటిలోకి చొరబడి సీసీ కెమెరాలను ధ్వంసం చేయడం, చెట్లను పీకివేయడం, గదులను ధ్వంసం చేయడం, సోలార్ సిస్టమ్‌కు సంబంధించిన సామగ్రి, ఫ్రిజ్, కుర్చీలు, ఫ్యాన్లు, గ్యాస్ సిలిండర్లు, బ్యాంకర్లు తదితర సుమారు రూ. 10 లక్షల విలువైన వస్తువులను తీసుకెళ్లారని ఆరోపించారు. ఘటన జరిగిన సమయంలో అత్యవసర సేవలకు పలుమార్లు సమాచారం ఇచ్చినా తగిన స్పందన లభించలేదని, అనంతరం అలిపిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లినా కేసు నమోదు




చేయలేదని పేర్కొన్నారు. తరువాత జిల్లా ఎస్పీని ఆశ్రయించడం, హైకోర్టు నుంచి ఆదేశాలు పొందిన అనంతరం మాత్రమే కేసు నమోదు చేసినప్పటికీ, తాము సమర్పించిన ఫోటోలు, వీడియోలు, ఇతర ఆధారాలపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఫిర్యాదులను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నారని, భూకబ్జాదారులకు కొందరు అధికారులు సహకరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. గతంలో వృద్ధులపై నమోదైన కేసుల వల్ల తీవ్ర మానసిక వేదనకు గురై ఒక వృద్ధ మహిళ మరణించిందని కూడా వినతిపత్రంలో పేర్కొన్నారు. మే నెల నుంచి ఇప్పటివరకు జరిగిన మొత్తం పరిణామాలపై సీబీసీఐడీ ద్వారా సమగ్ర విచారణ జరిపించి, వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని తిరుపతి అర్బన్ జిల్లా ఎస్పీని బాధితురాలు నీరజ కోరారు.

## భవిష్యత్తు ఉన్నతికి విద్యే మూలం

**–పదిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల సన్మానం కార్యక్రమం**

ప్రజా భూమి ప్రతినిధి శ్రీ కాళహస్తి టౌన్





సుబ్బమ్మ –మోహన్ రావు ఫౌండేషన్ వారిచే గత 2025–26సంవత్సరం పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఘనంగా సన్మానించినట్లు ఎస్. మోహన్ రావు ఒక ప్రకటన లో తెలిపారు. శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు 1, 2, 3 ర్యాంకు విద్యార్థులకు బహుమతులను మంగళవారం సాయంత్రం సరస్వతి బాయి మున్సిపల్ హై స్కూల్ నందు నిర్వహించారు. సుమారు 15 ప్రభుత్వ పాఠశాలల్లో 45 మంది విద్యార్థులను మెమెంటో, మెడల్స్ మెరిట్ సర్టిఫికెట్ లతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మోహన్ రావు, సుబ్బమ్మ కుటుంబ సభ్యులు అందరూ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారని, అందుకే వారికి విద్య ప్రాముఖ్యత తెలుసున్నారు. ఒక వ్యక్తి భవిష్యత్తును నిర్ణయించేది విద్య మాత్రమే అని, తల్లిదండ్రులు పిల్లలకు మంచి విద్యను అందించాలని అన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ కె.వి. కృష్ణా రెడ్డి, పై.వి.ఆర్ గ్రూపు డైరెక్టర్ ముకుంద రావు జె.పవార్, పూల కృష్ణయ్య, ఎస్ ఎం ఆర్ ఫౌండర్ ఎస్. మోహన్ రావు, ప్రెసిడెంట్ ఎస్.కుమార్ మోహన్ రావు, జాయింట్ సెక్రటరీ ఎస్. పుష్ప జ్యోతి, ఎ.జెస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## మూడో రోజు కొనసాగుతున్న జి. ఓ. నెం 396 ను సవరించాలని నిరసన

ప్రజాభూమి ప్రతినిధి
శ్రీకాళహస్తి టౌన్



జి.ఓ. నెం 396ను సవరించాలని కోరుతూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన జి.ఓ. నెం396ను సవరించాలని కోరుతూ శ్రీకాళహస్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట దస్తావేజు లేఖరులు చేపట్టిన నిరసన 3వ రోజు కొనసాగింది.. ఈ సందర్భంగా రైటర్లు మాట్లాడుతూ నూతన జీఓ వలన వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న అనేక కుటుంబాలు వీధిన పడతాయని పేర్కొన్నారు. ప్రయివేటు సంస్థలకు దస్తావేజు లు తయారు చేసే పనిని అప్పగించడం వలన ప్రజల ఆస్తులపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. సోమవారం నుంచి నెలాఖరు వరకు చేపట్టిన పెన్ డౌన్ కార్యక్రమంకు ప్రజలు తమ సహకారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు రైటర్లు పాల్గొన్నారు.

## సదరం పేరుతో అమాయకులను మోసం చేస్తున్న దళారులపై చర్యలు తీసుకోవాలి - అడ్వకేట్ విజయ్ ఉత్తరాది

ప్రజా భూమి ప్రతినిధితిరుపతి,



తిరుపతి రుయా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సదరం సర్టిఫికెట్లు ఇప్పిస్తామని చెప్పి అమాయక ప్రజల నుండి కొందరు దళారులు డబ్బులు వసూలు చేస్తున్న ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నామని విజయ్ ఇంపాక్ట్ ఫౌండేషన్ చైర్మన్ విజయ్ ఉత్తరాది అన్నారు. ఈ మేరకు ఈరోజు కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ ప్రతినిధి బృందంతో కలిసి రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ గారిని కలిసి వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా విజయ్ ఉత్తరాది మాట్లాడుతూ.. "దివ్యాంగులకు ప్రభుత్వం పూర్తి ఉచితంగా అందిస్తున్న సదరం సేవలను అడ్డుపెట్టుకుని కొందరు దళారులు దందా చేస్తున్నారు. ఆసుపత్రికి వచ్చే అమాయక ప్రజల అవసరాన్ని, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని డబ్బులు దండుకోవడం అమానుషం. ఇలాంటి వారిపై పోలీసు కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి. ఆసుపత్రి ప్రాంగణంలో దళారుల ప్రవేశాన్ని నిషేధించి, ప్రత్యేక నిఘా, సీసీ కెమెరాల పర్యవేక్షణ ఏర్పాటు చేయాలి" అని డిమాండ్ చేశారు. ప్రజలు ఎవరూ దళారుల మాటలు నమ్మి ఒక్క రూపాయి కూడా ఇవ్వవద్దని, సదరం సర్టిఫికెట్ ప్రభుత్వ ప్రక్రియ ద్వారా పూర్తిగా ఉచితంగానే వస్తుందని, ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ అధ్యక్షురాలు వి. సంధ్యారాణి, విజయ్ ఇంపాక్ట్ ఫౌండేషన్ చైర్మన్ విజయ్ ఉత్తరాది, వైస్ ప్రెసిడెంట్ ప్రేమ్ సాగర్, కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ సెక్రటరీ కురువ గురురాజు, డిప్యూటీ సెక్రటరీ విజయభాస్కర్, సభ్యులు జనార్ధన్, యోకాష్ వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యం ను అపహాస్యం చేయొద్దు - కాంగ్రెస్ పార్టీ

ప్రజా భూమి ప్రతినిధి సూళ్లూరుపేట.

లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అక్రమ అరెస్ట్ ను నిరసిస్తూ సూళ్లూరుపేట నియోజకవర్గం నందు డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు ఆధ్వర్యంలో భారీ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొని భారీ ర్యాలీగా వెళ్లి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగం బ్రతకాలని పూలమాలలు వేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు మాట్లాడుతూ నేడు భారతదేశం లో ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతుంది అని నేడు లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారం అయిందని ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ వైఫల్యం అని దీనికి సంబంధిత కేంద్ర విద్యాశాఖ మంత్రి బాధ్యత తీసుకుని వెను వెంటనే రాజీనామా చేయాలని కోరారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ నేడు భారతదేశంలో నియంత పాలన కొనసాగుతుందని లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గారు శాంతియుతంగా నిరసన తెలియజేస్తుండగా అధికారజులుం తో వారిని రక్త గాయాలు అయ్యేటట్లు హింసించి వారి అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని, గాంధీల కుటుంబం భారతదేశం కోసం ప్రాణాలను అర్పించిందని, ప్రశ్నించే గొంతుకులను అణిచివేయడం సరికాదని నీట్ పేపర్ లీకులకు కారణమైన వారిని తక్షణమే శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, నియోజకవర్గ సమన్వయకర్తలు, మండల అధ్యక్షులు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## అమెరికా స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం వెంటనే రద్దు చేయాలి.. ఏ.ఐ.కే.ఎస్

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి రూరల్

రైతులకు నష్టం చేసే అమెరికా స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు అంగెరి పుల్లయ్య డిమాండ్ చేశారు. బుధవారం శ్రీకాళహస్తి మండల తాసిల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ఉన్న రైతుల నడ్డి విరిచి పరాయి దేశానికి మేలు చేసే




విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోతున్న దుర్మార్గమైన అమెరికా స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం కానీ జరిగితే మనదేశంలో వ్యవసాయ రంగాన్ని జీవనాధారంగా ఎంచుకొని తమ కుటుంబాలను పోషించుకుంటున్న 11 కోట్ల మంది రైతుల జీవితాలు నడిరోడ్డున పడతాయని, అలాగే 8 కోట్ల మంది పాడి రైతుల జీవితాలు నట్టేట మునిగిపోతాయని అన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం పరాయి దేశానికి మేలు చేసే ఆలోచనను పక్కనపెట్టి ఎన్నో వ్యయ ప్రయాసలను ఎదుర్కొని పంటలు పండించే ప్రతి రైతుకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా గ్యారెంటీ చట్టాన్ని తీసుకురావాలని, మధ్యతరగతి రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం పదివేల రూపాయలు పెన్షన్ అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రతి రైతుకు రుణమాఫీ కల్పించాలని, నాలుగు లేబర్ కోట్లను వెంటనే రద్దు చేయాలని ఆయన రైతు సంఘం తరఫున డిమాండ్ చేశారు. అమెరికా స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను రద్దు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతు సంఘం ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి మండల తాసిల్దార్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గంధం మణి, పెనగడం గురవయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రంగయ్య, రాపూరు సుబ్రమణ్యం, మనోహర్, నాగరాజు, వెంకటాద్రి, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బంది లేకుండా పనులు పూర్తి చేయండి ఎమ్మెల్యే బొజ్జల

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి.



శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశానుసారం ఏర్పేడు మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు పేరం నాగరాజ నాయుడు సహకారంతో ముసలిపేడు మాజీ సర్పంచ్ వై మనోహర్ నాయుడు ఆధ్వర్యంలో ముసలిపేడు సబ్ స్టేషన్ పరిధిలోని (ముసలిపేడు,సరస్వతీకండ్రిగ, కందాడ, సదాశివపురం, బతినయ్య కాలనీ, వేడం) లలో ఆర్ డి ఎక్స్ లైన్ లాగుటకు ర్ అబి అధికారులతో కరెంట్ అధికారులు సమన్వయం చేసుకొని రోడ్డు కి దూరంగా లైన్ లాగుటకు నిర్ణయించి వీలైనంత తొందరగా కాంట్రాక్టర్ దారుడు లైన్ లాగి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ర్ అండ్ బి డి ఈ రియాజ్ మరియు ర్ అండ్ బి . వర్క్ ఇన్స్పెక్టర్ మురగయ్య నాయుడు, ఏర్పేడు కరెంట్ ఏ ఈ మరియు లైన్ మెన్స్ పాల్గొన్నారు.

## తిరుపతి పార్లమెంట్ పీసీ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహణ

ప్రజా భూమి ప్రతినిధి సర్వేపల్లి



నెలలో నాలుగో బుధవారం నిర్వహించే తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ (పీసీ) స్థాయి సమీక్షా సమావేశం బుధవారం సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నివాసంలో తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు, టీటీడీ బోర్డు సభ్యురాలు డా. పనబాక లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణ, నియోజకవర్గాల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకెళ్లే అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రతి నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. సమావేశం అనంతరం సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్న నాయకులకు తన నివాసంలో విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ జనరల్ సెక్రటరీ డాలర్స్ దివాకర్ రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్, తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జ్ జేబీ శ్రీనివాస్, సత్యవేడు ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులు, రైల్వే అవసరాలకు రోడ్డు స్థలం పరిశీలన

ప్రజా భూమి ప్రతినిధి రైల్వే కోడూరు





తిరుపతి జిల్లా రైల్వేకోడూరు మండలంలోని బొజ్జవారిపల్లి గ్రామ సమీపంలోని ఎల్‌సీ రైల్వే గేట్ నెం. 86 వద్ద నిర్మించిన అండర్‌బ్రిడ్జి కారణంగా సుమారు 500 ఎకరాల వ్యవసాయ భూములకు, అలాగే రైల్వే నిర్వహణ అవసరాలకు వెళ్లే రహదారి లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు డీఆర్‌యూసీసీ సభ్యుడు తల్లెం భరత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రైల్వే అధికారులు, సర్వేయర్లు కలిసి స్థల పరిశీలన నిర్వహించారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన హద్దులను గుర్తించి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, వర్షాకాలంలో అండర్‌బ్రిడ్జిలో నీరు చేరినప్పుడు నీటిని తొలగించేందుకు మిషన్లు, ఇతర యంత్ర సామగ్రి వెళ్లేందుకు ప్రత్యేక రహదారి తప్పనిసరి అని తెలిపారు. రైతుల రాకపోకలు సులభతరం కావడంతో పాటు రైల్వే నిర్వహణ పనులు కూడా అంతరాయం లేకుండా సాగేందుకు రోడ్డు నిర్మాణం చేపట్టే దిశగా ఈ సర్వే నిర్వహించినట్లు వెల్లడించారు.

## కోర్టు ఆర్డర్ ను దిక్కరించిని తిరుచానూరు సర్కిల్ ఇన్స్పెక్టర్

**భూకబ్జాదారునికి అండగా చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ్యులు పులివర్తి నాని అనుచరుడు అలిమినేని మధు నాయుడు**

ప్రజా భూమి ప్రతినిధి
తిరుపతి రూరల్







చంద్రగిరి నియోజకవర్గశీ తనపల్లి గ్రామానికి చెందిన సుజన్ కుమార్ రెడ్డి తన బాధను తెలియజేశాడు. సుజన్ కుమార్ రెడ్డి తల్లి పి.విజయ్ కుమారి పేరు మీద ఉన్న వ్యవసాయ భూమిని తిరుపతి జిల్లా తిరుచానూరు పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కు బాధితులు కోర్టు ఆడర్ ను చూపించి న్యాయంకొరగా కోర్టు ఉత్తర్వులను కూడా లెక్క చేయకుండా ఎవరైతే భూ కబ్జాకి పాల్పడ్డారో వాళ్ళకి సపోర్ట్ గా నిలబడి వారికి సహాయ సహకారాలు అందిస్తున్నారని బాధితుడు సుజన్ కుమార్ రెడ్డి మన తిరుపతి ప్రెస్ క్లబ్ మీడియా సమావేశంలో తన బాధను వెల్లడించారు. బాధితుల యొక్క భూమికి సంబంధించిన పత్రాల కాపీ, మరియు భూమికి సంబంధించిన పత్రాలు14/02/1981 లో వ్యవసాయా భూమి కి సంబంధించిన డాక్యుమెంట్స్ అన్ని కోర్టుకు సమర్పించడంతో సుజన్ కుమార్ రెడ్డికి అనుగుణంగా తీర్పు ఇచ్చింది. కాని రాధిక భార్స్కర్ రెడ్డి అనే పేరు మీద మరో నకిలీ పత్రాలు సృష్టించి తిరుచనూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ భూ కబ్జాదారులకు సహాయ సహకారాలు అందిస్తూ ఆక్రమించిన భూమికి కంచ్చ వేశారు అని సుజన్ కుమార్ రెడ్డి మీడియాకి వెల్లడించారు. భుకబ్జాదారునికి మద్దతుగా చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ్యులు పులివర్తి నాని అనుచరుడు ఆలిమినేని మధు నాయుడు అండగా నిలిచి భాధితులకి బెదిరింపులకు పాల్పాడుతున్నారు అని కన్నీటి బాధను వ్యక్తం చేశారు.

## ఎస్టీవీ నగర్ గంగమ్మ జాతరలో పాల్గొన్న భూమన అభినయ్ రెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



తిరుపతి ఎస్టీవీ నగర్ పెద్ద హరిజనవాడలో నిర్వహిస్తున్న శ్రీ గంగమ్మ తల్లి జాతర సందర్భంగా 13, 14 వార్డుల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆహ్వానం మేరకు తిరుపతి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ భూమన అభినయ్ రెడ్డి జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ గంగమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జాతర నిర్వాహకులు, స్థానిక ప్రజలు భూమన అభినయ్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొటూరు ఆంజనేయులు, జిల్లా సోషల్ మీడియా ఉపాధ్యక్షుడు ఇరగం అనిల్ రెడ్డి, కొటూరు శశి, మించల చందు, కొటూరు శివ, సాయి రోహిత్, ప్రేమ్ తదితర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వరుస ప్రమాదాలకు నిలయంగా ముద్దుమూడి గ్రామం

**- పశువులను ఏదేచ్ఛగా రోడ్డుపై వదులుతున్న వైనం**

**- రాత్రి సమయంలో ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు**

ప్రజా భూమి ప్రతినిధి
శ్రీకాళహస్తి రూరల్



శ్రీకాళహస్తి నియోజకవర్గం లోని ముద్దుమూడి గ్రామం వద్ద వరుస రహదారి ప్రమాదాలు స్థానిక ప్రజలను, వాహనదారులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి.. రోడ్లపై స్వేచ్ఛగా సంచరిస్తున్న పశువులు రాత్రి, పగలు తేడా లేకుండా , జీవాలను యజమానులు రోడ్డుపైనే వదిలేస్తుండటంతో రాకపోకలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. రాత్రి వేళల్లో పెరిగిన మువ్పు చీకటి పడేసరికి రోడ్డుపై ఉన్న పశువులు సరిగ్గా కనిపించక ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నారు. నియంత్రణ తప్పి పశువులను ఢీకొట్టడం వల్ల వాహనదారులు తీవ్రంగా గాయపడటమే కాకుండా, కొన్నిసార్లు ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. పశువుల యజమానులు తమ జీవాలను రోడ్లపై వదలకుండా సురక్షిత ప్రాంతాల్లో కట్టేయాలని, వాహనదారులు తెలియజేస్తున్నారు. రాత్రి వేళల్లో పశువులు స్పష్టంగా కనిపించేలా వాటి కొమ్ములకు రేడియం స్టిక్కర్లు వేయడం మంచిదని వాహనదారులు తెలియజేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, రోడ్లపై సంచరించే పశువుల యజమానులకు హెచ్చరికలు జారీ చేయాలని మరియు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ఎన్టీఆర్ నగర్లోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో డైరీలో పంపిణీ

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్



శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ నగర్లో గల స్థానిక మున్సిపల్ హైస్కూల్ నందు విశ్రాంత ఉపాధ్యాయుడైన ఆనంద రెడ్డి రూపొందించబడిన ప్రత్యేకమైన డైరీని పెన్నులను 120 మంది విద్యార్థులకు అందించడం జరిగింది. నాకు ఓపిక ఉన్నంతకాలం ఆధ్యాత్మిక అవధూత మాస పత్రికను ప్రచురిస్తూ, విద్యార్థులకు అవసరమైన, ఇతిహాస కథలు, స్వామి వివేకానందుని బోధనలు, భారత రాజ్యాంగము, ధ్యానము, లాంటి అంశాలపై దృష్టి సారించి పత్రికను కొనసాగిస్తానన్నారు. ప్రధానోపాధ్యాయురాలు బృందాదేవి మాట్లాడుతూ డైరీలు అనేది జీవితానికి ఒక దిక్సూచి లాంటిదని అలాంటి డైరీ ప్రతిరోజు రాయడం వలన మనం చేసినది ఏమిటి ? చేస్తున్నది ఏమిటి? ఏమి చేయవలెను అని విషయము పై దిశ నిర్దేశం చేస్తుందని అన్నారు. ఆనంద్ రెడ్డి , ఉపాధ్యాయ వృత్తి లో నుంచి, వచ్చినందువలన విద్యార్థుల పైన మమకారంతో 12 సంవత్సరములపైగా రిటైర్డ్ అయినప్పటికీ మీ యొక్క శ్రేయస్సును కోరుతూ ఇంకా సామాజిక సేవ చేయడం అభినందించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ అసిస్టెంట్ గోపి మాస్టారు ఇతర ఉపాధ్యాయ ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

# జాతీయ మామిడి దినోత్సవంలో పాల్గొన్న.. జాయింట్ కలెక్టర్ గోవిందరావు

ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట. విదేశీ ఎగుమతికి ఆమోదం కలిగిన మామిడి ఉత్పత్తులు పండించండి ,జాతీయ మామిడి దినోత్సవంలో జాయింట్ కలెక్టరు శ్రీ గోవింద రావ్ , రాష్ట్రీయ సేవా సమితి (రాస్), కృషి విజ్ఞాన కేంద్రం, తిరుపతి కోకా కోలా ఇండియా ఫౌండేషన్ వారి సహకారంతో ఈ రోజు రాస్ కృషి విజ్ఞాన కేంద్రం, కరకంబాడి నందు "జాతీయ మామిడి దినోత్సవాన్ని" ఘనంగా నిర్వహించినట్లు కేంద్ర సీనియర్ శాస్త్రవేత్త మరియు హెడ్ డా.ఎస్.శ్రీనివాసులు తెలిపారు. తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టరు శ్రీ ఆర్. గోవింద రావ్ ఐ.ఏ.ఎస్ మరియు రాస్ స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి డా.ఎస్.వెంకటరత్నం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, తిరుపతి జిల్లా ఉద్యాన అధికారి శ్రీ జయ భరత్ రెడ్డి, నాబార్డు, జిల్లా అభివృద్ధి అధికారి శ్రీ చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ సామాజిక ప్రకృతి వ్యవసాయ పథకం సంచాలకులు శ్రీ షణ్ముగం, రాస్ కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు మరియు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుండి 250 పైగా రైతులు, రైతు మహిళలు మరియు వ్యవసాయ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా రైతులు మరియు అధికారులు కార్యక్రమంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శన సందర్శించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా జాయింట కలెక్టరు శ్రీ ఆర్. గోవింద రావ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధాన ఉద్యాన పంట అయిన మామిడిలో కోకా కోలా



ఇండియా ఫౌండేషన్ వారి సహకారంతో ఉన్నతి మ్యాంగో పథకం ద్వారా జిల్లాలోని రైతుల ఆదాయం పెంచటానికి రాస్ మరియు కృషి విజ్ఞాన కేంద్రం వారు చేపట్టిన కార్యక్రమాల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, రైతులు విదేశీ ఎగుమతులకు ఆమోదయోగ్యమైన మామిడి ఉత్పత్తులు పండించాలని తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని రైతు సేవా కేంద్ర సిబ్బంది కృషి విజ్ఞాన కేంద్ర యొక్క సేవల గురించి రైతులకు తెలియచేయాలని అన్నారు. రాస్ స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి డా.ఎస్.వెంకటరత్నం మాట్లాడుతూ "ఉన్నతి మ్యాంగో" పథకం ద్వారా చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి తెలిపి, రైతులు రసాయన అవశేష రహిత మామిడి పంట పండించటం ద్వారా అధిక మార్కెట్ ధర పొందటమే కాక సాగు ఖర్చు కూడా తగ్గించుకోవచ్చని తెలిపారు, అదేవిధంగా మామిడిలో కొమ్మ కత్తిరింపులు, పాత తోటల పునరుద్ధరణ, తల మార్పిడి మొదలైన సాంకేతికతలు పాటించటం ద్వారా మంచి దిగుబడులు పొందవచ్చని తెలిపారు. చంద్రశేఖర్, డి.డి. ఎం, నాబార్డు వారు మాట్లాడుతూ మామిడి రైతుల మౌలిక సదుపాయాల అభివృద్ధికి నాబార్డు వారు అందిస్తున్న వివిధ రాయితీ పథకాలు, పంట భీమా పథకాలు గురించి తెలుపుతూ, రైతులు మామిడి విలువ జోడింపు పై దృష్టి సారించాలని అన్నారు. కృషి విజ్ఞాన కేంద్ర హెడ్, డా. ఎస్,శ్రీనివాసులు మాట్లాడుతూ జాతీయ మామిడి దినోత్సవ ప్రాముఖ్యత, మామిడిలో నాణ్యమైన, అధిక దిగుబడులు పొందటానికి ఉపయోగపడే కాయ తొడుగులు, పండు ఈగ బుట్టలు, జీవ సంబంధిత పురుగుమందుల వినియోగం, ప్రస్తుత ఎల్ నీనో పరిస్థితులలో సాగులో ఉన్న పంటలలో తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తల గురించి వివరించారు. ఉద్యాన శాస్త్రవేత్త శ్రీ సుధాకర్ మాట్లాడుతూ మామిడిలో కోత అనంతరం చేపట్టవలసిన యాజమాన్యం, ఎల్ నీనో పరిస్థితులలో ఉద్యాన పంటలలో పాటించవలసిన జాగ్రత్తలు, మామిడిలో వివిధ రకాలు మొదలైన అంశాల గురించి తెలియ చేసారు. కార్యక్రమంలో తరువాత ఉన్నతి మ్యాంగో పథకంలో భాగంగా మామిడిలో మంచి దిగుబడులు సాదించిన రైతులకు అతిథుల చేతులమీదుగా ప్రశంసా పత్రాలు అందచేసి, మామిడి సాగు పై కె.వి.కె వారి ప్రచురణ విడుదల చేశారు. అదేవిధంగా ప్రదర్శనా క్షేత్రాల నిమిత్తం రైతులకు వరి విత్తనం, పురుగు మందులు, జీవన ఎరువులు, షెడ్యూల్డ్ కులాల రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు పంపిణీ చేశారు.

# అదునాతన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు చేస్తాం

## అభివృద్ధి పనులను మరింత వేగంగా పూర్తి చేయాలి - ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి నగరంలోని మటన్, ఫిష్, కూరగాయలు ఒకే చోట దొరికేలా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వెల్లడించారు. నగరంలో జరుగుతున్న





అభివృద్ధి పనులను మరింత వేగంగా పూర్తి చేసేందుకు అధికారులు శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే తెలిపారు. ఇటీవల మటన్ మార్కెట్ లో కుళ్ళిన మాంసం దొరకడంతో పాటు చేపల మార్కెట్ లో పురుగులు పట్టిన చేపలు బయటపడటంతో జనావాసాల మధ్య మటన్, ఫిష్ మార్కెట్ లు వద్దని ప్రజల నుంచి ఫిర్యాదులు అందినట్లు ఎమ్మెల్యే తెలిపారు. దీంతో మంగళవారం ఉదయం అక్కరాంపల్లి వద్ద ఉన్న చెత్త సేకరణ కేంద్రం (గార్బేజ్ ట్రాన్స్ పోర్ట్ స్టేషన్) వద్ద స్మార్ట్ సిటీ కింద చేపట్టి నిలిచిపోయిన కూరగాయల మార్కెట్ నిర్మాణాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఇంచార్జ్ కమిషనర్ శారదా దేవి, అర్బన్ డెవలప్మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వూకా విజయకుమార్, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో నగర అభివృద్ధిపై సమీక్షించారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి అనుమతిస్తే ఆరు నెలల్లో పూర్తి చేస్తామని స్మార్ట్ సిటీ ఈఈ రుద్రరాజు రవి ఎమ్మెల్యే కి స్పష్టం చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో జరుగుతున్న పనులను ఎస్.ఈ.శ్యాంసుందర్ వివరిస్తూ నగరంలో ఇంకా 23 కిలో మీటర్ల మేర మట్టి రోడ్లు ఉన్నట్లు తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పాతది కావడంతో తరచూ లీకేజీల సమస్య ఎదురవుతున్నట్లు చెప్పారు. కాగా మురుగునీటి డ్రైనేజీ కాలువల నిర్మాణానికి 135 కోట్ల రుణం త్వరలో మంజూరు కానున్నట్లు ఎస్.ఈ తెలిపారు. రోజు తాగునీరు అందించాలంటే ఎండి పుత్తూరు నుంచి మంగళం వరకు నిర్మించ తలపెట్టిన రెండో వాటర్ పైపు లైన్ పూర్తి చేస్తేనే సాధ్యమవుతుందని ఆయన చెప్పారు. రెండో పైపు లైన్ పై టిటిడి పెట్టిన షరతులపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తేనే ముందుకి వెళ్లగలమని ఆయన తెలిపారు. అన్నా క్యాంటీన్లు నిర్వహణను మరింత మెరుగు పరచాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆదేశించారు. ముత్యాలరెడ్డి పల్లి పరిధిలోనే ఉన్న నాలుగు అన్నా క్యాంటీన్ లలో రెండింటిని జీవకోన, ఆటో నగర్ లలో ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఎమ్మెల్యే ఆరణి తెలపగా నిబంధనల ప్రకారం ప్రస్తుతం ఉన్న వాటిని మార్చలేమని దాతల సాయంతో అన్నా క్యాంటీన్ నిర్మిస్తే ప్రభుత్వం సబ్సిడీ రేట్ కింద అన్నం అందిస్తుందని ఇంచార్జ్ కమిషనర్ శారదా దేవి తెలిపారు. స్మార్ట్ సిటీకి వెచ్చించిన నిధుల్లో రాష్ట్ర ప్రభుత్వ వాటా వస్తే నిధుల సమస్య తలెత్తదని ఎస్.ఈ చెప్పారు. పారిశుద్ధ్యం నిర్వహణ మరింత మెరుగు పరచాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్ రెడ్డిని ఆదేశించారు. చెత్త సేకరణ, తరలింపు ఉదయం, మధ్యాహ్నం చేస్తున్నట్లు హెల్త్ ఆఫీసర్ తెలిపారు. క్లీనింగ్ రాత్రి పూట చేస్తున్నట్లు ఆయన చెప్పారు. 17 స్వీపింగ్ మిషన్స్ త్వరలో వస్తాయని, దీంతో నగర పరిశుభ్రత మెరుగుపడటమే కాకుండా పారిశుద్ధ్య కార్మికులపై ఒత్తిడి తగ్గుతుందని హెల్త్ ఆఫీసర్ తెలిపారు. రెవెన్యూ వసూళ్లు 85 శాతం పైన సాధించాలని ఎమ్మెల్యే రెవిన్యూ అధికారులను ఆదేశించారు. ప్రవేట్ బిల్డింగ్ యాజమానులు పన్ను కడుతున్నా రాష్ట్ర ప్రభుత్వ శాఖలు ఏవీ సక్రమంగా కట్టడం లేదని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అలాగే ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లలో కొత్త ఇబ్బందులు ఎదురవుతున్నట్లు వాళ్ళు ఎమ్మెల్యే కు తెలిపారు. కాగా టిటిడి 2004 నుంచి ఆస్తి పన్ను చెల్లించకపోవడంతో ఇప్పటి వరకు 136 కోట్ల ఆస్తి పన్ను టిటిడి బకాయి పడినట్లు ఎమ్మెల్యేకి అధికారులు తెలిపారు. మైక్రో కార్డ్ ప్లానింగ్ తో మహిళా సంఘాల సభ్యులకు లోన్ల మంజూరులో ఇబ్బందులు రాకుండా చూడాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. కాగా గ్రేటర్ కార్పొరేషన్ గా తిరుపతిని మార్చే ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. కార్పొరేషన్ ప్రత్యేక అధికారి అయిన కలెక్టర్ వెంకటేశ్వర్ పంచాయితీల విలీన ప్రక్రియ ను పర్యవేక్షిస్తున్నట్లు ఇంచార్జి కమిషనర్ శారదా దేవి తెలిపారు. కార్పొరేషన్ ఉద్యోగులు సమయ పాలనకు పెద్దపీట వేసి సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. సచివాలయం సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని ఫిర్యాదులు నిత్యం వస్తున్నాయని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. జనాభా లెక్కలు, సర్ కార్యక్రమాల్లో లేని సిబ్బంది సచివాలయాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని ఇంచార్జ్ కమిషనర్ శారదా దేవి ఎమ్మెల్యేకి తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, వివిధ శాఖల హెచ్ ఓ డీ లు పాల్గొన్నారు.

# వైద్యాధికారి డాక్టర్ చక్రపాణికి ఐద్వా - జనవిజ్ఞాన వేదిక వినతిపత్రం!

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట. రేణిగుంటకు "కమ్యూనిటీ హెల్త్ సెంటర్" అభివృద్ధి కి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే కృషి చేయాలి,రేణిగుంట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తక్షణమే "కమ్యూనిటీ హెల్త్ సెంటర్,గా అప్‌గ్రేడ్" చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఏ, ఐ, డి,డబ్ల్యూ, ఏ.) జన విజ్ఞాన వేదిక నాయకులు బుధవారం ఉదయం 11 గంటలకు రేణిగుంట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చక్రపాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కొండ్రెడ్డి ఈశ్వరమ్మ, జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరమణ మాట్లాడుతూ




రేణిగుంట మండల జనాభా లక్ష మందికి పైగా పెరిగిందని, పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు కూడా ఈ ఆసుపత్రిపైనే ఆధారపడుతున్నారని తెలిపారు. ప్రతినెల వేలాది మంది రోగులు చికిత్స కోసం వస్తున్నప్పటికీ, ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలు, పడకల సంఖ్య, వైద్య సిబ్బంది ప్రజల అవసరాలకు సరిపోవడం లేదని పేర్కొన్నారు.అందువల్ల రేణిగుంట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేయడం, పడకల సంఖ్యను కనీసం 30కు పెంచడం, అవసరమైన వైద్యులు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు మరియు ఇతర సిబ్బందిని నియమించడం, 24 గంటల అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం, తాగునీరు, పరిశుభ్రత, గర్భిణీలకు ప్రత్యేక మరుగుదొడ్లు, భద్రతా సిబ్బంది వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు ఓ. వెంకటరమణ మాట్లాడుతూ రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను "కమ్యూనిటీ హెల్త్ సెంటర్" అప్ గ్రేడ్ చేసి హాస్పిటల్ అభివృద్ధి కి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే కృషి చేయాలని పత్రికా ప్రకటన ద్వారా కోరారు. ఈ డిమాండ్లను సంబంధిత జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి, రేణిగుంట ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని వైద్యాధికారి డా. చక్రపాణి హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కొండ్రెడ్డి ఈశ్వరమ్మ, జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు ఓ. వెంకటరమణ, ఐద్వా మండల అధ్యక్షురాలు భారతి, గీత, గిరిజన సంఘం నాయకులు మునిస్వామి, సిపిఐ రేణిగుంట ప్రాంత కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్ పాల్గొన్నారు.

# గురుకులాన్ని యధావిధిగా కొనసాగించాలి

## అఖిల పక్ష నాయకులు డిమాండ్

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు, గూడూరు నియోజకవర్గంలోని కోట డా.బిఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలను యధావిధిగా కొనసాగించాలని అఖిల పక్ష నాయకులు జి.శశి కుమార్, వై. సునీల్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద అఖిల పక్ష నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జి. శశి కుమార్, వై. సునీల్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, ఎంతో మంది ఉన్నతికి తోడ్పడిన కోట అంబేద్కర్ గురుకుల పాఠశాలను సెంటర్స్ ఆఫ్ ఎక్స్ లెన్స్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మూసివేయడం దారుణమన్నారు.. సుమారు 600 మంది విద్యార్థుల భవిష్యత్ గందరగోళం అయిందన్నారు. సెంటర్స్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కు అవసరమైన కొత్త భవనాలు, ప్రత్యామ్నాయ ప్రభుత్వ స్థలాలను కేటాయించే ఆలోచన చేయాలని కోరారు. తరలింపు నేపథ్యంలో ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు, తల్లి దండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి గురుకుల పాఠశాలను యధావిధిగా కొనసాగించాలని తెలిపారు. అనంతరం అఖిల పక్ష నాయకులు జడ్డా వెంకటరమణయ్య, డాక్టర్ రామకృష్ణరావు మాట్లాడుతూ ఎస్సీ గురుకుల పాఠశాలను సెంటర్ ఆఫ్ ఎక్స్లెన్స్ నెపంతో ఎత్తి వేయడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు వలన వందల మంది విద్యార్థుల భవిష్యత్ అగమ్య గోచరంగా మారిందన్నారు.



కూటమి ప్రభుత్వం ప్రభుత్వ విద్యా సంస్థలను నిర్వీర్యం చేస్తోందన్నారు. ప్రజా, విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఇకనైనా మేల్కొని ప్రత్యక్ష పోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి యధావిధిగా గురుకుల పాఠశాలను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు జమాలుల్లా, సివిఆర్ కుమార్, భాస్కర్ గౌడ్, వేగూరు విజయ్ కుమార్, నారాయణ, రమేష్, గోపి, ఎల్.వి. సుబ్బయ్య, వెంకటేశ్వర్లు రాజు, షఫీ మౌలానా, ఫయాజ్, ఇబ్రహీం, వేమయ్య, అంకయ్య, హిదాయతుల్లా, ఇబ్రహీం మౌలానా, మస్తానయ్య, రిజ్వాన్, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

# ఎర్పేడు రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంపై మండల ప్రజల ఆగ్రహం

## రీసర్వే చేయకుండానే నోటీసులు.. రైతులకు అన్యాయం చేస్తున్న సర్వేయర్లపై చర్యలు ఎప్పుడు?

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే ప్రక్రియ రైతులకు న్యాయం చేయడానికే అయినప్పటికీ, ఏర్పేడు మండలంలో మాత్రం కొందరు రెవెన్యూ అధికారులు, సర్వేయర్ల నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం ప్రతి రైతు భూమి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో రీ సర్వే నిర్వహించి హక్కులను పరిరక్షిస్తామని చెబుతుండగా, జిల్లాకలెక్టర్ కూడా ఈ మండలంపై ప్రత్యేక దృష్టి సారించినప్పటికీ స్థానిక రెవెన్యూ అధికారులు మాత్రం ఆ దిశగా పనిచేయడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎర్పేడు మండలం నాగంపల్లి గ్రామానికి చెందిన గుర్రం చిరంజీవి (తండ్రి బోడయ్య)కు చెందిన సర్వే నంబర్ 278/3+లో 41 సెంట్ల పట్టా సెటిల్‌మెంట్ భూమి ఉండగా, తమను పొలం వద్దకు పిలవకుండా, క్షేత్రస్థాయిలో రీ సర్వే నిర్వహించకుండానే 35 సెంట్లు మాత్రమే సర్వే చేసినట్లు నోటీసు జారీ చేశారని బాధితుడు ఆరోపిస్తున్నారు.భూమిని ప్రత్యక్షంగా కొలవకుండానే రికార్డుల్లో మార్పులు ఎలా జరిగాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రైతుల హక్కులను కాలరాస్తూ వ్యవహరిస్తున్న మండల సర్వేయర్, విలేజ్ సర్వేయర్లు మరియు సంబంధిత రెవెన్యూ అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ప్రభుత్వం చెప్పేది ఒకటైతే... క్షేత్రస్థాయిలో అధికారులు చేస్తున్నది మరోటిగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. నాగంపల్లి రైతుకు న్యాయం జరుగుతుందా? లేక ఇదే పరిస్థితి మరికొంతమంది రైతులకు కూడా ఎదురవుతుందా? అనే ప్రశ్నలు ఇప్పుడు మండలంలో చర్చనీయాంశంగా మారాయి.



# విద్యార్థులు, మేధావులపై దాడులు దారుణం

## భారత రాజ్యాంగ పరిరక్షణ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ధర్నా

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు, సీజేపీ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన చేస్తున్న విద్యార్థులపై దాడి అమానుషమని భారత రాజ్యాంగ పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం గూడూరు టవర్ క్లాక్ సెంటర్లో ధర్నా నిర్వహించారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి నిరసనగా ఢిల్లీలో నిరసన చేస్తున్న యువకులపై విచక్షణా రహితంగా దాడులు చేయడం బీజేపీ పాలకుల నిరంకుశ విధానాలకు నిదర్శనమన్నారు. విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సీజేపీ నిరసనలకు సంఘీభావం తెలిపారు. యువతను నిర్లక్ష్యం చేసిన, అణగ దొక్కాలని చూసిన యే ప్రభుత్వాలు మనుగడ సాధించిన దాఖలాలు లేవన్నారు. దేశ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ఈడ్చుకెళ్లిన, యువతులను సైతం దుస్తులు చినిగిపోయేలా దాడి చేసిన పోలీసుల వైఖరిని, కేంద్ర పాలకుల పైశాచిక వైఖరిని యావత్ భారత దేశం సామాజిక మాధ్యమాలలో చూశారన్నారు. విద్యార్థులకు న్యాయం చేయాలని నిరవధిక నిరాహారదీక్షకు పూనుకున్న సోనమ్ వాంగ్ చుక్ దీక్షను భగ్నం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక సభ్యులు నాసిన భాస్కర్ గౌడ్, జెడ్డా వెంకటరమణయ్య, వేగూరు విజయ్ కుమార్, ఎల్వీ. సుబ్బయ్య, సీవీఆర్. కుమార్, షేక్ జమాలుల్లా, జీ. శశి కుమార్, సునీల్, రమేష్, నారాయణ, షఫీ మౌలానా, నాయకుల ఫయాజ్, ఇబ్రహీం, వేమయ్య, అంకయ్య, హిదాయతుల్లా, ఇబ్రహీం మౌలానా, వెంకటేశ్వర్లు రాజు, గోపి, మస్తానయ్య, రిజ్వాన్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సైన్స్ సెంటర్ లో తపస్య విద్యార్థుల సత్తా... సఫలం

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట. 9-స్థానిక తిరుపతి - రీజినల్ సైన్స్ సెంటర్ నందు గత వారం రోజులుగా మినిస్ట్రీ ఆఫ్ కాల్చర్ గవర్నమెంటు ఆఫ్ ఇండియా వారి నేతృత్వంలో జూలై 17 నుండి 22 వరకు నిర్వహింపబడిన స్పేస్ వీక్ " కార్యక్రమంలో






పాల్గొన్న డా॥ బషీర్స్ తపస్య' రేణిగుంట విద్యార్థులు ఓపన్క్విజ్ వర్క్ షాప్, పోస్టర్ పెయింటింగ్ పోటీ, ఇంటర్ స్కూల్ కాంటెస్ట్, పాపులర్ సైన్స్ లెక్చర్ వంటి వివిధ పోటీలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభా పాటవ ప్రదర్శనతో తమ సత్తాను నిరూపించుకున్నారు.వారి వివరాలు యిలా ఉన్నాయి. ఓపన్ హౌస్ క్విజ్ విజేతలుగా షాజైబ్,వేదాంతో, హేనిష్క, రిషితా సత్య, సానియాభాను, సుష్మశ్రీ, పోషిత, కార్తీక్, భవ్యశ్రీ, అల్జెప్రా, హీరా, నాథన్, శ్రీనిక నిలువగా, పెయింటింగ్ నందు షాజైబ్ హీరా డాక్యుమెంటరీ విభాగంలో సుష్మశ్రీ అగ్రశ్రేణిలో నిలిచారు.

# రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టులకు నిరసనగా గూడూరులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు, రాహుల్ గాంధీ మరియు ప్రియాంక గాంధీల అరెస్టులను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సంద





ర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, రాహుల్ గాంధీని పోలీసులు అరెస్టు చేయడం, ఆయన పట్ల దురుసుగా వ్యవహరించడం దారుణమని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రతిపక్ష నాయకులపై ఇలాంటి చర్యలకు పాల్పడటం సరికాదని వారు అన్నారు. అదేవిధంగా, నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ మరియు దానికి సంబంధించిన పరిణామాల కారణంగా ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ. 1 కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో ప్రమేయం ఉన్నట్లు తేలిన ప్రభుత్వ అధికారులు మరియు ఇతర బాధ్యులపై వెంటనే సమగ్ర దర్యాప్తు జరిపి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పంట శ్రీనివాసులు రెడ్డి, తిరుపతి జిల్లా మైనారిటీ అధ్యక్షుడు షేక్ నాయకుల ఫయాజ్ ,సర్వేపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూల చంద్ర శేఖర్, గూడూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ రామకృష్ణయ్య, చిలకూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వ్యామయ్య, సైదాపురం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మురారి కృష్ణయ్య, గూడూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుబ్బారావు, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి రషీద్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి ఆలయంలో అనధికార ప్రవేశాలు భక్తుల ఆగ్రహం!

ప్రజా భూమి ప్రతినిధి శ్రీ కాళహస్తి

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో అనధికార ప్రవేశాలపై భక్తుల నుంచి పలు ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. కంచు గడప వద్ద ప్రత్యేక రిజిస్టర్ ఏర్పాటు చేసినప్పటికీ, అందరి వివరాలు నమోదు కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో అంతరాలయ దర్శనానికి సంబంధించిన పారదర్శకతపై కూడా భక్తులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. దేశంలో అత్యంత ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రాల్లో ఒకటైన శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు తరలివస్తున్నారు. భక్తుల రద్దీతో పాటు ఆలయ ఆదాయం కూడా క్రమంగా పెరుగుతోంది



# విదేశీ ఎగుమతికి ఆమోదం కలిగిన మామిడి ఉత్పత్తులు పండించండి

## - జాతీయ మామిడి దినోత్సవంలో జాయింట్ కలెక్టరు గోవింద రావ్





ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

రాష్ట్రీయ సేవా సమితి (రాస్), కృషి విజ్ఞాన కేంద్రం, తిరుపతి వారు కోకా కోలా ఇండియా ఫౌండేషన్ వారి సహకారంతోబుధవారంరాస్ కృషి విజ్ఞాన కేంద్రం, కరకంబాడి నందు "జాతీయ మామిడి దినోత్సవాన్ని" ఘనంగా నిర్వహించినట్లు కేంద్ర సీనియర్ శాస్త్రవేత్త మరియు హెడ్ డా.ఎస్.శ్రీనివాసులు తెలిపారు. తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టరు ఆర్. గోవింద రావ్ ఐ.ఏ.ఎస్ మరియు రాస్ స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి డా.ఎస్.వెంకటరత్నం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, తిరుపతి జిల్లా ఉద్యాన అధికారి జయ భరత్ రెడ్డి, నాబార్డు, జిల్లా అభివృద్ధి అధికారి చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార జిల్లా ప్రకృతి వ్యవసాయ పథకం సంచాలకులు షణ్ముగం, రాస్ కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు మరియు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుండి 250 పైగా రైతులు, రైతు మహిళలు మరియు వ్యవసాయ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా రైతులు మరియు అధికారులు కార్యక్రమంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శన సందర్శించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా జాయింట కలెక్టరు ఆర్. గోవింద రావ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధాన ఉద్యాన పంట అయిన మామిడిలో కోకా కోలా ఇండియా ఫౌండేషన్ వారి సహకారంతో ఉన్నతి మ్యాంగో పథకం ద్వారా జిల్లాలోని రైతుల ఆదాయం పెంచటానికి రాస్ మరియు కృషి విజ్ఞాన కేంద్రం వారు చేపట్టిన కార్యక్రమాల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, రైతులు విదేశీ ఎగుమతులకు ఆమోదయోగ్యమైన మామిడి ఉత్పత్తులు పండించాలని తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని రైతు సేవా కేంద్ర సిబ్బంది కృషి విజ్ఞాన కేంద్ర యొక్క సేవల గురించి రైతులకు తెలియచేయాలని అన్నారు. రాస్ స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి డా.ఎస్.వెంకటరత్నం గారు మాట్లాడుతూ "ఉన్నతి మ్యాంగో" పథకం ద్వారా చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి తెలిపి, రైతులు రసాయన అవశేష రహిత మామిడి పంట పండించటం ద్వారా అధిక మార్కెట్ ధర పొందటమే కాక సాగు ఖర్చు కూడా తగ్గించుకోవచ్చని తెలిపారు, అదేవిధంగా మామిడిలో కొమ్మ కత్తిరింపులు, పాత తోటల పునరుద్దరణ, తల మార్పిడి మొదలైన సాంకేతికతలు పాటించటం ద్వారా మంచి దిగుబడులు పొందవచ్చని తెలిపారు. చంద్రశేఖర్, డి.డి. ఎం, నాబార్డు వారు మాట్లాడుతూ మామిడి రైతుల మౌలిక సదుపాయాల అభివృద్ధికి నాబార్డు వారు అందిస్తున్న వివిధ రాయితీ పథకాలు, పంట భీమా పథకాలు గురించి తెలుపుతూ, రైతులు మామిడి విలువ జోడింపు పై దృష్టి సారించాలని అన్నారు. కృషి విజ్ఞాన కేంద్ర హెడ్, డా. ఎస్,శ్రీనివాసులు మాట్లాడుతూ జాతీయ మామిడి దినోత్సవ ప్రాముఖ్యత, మామిడిలో నాణ్యమైన, అధిక దిగుబడులు పొందటానికి ఉపయోగపడే కాయ తొడుగులు, పండు ఈగ బుట్టలు, జీవ సంబందిత పురుగు మందుల వినియోగం, ప్రస్తుత ఎల్ నీనో పరిస్థితులలో సాగులో ఉన్న పంటలలో తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తల గురించి వివరించారు. ఉద్యాన శాస్త్రవేత్త శ్రీ సుధాకర్ మాట్లాడుతూ మామిడిలో కోత అనంతరం చేపట్టవలసిన యాజమాన్యం, ఎల్ నీనో పరిస్థితులలో ఉద్యాన పంటలలో పాటించవలసిన జాగ్రత్తలు, మామిడిలో వివిధ రకాలు మొదలైన అంశాల గురించి తెలియచేసారు. కార్యక్రమంలో తరువాత ఉన్నతి మ్యాంగో పథకంలో భాగంగా మామిడిలో మంచి దిగుబడులు సాదించిన రైతులకు అతిథుల చేతులమీదుగా ప్రశంసా పత్రాలు అందచేసి, మామిడి సాగు పై కె.వి.కె వారి ప్రచురణ విడుదల చేశారు. అదేవిధంగా ప్రదర్శనా క్షేత్రాల నిమిత్తం రైతులకు వరి విత్తనం, పురుగు మందులు, జీవన ఎరువులు, షెడ్యూల్డ్ కులాల రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు పంపిణీ చేశారు.

# శ్రీ శక్తి పీఠంలో శ్రీ వారాహి నవరాత్రి ఉత్సవాలకు పోటెత్తిన భక్తులు

## శ్రీ కిరాత వాహిని దేవి ప్రత్యేక హోమం



ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం

ప్రపంచంలోని అత్యంత మహిమాన్వితమైన ఏకైక శ్రీ పాతాళ శ్వేత వారాహీ మహాక్షేత్రమైన తిరుపతి జిల్లా రామచంద్రపురం మండలం రాయల చెరువు కట్ట దగ్గర ఉన్న శ్రీ శక్తిపీఠంలో నిర్వహించబడుతున్న శ్రీ వారాహీ నవరాత్రి మహోత్సవములలో ఎనిమిదవ రోజున అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు అత్యంత వైభవంగా నిర్వహించబడినవి. ఈ సందర్భంగా ప్రయోగబాధలు మరియు దుష్ట గ్రహ పీడా నిర్మూలన సమస్యా పరిష్కారం కొరకు విశేష ఫలదాయకమైన శ్రీ కిరాత వారాహీ దేవి ప్రత్యేక మంత్ర హోమం నిర్వహించబడినది. స్త్రీమూర్తులకు సువాసిని పూజా, మధ్యాహ్నం అమ్మవారికి మహా హారతి సమర్పించబడగా, సాయంత్రం కళా నివేదన రూపంలో సంగీత, నాట్య, సాహిత్య సేవలు అమ్మవారికి అంకితం చేయబడినవి. రాత్రి వేళ పరమపూజ్య శ్రీ మాతాజీ వారి సమక్షంలో నవరాత్రి పూజ, దర్బారు సేవ జరుగగా, నడిచే దైవం జగద్గురువుల వారిచే మహా హారతి, అనంతరం అమ్మవారికి ఏకాంత సేవ నిర్వహించబడినవి. ఈ పుణ్యదినాన సుమారు 20,000 మందికి పైగా భక్తులు క్షేత్రాన్ని సందర్శించి అమ్మవారి దివ్య దర్శన భాగ్యాన్ని పొందారు. వచ్చిన భక్తులందరికీ అన్నప్రసాద వితరణ సమృద్ధిగా జరిగినది, ఇది గురు-దైవానుగ్రహానికి, పీఠం సేవాతత్పరతకు నిదర్శనంగా నిలిచింది.

# బాలబాలికలకే "శిశు వికాస్ యోజన"

## వైద్య సాయం కోసం ఏడాదికి 25 వేలు గ్రాంట్

## ఉన్నత విద్య కోసం ఐదు లక్షల స్కాలర్షిప్



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

బాల బాలికల సౌలభ్యం కోసం శిశు వికాస్ యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సి ఎస్ ఆర్ ఫండ్స్ ద్వారా ప్రతి పాఠశాలలో చదివే 16 ఏళ్ల లోపు విద్యార్థులకు ఆర్థిక సాయం అందించే బృహత్కర పదకమని రాష్ట్ర సూపర్వైజర్ పి వెంకటరమణ, జిల్లా కోఆర్డినేటర్ సుకుమార్ రాజు, రవితేజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ అధినేత టి రవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు నుంచి 16 సంవత్సరాల మధ్య వయసు గల విద్యార్థులకు ఏడాదిలో చికిత్స కోసం 25 వేల గ్రాంట్ ను, ప్రాణ నష్టం కింద మూడు లక్షల నష్టపరిహారాన్ని పొందవచ్చును అన్నారు. విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఐదు లక్షల స్కాలర్షిప్ ను, 21 సంవత్సరముల దాటిన తర్వాత స్వయం ఉపాధి కింద పది లక్షల వరకు వడ్డీ లేని రుణాన్ని పొందవచ్చును అన్నారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ రవిని, వెంకటరమణ సుకుమార్ లు ఘనంగా సన్మానించారు.

# ఆడిశంకర డీమ్డ్ టు బి యూనివర్సిటీలో "కోడ్ స్ప్రింట్-2026" పోస్టర్ ఆవిష్కరణ



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

గూడూరు లోని ఆడిశంకర డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "కోడ్ స్ప్రింట్2026" 8 గంటల జాతీయ స్థాయి హ్యాకథాన్ పోస్టర్ను నేడు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డా. ఎం. రాజయ్య మాట్లాడుతూ, కోడ్ స్ప్రింట్ -2026" జాతీయ స్థాయి హ్యాకథాన్ను అన్ని కళాశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, తమ సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించి ఆకర్షణీయమైన నగదు బహుమతులను గెలుచుకోవాలని పిలుపునిచ్చారు. ఇటువంటి హ్యాకథాన్లు విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలు, జట్టుగా పనిచేసే సామర్థ్యాన్ని పెంపొందించడంలో ఎంతో దోహదపడతాయని ఆయన తెలిపారు. విజేతలకు మొత్తం రూ.2,00,000 నగదు బహుమతులు అందజేయబడనున్నాయి. విద్యార్థులు అధిక సంఖ్యలో నమోదు చేసుకుని ఈ జాతీయ స్థాయి హ్యాకథాన్ను విజయవంతం చేయాలని యూనివర్సిటీ యాజమాన్యం పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ శ్రీ రామయ్య, డీన్ - స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, ప్రిన్సిపాల్, వివిధ విభాగాల డీన్లు, హెచ్‌వోడీలు, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు, స్టూడెంట్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# కాటంరెడ్డి జన్మదిన వేడుకల్లో టీడీపీ, బిజెపి నాయకులు





ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు

వాకాడు మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కాటంరెడ్డి రామలింగారెడ్డి జన్మదినాన్ని పార్టీ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు, కేవీసీ ప్రెసిడెంట్ వేము దినకర్, టీడీపీ యువ నాయకుడు బల్లి హర్షానంద దయాల్, బిజెపి జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ కాల వల్లి ప్రసాద్ లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాటంరెడ్డి రామలింగారెడ్డి పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తున్న నాయకుడని కొనియాడారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ సేవా కార్యక్రమాల్లో ముందుండటం అభినందనీయమని పేర్కొన్నారు. జన్మదిన సందర్భంగా ఆయనకు ఆరోగ్యం, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షిస్తూ, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# డాక్యుమెంట్, లేకర్లపోరాటానికి" రేణిగుంట (సి పి ఎం)పార్టీ మద్దతు!



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి డాక్యుమెంట్ రైటర్లకు భరోసా కల్పించాలి. కొండ్రెడ్డి హరినాథ్,(సి పి ఎం)పార్టీ ప్రాంతీయ కమిటీ కన్వీనర్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం జి.ఓ. నెం. 396ను జీవోను నిరసిస్తూ రేణిగుంట సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్ల యూనియన్ చేపట్టిన నిరసన దీక్షలకు సిపిఎం పార్టీ పూర్తి మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా కొండ్రెడ్డి హరినాథ్ మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అన్ని పనులను నిలిపివేసి నిరసన చేపడుతున్న డాక్యుమెంట్ రైటర్ల పోరాటానికి రేణిగుంట సిపిఎం పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. పూర్వీకులు నుండి వారసత్వంగా వస్తున్న వృత్తిని మరియు డాక్యుమెంట్ రైటర్ల జీవనాధారాన్ని దెబ్బతీసే విధంగా కూటమి ప్రభుత్వం నిర్ణయం ఉందని అన్నారు. రిజిస్ట్రేషన్ పనులను గ్రామ సచివాలయాలకు అప్పగించడం అనేది వేలాది కుటుంబాలను రోడ్డున పడేసే చర్య అని ఆయన విమర్శించారు. డాక్యుమెంట్ రైటర్ల పొట్టకొట్టే నిర్ణయాలను సిపిఎం పార్టీ సహించబోదని హెచ్చరించారు. డాక్యుమెంట్ రైటర్ల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని..జి.ఓ. నెం. 396ను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. తక్షణమే శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని వారికి రాష్ట్ర ముఖ్యమంత్రి నుండి స్పష్టమైన హామీ.. భరోసా కల్పించాలని రేణిగుంట సి.పి.ఎం పార్టీ ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్ బుధవారం నాడు పత్రిక ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. ఈ నిరసన దీక్షలకు మద్దతుగా రేణిగుంట సిపిఎం పార్టీ ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్, జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరమణ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కొండ్రెడ్డి ఈశ్వరమ్మ, మండల అధ్యక్షురాలు భారతి, గీత, గిరిజన సంఘం నాయకులు మునిస్వామి, సులోచన పాల్గొన్నారు.

# ఇసుక ట్రాక్టర్లకు సరైన రికార్డులు లైసెన్సులు తనిఖీ :ఎస్సై బాలకృష్ణ



ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు

మండలంలోని పెన్నలపాడు వద్ద వాహన తనిఖీలలో భాగంగా తొట్టంబేడు ఎస్సై బాలకృష్ణ ఇసుక ట్రాక్టర్లను ఆపి వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా డ్రైవర్లు డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, బండికి సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ మరియు ఇన్సూరెన్స్ సర్టిఫికెట్ లను చూపించలేకపోవడం వంటివి గమనించబడింది. అనంతరం ట్రాక్టర్ డ్రైవర్లు మరియు యజమానులతో మాట్లాడుతూ తప్పనిసరిగా డ్రైవర్లు లైసెన్స్ కలిగి ఉండాలి మరియు వాహన రికార్డులు సక్రమంగా కలిగి ఉండి అడిగినప్పుడు చూపించాలి అని సూచించారు. ఆ విధంగా చూపించలేని వాహనాలకు మోటార్ వాహనాలు చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని సూచించారు. అతివేగంగా, ప్రమాదకరంగా, గ్రామీణ వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యే విధంగా ట్రాక్టర్ నడిపే డ్రైవర్లపై కేసు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అదే విధంగా మైనర్లకు ట్రాక్టర్ అప్పగించే యజమానులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రోడ్డు భద్రత చర్యల్లో భాగంగా రాత్రిపూట రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా ట్రాక్టర్ యొక్క ట్రాలీల వెనుక భాగంలో రేడియం స్టిక్కర్లు అతికించారు. ప్రతి ఒక్క ట్రాక్టర్ కి ఇదే విధంగా రేడియం స్టిక్కర్ అతికించుకోవాలని సూచించారు. అదేవిధంగా యంత్రాలను ఉపయోగించి టిప్పర్లు లేదా ట్రాక్టర్లకు ఇసుకను లోడ్ చేసి సొంత/గృహ అవసరాలు నిమిత్తం కాకుండా వ్యాపార నిమిత్తం ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై రెవెన్యూ మరియు మైన్స్ అండ్ జియాలజీ వారితో కలిసి సమన్వయంతో ప్రత్యేక రైడ్లు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఆపదలో అండగా... బాధిత జనసైనికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ -- దండి నరేంద్ర



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

తిరుపతిలోని హీలియోస్ ఆసుపత్రిని సందర్శించి చికిత్స పొందుతున్న జనసేన కుటుంబ సభ్యులను పరామర్శించాను. ఆసుపత్రి యాజమాన్యం మరియు నిపుణులైన డా. కెన్నెట్, డా. శ్రీనివాస్ రెడ్డి, డా. మల్లికార్జున్ తో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని సమీక్షించాను. బాధితులకు అత్యుత్తమ వైద్యం, నిరంతర పర్యవేక్షణతో చికిత్స అందిస్తున్నామని వైద్య బృందం హామీ ఇచ్చింది.

1. శ్రీ చిట్టిబాబు, వాగివేడు - బస్ డ్రైవర్ (ఆక్సిడెంట్ కేసు) ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం స్థిరంగా ఉంది. ఐసీయూ నుంచి సాధారణ వార్డుకు తరలించారు. చికిత్సకు మంచి స్పందన కనిపిస్తోంది.

2. శ్రీ శివశంకర్, కోడూరు -- విద్యార్థి (పాయిజన్ కేసు)

డా. కెన్నెట్ ఆధ్వర్యంలో అత్యవసర చికిత్స ప్రారంభించారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉంది. ఐసీయూలో ప్రత్యేక పర్యవేక్షణలో ఉండగా, త్వరలోనే సాధారణ వార్డుకు తరలించే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. బాధితులకు ప్రాధాన్యతతో, నాణ్యమైన వైద్యం అందిస్తూ వారి త్వరితగతిన కోలుకునేందుకు కృషి చేస్తున్న హీలియోస్ ఆసుపత్రి యాజమాన్యం మరియు వైద్య బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ పరామర్శలో నాతోపాటు జనసేన సీనియర్ నాయకులు, శ్రీ కాళహస్తి టెంపుల్ బోర్డు మెంబెర్ దండి రాఘవయ్య, తిలక్, పవన్ కుమార్, తదితరులు పాల్గొని పేషెంట్స్ ని పరామర్శించారు.

# వీధి వ్యాపారులు పిఎం స్వయం నిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

## -మెప్మా పీడీ కిరణ్ కుమార్



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

కేంద్ర ప్రభుత్వం వీధి వ్యాపారుల ఆర్థిక అభ్యున్నతి కోసం బ్యాంకు నుండి పీఎం స్వానిధి రుణాలను అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని గూడూరులో మెప్మా ఆధ్వర్యంలో పీఎం స్వనిధి రుణాల పంపిణీ. గూడూరు మున్సిపాలిటీ పరిధిలో వీధి విక్రయదారులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం స్వనిధి పథకం ద్వారా రుణాల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నట్లు మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం. కిరణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గూడూరులోని కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ (కోనేటిమిట్ట), ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (చెన్నూరు) శాఖలను సందర్శించి బ్యాంకు అధికారులు, వీధి విక్రయదారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. పీఎం స్వనిధి పథకం కింద మొదటి విడతలో రూ.15, 000, రెండో విడతలో రూ.25,000, మూడో విడతలో రూ.50,000 వరకు రుణాలు అందిస్తున్నామని తెలిపారు. రెండో విడత రుణాన్ని సక్రమంగా చెల్లించిన లబ్ధిదారులకు రూ.30,000 వరకు క్రెడిట్ కార్డు సౌకర్యం కూడా కల్పిస్తున్నామని, గూడూరు మున్సిపాలిటీలో ఇప్పటికే 100 మందికి ఈ అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. నాలుగు బ్యాంకుల ద్వారా మొత్తం 194 మంది లబ్ధిదారులకు రూ.29.10 లక్షల రుణాలు మంజూరు చేయగా, మూడు రోజుల్లో వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో నగదు జమ కానుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంక్ లింకేజ్ రుణాలను వినియోగించి జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలని, ఎంబ్రాయిడరీ యూనిట్లు, మోమోస్ సెంటర్లు, ప్రొవిజన్ స్టోర్లు, ఫుడ్ కోర్టులు వంటి స్వయం ఉపాధి వ్యాపారాలను ఏర్పాటు చేసేందుకు పీఎంఈజీపి, పీఎం ఎఫ్ఎంఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిటీ మిషన్ మేనేజర్ కాంతయ్య, సీఓలు విష్ణు, చందన, పావని, డీఈఓ ఉష, టీఎల్ఎఫ్-1 అధ్యక్షురాలు సులోచన, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ పతాక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన స్కౌట్స్ అండ్ గైడ్స్




ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తి మున్సిపల్ హైస్కూల్ (భాస్కర్‌పేట)లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో జాతీయ పతాక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్ఞానప్ప, స్కౌట్ మాస్టర్ షేక్ అజారుద్దీన్ విద్యార్థులకు జాతీయ పతాక ప్రాముఖ్యతను వివరించారు. మన త్రివర్ణ పతాకం కేవలం ఒక జెండా మాత్రమే కాదని, అది భారతీయుల ఐక్యత, స్వేచ్ఛ, త్యాగం, గౌరవానికి ప్రతీక అని అన్నారు. జాతీయ పతాకాన్ని ఎల్లప్పుడూ గౌరవిస్తూ దేశ గౌరవాన్ని నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గైడ్ క్యాప్టెన్ నాగజ్యోతి, నాగమ్మని ఉపాధ్యాయురాలు, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమం దేశభక్తి వాతావరణంలో విజయవంతంగా జరిగింది.

# విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

తిరుపతి జిల్లా కలెక్టరేట్లో జరిగిన 5వ క్వార్టర్లీ జిల్లా విజిలెన్స్ ౘ మానిటరింగ్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మ్యాజిస్ట్రేట్ "వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో జిల్లాలోని గౌరవ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సభ్యులు, అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొనడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సభ్యులు ఏసు పాకు పెంచలయ్య , డాక్టర్ ఆరవ పార్వతయ్య గారు ఇద్దరు గతం లో ఎస్సీ ఎస్టీలకు సంబంధిం చినటువంటి భూ సమస్యలను, పోలీస్ కేసుల విషయం పై చర్చించడం జరిగింది. ప్రస్తుతం చిట్టమూరు, వాకాడు మం డలాలకు సంబంధించినటు వంటి భూ సమస్యలు, కేసులు పైన మాట్లాడడం జరిగింది. సంబంధిత సమస్యలపై కలెక్టర్ కి అర్జీలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ డివిఎంసి సభ్యులు దాసరి వెంకటేశ్వర్లు పాల్గొనడం జరిగింది.



# నీట్‌పై ప్రతిపక్షాల ఆందోళనలు రాజకీయ ప్రేరేపితమే

## - అవకతవకలకు పాల్పడిన వారిపై కేంద్రం కఠిన చర్యలు - బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్

ప్రజాభూమి, వేంపల్లె



నీట్ పరీక్ష అంశంపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆందోళనలు రాజకీయ ప్రేరేపితమైనవేనని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక పట్టణంలో గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యార్థులు తమ ప్రతిభ ఆధారంగా వైద్య విద్యలో ప్రవేశాలు పొందేందుకు నీట్ పారదర్శకమైన, ఏకీకృత విధానంగా కొనసాగుతోందని తెలిపారు. పరీక్ష నిర్వహణలో ఎక్కడైనా అవకతవకలు తేలితే కేంద్ర ప్రభుత్వం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పరీక్షా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి సూచనలు చేయాల్సిన ప్రతిపక్షాలు వారి భవిష్యత్తుపై అనవసర భయాందోళనలు సృష్టించడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల్లో గందరగోళం కలిగించే ప్రకటనలను మానుకోవాలని కోరారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా పార్లమెంట్‌లో చర్చలు అడ్డుకుంటూనే, మరోవైపు అదే అంశంపై చర్చలు జరపాలని ధర్నాలు చేయడం సిగ్గుచేటని అన్నారు. ఉద్యమం ముసుగులో దేశవ్యతిరేక శక్తులు రెచ్చిపోతున్నాయని ఆరోపించారు. విద్యార్థుల ప్రయోజనాలకే భారతీయ జనతా పార్టీ ప్రాధాన్యత ఇస్తుందని, పరీక్షల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత నాయక్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రవియాదవ్, ఎస్సీ మోర్చా సీనియర్ నాయకుడు ముద్ది శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి

## కష్టపడే కార్యకర్తలకే పదవులు: టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి

ప్రజాభూమి,పులివెందుల



స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) కార్యకర్తలకు పిలుపునిచ్చారు.బుధవారం పట్టణ టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధిష్టానం ఇచ్చిన 45 రోజుల ప్రోగ్రామ్‌ను గ్రామ స్థాయి లీడర్లు బాధ్యతగా అమలు చేయాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్ళి తల్లికి వందనం, పెంచిన పెన్షన్లు, కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలతో మాట్లాడి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని ఆదేశించారు. పార్టీ కోసం కార్యకర్తలు పడుతున్న కష్టాన్ని గుర్తించి తాను రుణపడి ఉన్నానన్నారు. పదవుల పంపకాల్లో అసంతృప్తి సహజమేనని, కష్టపడి పని చేసే వారికే ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు.పార్టీ బి ఎల్ఎలు అద్భుతంగా పని చేసి నియోజక వర్గంలో దాదాపు 30,000 తప్పుడు ఓట్లను గుర్తించారని ప్రశంసించారు. ఓట్ల నమోదు, తొలగింపుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు.రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కలెక్టర్ త్వరలో పులివెందులలో వరుసగా నాలుగు వారాల పాటు గ్రీవెన్స్ నిర్వహిస్తారని, పెండింగ్ సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం అవుతాయని హామీ ఇచ్చారు. పిలిస్తే పదవులు వాటికంతటికి అవే వస్తాయి అడుక్కుంటే ఏదీ రాదు. మన సత్తా మనం నిరూపించుకోవాలి. అక్టోబర్‌లో జరగనున్న ఎన్నికల్లో పులివెందుల మున్సిపాలిటీని గెలుచుకుంటే పదవులు, పవర్ వాటంతట అవే వస్తాయి" అని ఉద్ఘాటించారు.ఉపాధి హామీ కింద నోటిఫైడ్ పనులతో పాటు గ్రావెల్ రోడ్లు మంజూరు చేస్తున్నామని, పోలీస్ డిపార్ట్‌మెంట్ నుండి క్యాడర్‌కు ఇబ్బందులు లేకుండా చూస్తామని భరోసా ఇచ్చారు.కార్యకర్తల వల్లే ప్రభుత్వం వచ్చిందని, ఈ ఐదేళ్ల ఫలాలు అనుభవించే హక్కు అందరికీ ఉందన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్, కౌన్సిలర్ పదవులు క్యాడర్‌కు ఇప్పించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్చార్జులు, ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, క్లస్టర్ ఇన్చార్జులు, బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి ట్రీ ఆఫ్ లైఫ్ చిత్రలేఖన పోటీల్లో శ్రీ చైతన్య విద్యార్థులకు బహుమతులు

## - రెండు ప్రథమ, ఒక ద్వితీయ బహుమతి సాధించిన విద్యార్థులు

## - విజేతలకు జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, జ్ఞాపికల అందజేత

ప్రజాభూమి, వేంపల్లె



భారతీయ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక ట్రీ ఆఫ్ లైఫ్ జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో స్థానిక శ్రీ చైతన్య హైస్కూల్ విద్యార్థులు మూడు బహుమతులు సాధించారు. పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్యం, ప్రకృతి సంపద సంరక్షణ అంశాలపై నిర్వహించిన ఈ పోటీల్లో జాతీయ స్థాయిలో 500 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పదో తరగతి విద్యార్థిని కె.ఎస్. లక్ష్మి, తొమ్మిదో తరగతి విద్యార్థిని జి. నిత్య వసంతి ప్రథమ బహుమతులు సాధించగా, ఎనిమిదో తరగతి విద్యార్థి ఎ. జేశ్వంత్ ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. విజేతలకు జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఐఏఎస్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించడంలో ఇటువంటి పోటీలు కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దిన డ్రాయింగ్ ఉపాధ్యాయుడు సి. గణేష్ ను ప్రత్యేకంగా అభినందించారు.

మేనేజింగ్ డైరెక్టర్లు బి. చేతన్ రెడ్డి, బి. చైతన్య రెడ్డి విజేతలను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పాఠశాలకు, జిల్లాకు, రాష్ట్రానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు విజేతలను అభినందించారు.

# 396 జీవోను రద్దు చేసే బుద్ధి ముఖ్యమంత్రికి కల్పించాలని వినాయకుడికిప్రత్యేకపూజలు..!

## - 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేసిన దస్తావేజు లేఖరులు..

ప్రజా భూమి ప్రతినిధి,చంద్రగిరి :



రాష్ట్రప్రభుత్వం ప్రజలకు మెరుగైన సౌకర్యాలు ఆర్ఎస్కే ల ద్వారా కల్పిస్తామని చెబుతున్నప్పటికీ, ఆ సౌకర్యాలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయన్న విషయం ప్రభుత్వం తెలుసుకోవాలని, వెంటనే 396 జీవోను రద్దు చేయాలని కోరుతూ దస్తావేజు లేఖర్లు డిమాండ్ చేస్తున్నారు. జీవో నెంబర్ 396 ను రద్దు చేసే బుద్ధిని రాష్ట్ర ముఖ్యమంత్రి కి కల్పించాలని చంద్రగిరి దస్తావేజు లేఖర్లు వినూతన నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అందులో భాగంగా సంఘం అధ్యక్షులు ఎల్ గోపి ఆధ్వర్యంలో చంద్రగిరి టవర్ క్లాక్ సమీపంలోని లక్ష్మీ గణపతి ఆలయంలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించి, 101 టెంకాయలు కొట్టి పూజలు చేశారు. వినాయక స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి. బోలో గణపతి మహరాజ్ కి జై అంటూ.. 396 జీవోను రద్దు చేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా డాక్యుమెంట్ రైటర్లందరూ ఏకతాటిపైకి వచ్చి తమ నిరసన గళాన్ని వినిపిస్తున్నారు. మూడవరోజు బుధవారం చంద్రగిరి సబ్ రిజిస్టర్ కార్యాలయం ముందు డాక్యుమెంట్ రైటర్లు శాంతియుతంగా నిరసన తెలిపారు. స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రైవేటీకరణ చేయవద్దని, ఇది ప్రజల తరతరాల ఆస్తులకు సంబంధించిన సున్నితమైన విషయమని వారు స్పష్టం చేస్తున్నారు. ప్రైవేటీకరణ చేయబోమని చెబుతూనే ప్రభుత్వం జీవోల రూపంలో తమను మభ్యపెడుతోందని, ఈ నిర్ణయం వల్ల దస్తావేజు విలేఖరుల కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టెక్నాలజీ పేరుతో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో విప్లవాత్మక మార్పులు తెస్తున్నామని ప్రభుత్వం చెబుతున్న మాటలపై నిరసనకారులు మండిపడుతున్నారు. తాము కూడా సాంకేతికతను వాడుకుంటూ ప్రజలకు ఎంతో మెరుగైన సేవలు అందిస్తున్నామని, అలాంటప్పుడు కార్పొరేట్ శక్తులకు ఈ వ్యవస్థను అప్పగించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నిస్తున్నారు. సామాన్యుల పొట్టకొట్టి కార్పొరేట్ సంస్థలకు మేలు చేయడం ఎంతవరకు న్యాయమో ముఖ్యమంత్రి ఆలోచించాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎవరికీ అన్యాయం జరగనివ్వనని హామీ ఇచ్చిన పవన్ కళ్యాణ్ , ఇప్పుడు తమ సమస్యపై కనీసం స్పందించకపోవడం దారుణమని దస్తావేజు లేఖల ప్రతినిధులు విమర్శిస్తున్నారు. తాము కూడా ఈ రాష్ట్రంలో ప్రజలమేనని, తమ కుటుంబ సభ్యులందరు ఓటర్లనేనని కనీస ఉద్దేశం లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టుదలకు పోకుండా తక్షణమే 396 జీవోను రద్దు చేసి, తమ జీవితాలకు భరోసా కల్పించాలని చంద్రగిరి దస్తావేజు లేఖల సంక్షేమ సంఘం ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

# కట్టమంచి ప్రాంతంలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించిన చిత్తూరు 1 టౌన్ పోలీసులు

ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు





జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఐపీఎస్ ఆదేశాల మేరకు "సురక్షిత చిత్తూరు -- మీ భద్రత మా బాధ్యత" కార్యక్రమంలో భాగంగా చిత్తూరు 1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కట్టమంచి ప్రాంతంలో చిత్తూరు 1 టౌన్ సీఐ చిన్న పెద్దయ్య ఆధ్వర్యంలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి ప్రజలకు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ చిన్న పెద్దయ్య మాట్లాడుతూ, ప్రజల భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. నేరాల నివారణలో పోలీసులతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమని పేర్కొన్నారు. తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు, గుర్తు తెలియని వస్తువులు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-112కు సమాచారం అందించాలని సూచించారు.మహిళలు, చిన్నారుల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాల బారిన పడకుండా అపరిచితుల ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని ప్రజలకు సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీటుబెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మొబైల్ ఫోన్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని సూచించారు. ప్రజల సహకారంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టడంతో పాటు, పోలీసు-ప్రజల మధ్య సాన్నిహిత్యాన్ని మరింత బలోపేతం చేసి "సురక్షిత చిత్తూరు -- మీ భద్రత మా బాధ్యత" లక్ష్యాన్ని విజయవంతంగా అమలు చేయగలమని తెలిపారు. ఈ ఫుట్ పెట్రోలింగ్‌లో చిత్తూరు 1 టౌన్ ఎస్ఐ మారెప్ప, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# త్వరలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ కిచెన్లు: కలెక్టర్

ప్రజాభూమి,పులివెందుల

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ కిచెన్ వ్యవస్థను దశలవారీగా విస్తరిస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.బుధవారం పులివెందుల బాలురు, బాలికల జెడ్పి ఉన్నత పాఠశాలల్లోని స్మార్ట్ కిచెన్లను ఆయన పరిశీలించారు. మధ్యాహ్న భోజన నాణ్యత, పరిశుభ్రత, రవాణాను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.గత ఏడాది కడపలో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన స్మార్ట్ కిచెన్లు విజయవంతం కావడంతో ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా విస్తరిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం 20 స్మార్ట్ కిచెన్లు పనిచేస్తుండగా, వచ్చే వారంలో మరో 13 అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రస్తుతం 32 వేల మంది విద్యార్థులకు భోజనం అందిస్తున్నామని, త్వరలో లక్ష మంది విద్యార్థులకు విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ పథకాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు.పులివెందులలో స్మార్ట్ కిచెన్ ప్రారంభమై 10 రోజులు కావడంతో రోజుకు 4 వేల మందికి వేడి, రుచికరమైన భోజనం అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యతను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో చిన్నయ్య, మున్సిపల్ కమిషనర్ తనూజ, డీఈవో శంశుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



# పంటల బీమా చెల్లింపునకు 24 వరకు గడువు

## - వ్యవసాయ అధికారి బాల గంగాధర్ రెడ్డి

ప్రజాభూమి, వేంపల్లె



వాతావరణ ఆధారిత పంటలైన పత్తి, చీని, అరటి, వేరుశెనగ తదితర పంటలకు సంబంధించి ఖరీఫ్ సీజన్ కు బీమా ప్రీమియం చెల్లింపునకు ఈనెల 24 వరకు గడువు ఉందని, రైతులు బీమా ప్రీమియం చెల్లించి తమ పంటలను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బాల గంగాధర్ రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని అలవలపాడు, ముతుకూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫసల్ బీమా యోజన పథకం కింద 12 రకాల పంటలకు బీమా వర్తిస్తుందన్నారు. ఖరీఫ్ సీజన్ లో పిఎం ఫసల్ బీమా కింద ఎంపికైన పంటల్లో బీమా ప్రీమియం చెల్లింపునకు వరికి ఆగష్టు 15 వరకు గడువు ఉందన్నారు. రబీ సీజన్ లో వరికి డిసెంబర్ 31 వరకు గడువు ఉందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా రైతులు ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరి నగదు బిల్లు తీసుకోవాలన్నారు. ఖరీఫ్ లో సాగుచేసిన అన్ని పంటలకు ఈ -పంట నమోదు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకాలు

## -ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చిన మణికంఠుడు

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల పార్నపల్లి రోడ్డు కోతి సమాధి సమీపంలో కొలువై ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామికి విశేష పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయాస్తమ ఆలయ వ్యవస్థాపకులు గురు స్వామి వెంకట రామిరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకం, సహస్రనా మార్చన, బిల్వ అర్చన,అష్టోత్ర శతనామా వళి,తదితర పూజ కైకర్యాల అనంతరం అయ్యప్ప స్వామి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గురుస్వామి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో కార్తీక మాసం, 365 రోజులలో ప్రతి నిత్యము బుధవార రోజులలో స్వామివారికి విశేష పూజలు ధూప దీప నైవేద్యాలు భక్తుల సహాయ సహకారాలతో భక్తిశ్రద్ధలతో నిర్వహించడంగ జరుగుతోందన్నారు.ప్రతి మాసంలో అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రంలో విశేష పూజలు కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. సాయంకాల సమయాన భజన కార్యక్రమాలు భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను అయ్యప్ప స్వాములకు భక్తులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారి విస్తరణ పనులు త్వరగా ప్రారంభించాలి

## - రహదారి విస్తరణ పనులను పరిశీలించిన

## - కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డా. నర్రెడ్డి తులసి రెడ్డి

ప్రజాభూమి, వేంపల్లె



వేంపల్లి--చాగలమర్రి జాతీయ రహదారి (ఎన్‌హెచ్-440) విస్తరణ పనులను త్వరగా ప్రారంభించాలని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి కోరారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, జాతీయ రహదారుల అధికారులతో కలిసి రహదారి విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ 78.95 కిలోమీటర్ల మేర రూ.1,321.02 కోట్లతో రహదారి విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తై కాంట్రాక్టర్ ఎంపికైనప్పటికీ, భూసేకరణ పూర్తి కాకపోవడంతో మూడేళ్లుగా పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. 28 గ్రామాల పరిధిలో 433 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా, ఇప్పటివరకు సుమారు 320 ఎకరాలు మాత్రమే సేకరించారని చెప్పారు. మిగిలిన భూసేకరణను త్వరగా పూర్తి చేసి, రహదారి విస్తరణ పనులు ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారుల అసిస్టెంట్ ఇంజనీర్ సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, పులివెందుల నియోజకవర్గ సమన్వయకర్త ధ్రువకుమార్ రెడ్డి, మండల అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, రమణ, నాగరాజు, బద్రి, రాఘవయ్య, వేమయ్య తదితరులు పాల్గొన్నారు.

# వి.ఆర్.ఓ టి. భాస్కర్‌కు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి

ప్రజా భూమి ప్రతినిధి
తిరుపతి రూరల్



తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండలం అలత్తూరు లో విధులు నిర్వహిస్తున్న గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్వో) టి. భాస్కర్‌కు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి లభించింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పదోన్నతుల ప్రక్రియలో భాగంగా ఆయనకు ఈ పదోన్నతి కల్పించారు. ఈ శుభ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ను మర్యాద పూర్వకంగా కలసి, పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదములు తెలిపారు. సుదీర్ఘకాలంగా రెవెన్యూ శాఖలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్న టి. భాస్కర్‌కు పదోన్నతి రావడంతో సహచర ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ఉద్యోగులు ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, నూతన బాధ్యతల్లో కూడా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

## బ్లాక్ స్పాట్లను గ్రీన్ స్పాట్లుగా మార్చడంలో

# కృష్ణా జిల్లాకు రాష్ట్రస్థాయి గుర్తింపు



### మచిలీపట్నం, ఉయ్యూరు పురపాలక సంఘాలకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అవార్డులు

### ప్రతి శానిటేషన్ సిబ్బందికి అభినందనలు తెలిపిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి

2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పది సూత్రాల్లో స్వచ్ఛాంధ్ర ఒక కీలక అంశమని, ఆ లక్ష్య సాధనలో భాగంగా చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని కృష్ణా జిల్లాలో విజయవంతంగా అమలు చేశామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి తెలిపారు.బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మే 23 నుంచి జూన్ 26 వరకు నిర్వహించిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని ఐదు పురపాలక సంఘాల పరిధిలో సమర్థవంతంగా అమలు చేశామని చెప్పారు.ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ప్రత్యేక దృష్టిని 'బ్లాక్ స్పాట్స్ టు గ్రీన్ స్పాట్స్' అనే భావనపై కేంద్రీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. తరచూ చెత్త పేరుకుపోయే ప్రదేశాలను ముందుగా గుర్తించి, వాటి జాబితాను రూపొందించామని చెప్పారు. అనంతరం ఆ ప్రాంతాల్లో చెత్త పేరుకుపోవడానికి గల కారణాలను విశ్లేషించి, డోర్ టు డోర్ చెత్త సేకరణలో ఉన్న లోపాలను సరిదిద్దడంతో పాటు ప్రజల్లో అవగాహన పెంపొందించే చర్యలు చేపట్టామని వివరించారు.చెత్త తొలగించిన ప్రదేశాలను తిరిగి చెత్త వేయకుండా ఉండేలా అందంగా తీర్చిదిద్దామని తెలిపా రు. మొక్కలు నాటడం, గోడలపై ఆకర్షణీయమైన చిత్రాలు వేయడం, బెంచీలు ఏర్పాటు చేయ డం, పరిశుభ్రత సందేశాలతో అలంకరించడం వంటి చర్యల ద్వారా ఆ ప్రాంతాలను ప్రజలకు ఆహ్లాదకరమైన గ్రీన్ స్పాట్లుగా మార్చామని చెప్పారు. ఒక ప్రాంతం అందంగా మారితే అక్కడ చెత్త వేయడానికి ప్రజలు సహజంగానే వెనుకాడే విధంగా మానసిక మార్పు తీసుకురావడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లాలోని ఐదు పురపాలక సంఘాల పరిధిలో మొత్తం 141 బ్లాక్ స్పాట్లను పూర్తిగా అభివృద్ధి చేసి గ్రీన్ స్పాట్లుగా మార్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని, తాను క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు స్థానికులు స్వయంగా వచ్చి అభినందించడం ఎంతో సంతృప్తినిచ్చిందని చెప్పారు.కృష్ణా జిల్లాలో చేపట్టిన వినూత్న కార్యక్రమాన్ని గుర్తించిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన తొమ్మిది పురపాలక సంఘాల్లో మచిలీపట్నం, ఉయ్యూరు పురపాలక సంఘాలకు అవార్డులు ప్రదానం చేయడం జిల్లాకు గర్వకారణమని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ విజయానికి కృషి చేసిన ప్రతి పారిశుద్ధ్య కార్మికుడు, శానిటేషన్ సెక్రటరీ, మున్సిపల్ సిబ్బంది, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజి హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పరిశుభ్రత, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలను ఇదే స్ఫూర్తితో మరింత విస్తృతంగా కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు.



## ఒకే కుటుంబంలో ఐదుగురు పిల్లలకు రూ.75,000

### ప్రతి బిడ్డ చదువుకు కూటమి ప్రభుత్వ భరోసా

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

తల్లికి వందనం పథకం ద్వారా మచిలీపట్నం 27వ డివిజన్‌కు చెందిన షబానా బేగం ఐదుగురు పిల్లల విద్యాభ్యాసానికి మొత్తం రూ.75,000 ఆర్థిక సాయం వారి ఖాతాల్లో జమ కావడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయ ప్రాంగణంలో ఈ విషయాన్ని ఆయన వెల్లడించారు.ఈ సందర్భంగా షబానా బేగం పార్టీ కార్యాలయంలో మంత్రి కొల్లు రవీంద్రను కలిసి తన కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో తమ కుటుంబంలో ఒక్క బిడ్డకే ఈ పథకం వర్తించిందని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదుగురు పిల్లలందరికీ ఈ ప్రయోజనం అందడం ఎంతో ఆనందంగా ఉందని ఆమె పేర్కొన్నారు.ఒక తల్లి ముఖంలో కనిపించిన ఈ ఆనందం... ప్రజల కోసం మరింత బాధ్యతతో పనిచేయాలనే స్ఫూర్తిని ఇస్తోందని కొల్లు రవీంద్ర అన్నారు. కూటమి ప్రభుత్వంపై పేద ప్రజలకు ఉన్న విశ్వాసానికి, ప్రతి కుటుంబానికి అండగా నిలవాలనే ప్రభుత్వ సంకల్పానికి షబానా బేగం మాటలే నిదర్శనమని పార్టీ నాయకులు కొనియాడారు.

## విజయవాడ పోలీసు కమిషనర్ వెంటనే రాజీనామా చేయాలి

### ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు వ్యవస్థ బీజేపీకి తొత్తుగా మారింది

### AP ఓబీసీ కాంగ్రెస్ చైర్మన్ శొంఠి నాగరాజు తీవ్ర ధ్వజం



పెడన ప్రజాభూమి ప్రతినిధి

రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన పోలీసు వ్యవస్థ అధికార పక్షానికి రక్షణ కవచంగా మారిందని ఆంధ్రప్రదేశ్ ఓబీసీ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ శొంఠి నాగరాజు తీవ్రంగా విమర్శించారు. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (APCC) రాష్ట్ర కార్యాలయంపై జరిగిన దాడికి నైతిక బాధ్యత వహిస్తూ విజయవాడ పోలీసు కమిషనర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

**ప్రజాస్వామ్యంపై దాడి – ఆందోళనకరం!** శొంఠి నాగరాజు విలేకరులతో మాట్లాడుతూ పలు కీలక అంశాలను లేవనెత్తారు.

**రాహుల్ గాంధీ అరెస్ట్ ప్రజాస్వామ్యానికి అవమానం:** దేశంలో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని శాంతియుతంగా పోరాడుతున్న విద్యార్థులు, మహిళలు, యువతపై దాడులు జరగడం దిగ్భ్రాంతికరమన్నారు. ఈ దాడులపై జవాబుదారీతనం కోరిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని పోలీసులు అడ్డుకుని బలవంతంగా తరలించడం దారుణమని మండిపడ్డారు.

**కాంగ్రెస్ ఆఫీస్‌పై ముట్టడి తెలిసినా నిర్లక్ష్యం:** విజయవాడలోని కాంగ్రెస్ ఆఫీస్‌ను ముట్టడిస్తామని బీజేపీ నాయకులు బహిరంగంగా ప్రకటించినప్పటికీ, పోలీసు కమిషనరేట్ తగిన భద్రతా చర్యలు తీసుకోకపోవడం వెనుక పెద్ద కుట్ర ఉందన్నారు.

**పోలీస్ యంత్రాంగాన్ని నిలదీసిన ముఖ్య ప్రశ్నలు:**ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ దాడికోరులు కాంగ్రెస్ కార్యాలయం వరకు ఎలా రాగలిగారు?ఎవరి ఆదేశాలతో పోలీసుల భద్రతా ఏర్పాట్లు విఫలమయ్యాయి?దాడి జరుగుతుంటే కాంగ్రెస్ కార్యకర్తలను రక్షించకుండా పోలీసులు ఎందుకు చూస్తూ ఉండిపోయారు?సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలను చూస్తే పోలీసుల నిష్పాక్షికతపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, కాంగ్రెస్ ఆఫీస్‌పై దాడి ప్రజాస్వామ్య విలువలపై జరిగిన దాడిగానే భావిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.**ఎన్‌హెచ్‌ఆర్‌సీ (NHRC), డీజీపీకి ఫిర్యాదు చేస్తాం – తీవ్ర హెచ్చరిక ...**రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా కాంగ్రెస్ ఆఫీస్‌పై దాడికి పాల్పడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శొంఠి నాగరాజు డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం స్పందించకపోతే:పిసిసి అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల రెడ్డి నాయకత్వంలో దాడికి సంబంధించిన వీడియోలు, ఫోటోలు సేకరిస్తాం.రాష్ట్ర డీజీపీతో పాటు జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు (NHRC) ఆధారాలతో అధికారికంగా ఫిర్యాదు చేస్తాం.న్యాయపోరాటంతో పాటు చట్టపరమైన అన్ని మార్గాల్లో నిరసనను ఉధృతం చేస్తాం.పోలీసు వ్యవస్థ అధికార పార్టీకి రక్షణ కవచంగా కాకుండా... రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి కాపలాదారుగా వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైంది శొంఠి నాగరాజు ధ్వజమెత్తారు.

## విజయవాడలో 133 స్టార్టప్‌లకు కేంద్ర ప్రోత్సాహం

### ఎంపీ వల్లభనేని బాలశౌరి



మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.కేంద్ర ప్రభుత్వం 'నెక్స్ట్ జనరేషన్ ఇంక్యుబేషన్ స్కీమ్' (NGIS) ద్వారా దేశవ్యాప్తంగా టెక్నాలజీ ఆధారిత స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ పథకం కింద దేశంలోని 12 టియర్-2, టియర్-3 సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (STPI) కేంద్రాల ద్వారా మొత్తం 686 స్టార్టప్‌లకు సహాయం అందించినట్లు వెల్లడించారు. మెంటరింగ్, స్టైపెండ్, సీడ్ ఫండింగ్, నెట్‌వర్కింగ్, ఇంక్యుబేషన్ మౌలిక వసతులు కల్పించిన ఈ పథకం సెప్టెంబర్ 2025తో ముగిసిందని స్పష్టం చేశారు.విజయవాడ కేంద్రం ద్వారా లభించిన లబ్ధి: మొత్తం స్టార్టప్‌లు: విజయవాడ STPI కేంద్రం ద్వారా 133 స్టార్టప్‌లు లబ్ధి పొందాయి.ప్రోత్సహించిన రంగాలు: వ్యవసాయ సాంకేతికత (AgriTech), ఆరోగ్య సాంకేతికత (HealthTech & MedTech), విద్యా సాంకేతికత (EduTech), ఫిన్‌టెక్, క్లీన్‌టెక్, డీప్‌టెక్, సైబర్ సెక్యూరిటీ, రోబోటిక్స్, ఈ-మొబిలిటీ.అందించిన సహాయం: సాంకేతిక మెంటరింగ్, నెట్‌వర్కింగ్, సీడ్ ఫండింగ్, స్టైపెండ్ మరియు ఇంక్యుబేషన్ మౌలిక వసతులు."ఆంధ్రప్రదేశ్‌లో, ముఖ్యంగా విజయవాడ ప్రాంతంలో లభించిన ఈ సాంకేతిక, పారిశ్రామిక ప్రోత్సాహం యువ పారిశ్రామికవేత్తలకు ఎంతో ఉపయోగకరం. భవిష్యత్తులో రాష్ట్రంలోని ఇతర టియర్-2 నగరాలకు కూడా ఇలాంటి పథకాలను విస్తరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరానని ఎంపీ వల్లభనేని బాలశౌరి తెలిపారు.

## కోమన్నూతల అరటికి ప్రపంచ గుర్తింపు తీసుకురావాలి


### కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



ప్రజాభూమి,లింగాల

కోమన్నూతల అరటి సాగును ప్రపంచ స్థాయిలో ఆదర్శంగా నిలిపేందుకు రైతులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు.బుధవా రం పులివెందుల నియోజకవర్గ పర్య టనలో భాగంగా లింగాల మండలం కోమన్నూతల గ్రామంలోని అరటి తోటలను ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి సాగు, మార్కెటింగ్, ఎగుమతి అవకాశాలపై చర్చించారు.లింగాల మండలంలో 1,800 మంది రైతులు 3,600 ఎకరాల్లో అరటి సాగు చేస్తున్నారని తెలిపారు. దేశీయంతో పాటు విదేశీ మార్కెట్లలో కూడా కోమన్నూతల అరటికి మంచి ఆదరణ ఉందన్నారు.రైతులు శాస్త్రీయ యాజ మాన్యం, నూతన సాగు విధానాలు, సూక్ష్మ నీటి పారుదల పద్ధతు లు అలవర్చుకోవాలని సూచించారు. వ్యక్తిగతంగా కాకుండా ఎఫ్‌పీఓల ద్వారా సంఘటితంగా పనిచే స్తే గిట్టుబాటు ధరలు లభిస్తాయని చెప్పారు. మహారాష్ట్ర నాసిక్ సహ్యాద్రి ఎఫ్‌పీఓ తరహాలో కోమ న్నూతల రైతులు కూడా బలమైన సంఘాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.విలువ ఆధారిత ఉత్పత్తులు, శీతల గిడ్డంగులు, నాణ్యమైన ప్యాకేజింగ్‌తో అరటికి ప్రపంచ మార్కెట్లో గుర్తింపు తీసుకురావాలని ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి హరిప్రసాద్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.





## విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడితే సహించం

### -రాహుల్ గాంధీపై పోలీసుల తీరును ఖండిస్తూ ర్యాలీ, ధర్నా

### -ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

### -ప్రధాని మోదీ బాధ్యత వహించాలి : కాంగ్రెస్ నేతలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేస్తూ హిందూపురంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ తదితరులు ఢిల్లీలో చేపట్టిన శాంతియుత నిరసన సందర్భంగా పోలీసుల వ్యవహరించిన తీరును కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. హిందూపురం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్యామ్ కిరణ్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద కాంగ్రెస్ నాయకులు, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు, విద్యార్థులు, కార్యకర్తలు బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేసి ప్రధాని మోదీ డౌన్ డౌన్, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి, విద్యార్థులకు న్యాయం చేయాలి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి, కాంగ్రెస్ పార్టీ జిందాబాద్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే నీట్ పరీక్షలో పేపర్ లీకేజీ జరగడం కేంద్ర ప్రభుత్వ ఘోర వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. పరీక్షల నిర్వహణలో జరిగిన నిర్లక్ష్యానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే ప్రభుత్వాన్ని ప్రజలు ఎప్పటికీ క్షమించరని హెచ్చరించారు. నీట్ లీకేజీ వ్యవహారంపై ప్రశ్నించిన ప్రతిపక్ష నాయకులను అణచివేయాలనే ఉద్దేశంతో ఢిల్లీలో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ తదితర కాంగ్రెస్ నాయకులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించడం, లాఠీచార్జి చేయడం, అరెస్టులకు పాల్పడడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మండిపడ్డారు. శాంతి యుతంగా నిరసన తెలిపే హక్కును కూడా కేంద్ర ప్రభుత్వం హరించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. 2014 నుంచి అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేసి కార్పొరేట్ సంస్థలకు మాత్రమే పెద్దపీట వేస్తోందని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు.

యువతకు ఉపాధి, నాణ్యమైన విద్య, పారదర్శక పరీక్షా వ్యవస్థ కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయం చేయడం మానుకుని వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ సర్కిల్ వద్ద బైఠాయించిన అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు భారీ ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన లోపాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు జమీల్, సీనియర్ నాయకులు అమనుల్లా, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు భరత్, శ్రావణి, అడ్వకేట్ ఆసిఫుల్లా సుహేబ్, కలీం, షాహిద్, సదర్, హనుమంతరాయుడు, షఫీ, రోజ్, సమీవుల్లా, ఫయాజ్, తౌషిప్, తిరుమల, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



## చదువు ఆగకుండా 'మైత్రి ఫౌండేషన్' చేయూత

### పేద విద్యార్థినికి రూ. 10,000 విద్యా సహాయం అందజేత

మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి

ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువు ఆగిపోయే పరిస్థితిలో ఉన్న మచిలీపట్నం ఆదర్శనగర్‌కు చెందిన పల్లె మేరీ అంజలికి మైత్రి ఫౌండేషన్ అండగా నిలిచింది.పద్మావతి మహిళా హిందూ కళాశాలలో బి.కాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న మేరీ అంజలి, రూ. 13,000 కళాశాల ఫీజు బకాయి ఉండటంతో పరీక్షలు రాసే అవకాశం కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. తండ్రి తాపీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండగా, మానసిక వికలాంగుడైన తమ్ముడి వైద్య ఖర్చుల వల్ల కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. విద్యార్థిని పరిస్థితిని పరిశీలించిన మైత్రి ఫౌండేషన్ సభ్యులు, ఆమె చదువు కొనసాగించేందుకు రూ. 10,000 విద్యా సహాయాన్ని చెక్కు రూపంలో అందించారు.మచిలీపట్నం బెల్ యూనియన్ ఆఫీస్ (వేడుక ఫంక్షన్ హాల్ పక్కన) నిర్వహించిన కార్యక్రమంలో మచిలీపట్నం ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నున్న రాజు విద్యార్థినికి ఈ చెక్కును అందజేశారు."విద్యే జీవితాన్ని మార్చే గొప్ప ఆయుధం. ఎన్ని కష్టాలు ఎదురైనా చదువును మధ్యలో ఆపకుండా, లక్ష్యసాధన కోసం కృషి చేయాలి. మైత్రి ఫౌండేషన్ చేపడుతున్న విద్యా సేవలు ఎంతో అభినందనీయంఅని నున్న రాజు,ట్రాఫిక్ సీఐఅన్నారు. మైత్రి ఫౌండేషన్ అధ్యక్షుడు వేణు కుమార్ కేసాని మాట్లాడుతూ... "పేదరికం కారణంగా ఏ విద్యార్థి చదువు ఆగిపోకూడదనేదే మా ప్రధాన లక్ష్యం. అవసరమైన విద్యార్థులకు చేయూత అందిస్తూ వారి భవిష్యత్తుకు బాట లు వేయడం మైత్రి ఫౌండేషన్ బాధ్యతగా భావిస్తోంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైత్రి ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు వరప్రసాద్, ఉపాధ్యక్షుడు రిలాక్స్ ప్రసాద్, కార్యదర్శి రాధాకృష్ణ, బ్లడ్ కమిటీ చైర్మన్ రమాదేవి, గౌరవ సభ్యులు రామకృష్ణ మాస్టార్, పిచ్చుక నిరంజన్ రావు పాల్గొన్నారు.


Printed by Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at and published at DOOR NO. 19-4-378, S T V NAGAR, NEAR OLD TVS SHOW ROOM, OPPOSITE TIRUPATHI (URBAN) editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .PRGINo. "APTEL/25/A2316,Phone No. Cell : 9502116677

## శిధిలావస్థకు చేరిన మలకపల్లి ఎంపీపీ పాఠశాల

### విద్యార్థులను ఇతర పాఠశాలకు తరలింపు



ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

తాళ్లపూడి మండలం మలకపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం పైకప్పు పెచ్చులు ఊడి శిధిలావస్థకు చేరడంతో విద్యార్థుల భద్రత దృష్ట్యా వారిని సమీపంలోని మరో పాఠశాలకు తరలించినట్లు మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) బాలామణి తెలిపారు. మండలంలో దెబ్బతిన్న పాఠశాల భవనాల మరమ్మతులు, అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, ప్రస్తుతం సుమారు ఏడు పాఠశాలల్లో పనులు చేపట్టినట్లు ఆమె వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరంలో తాళ్లపూడి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా 328 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందినట్లు ఎంఈఓ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో విశ్వాసం పెరుగుతుండటంతో విద్యార్థుల చేరికలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు ప్రతిరోజూ నిర్ణయించిన మెను ప్రకారం రుచికరమైన, పోషకాహారాన్ని అందిస్తున్నామని తెలిపారు. అలాగే 'తల్లికి వందనం' పథకం కింద అర్హులైన తల్లుల బ్యాంకు ఖాతాల్లో ఈ నెల 24వ తేదీన నగదు జమ అవుతుందని ఎంఈఓ బాలామణి వెల్లడించారు.

## గంజాయి సరఫరా చేస్తున్న ఏడుగురు అరెస్టు



ప్రజాభూమి ప్రతినిధి-రాజోలు

సఖినేటిపల్లి మండలం గొంది గ్రామానికి చెందిన కొప్పనాతి దుర్గాప్రసాద్ (రింటు) గంజాయి గుర్తు తెలియని వ్యక్తులు వద్దనుండి నర్సీపట్నంలో కొనుగోలు చేసి దాన్ని మొత్తం ఒకేసారి హైదరాబాదు కు తరలిస్తే పోలీసులు పట్టుకునే ప్రమాదం ఉందని చిన్నచిన్న పొట్లాలుగా చేసి హైదరాబాదు తీసుకుని వెళ్లాం అనే ఉదేశ్యంతో అతని స్నేహితులైన రాయుడు యశ్వంత్, కొల్లాటి ధర్మరాజు, చెల్లుబోయిన భగవాన్, కడలి ప్రదీప్ కుమార్, సుత్తి ఆనంద్ కుమార్, కడలి హర్షవర్ధన్ ల సహాయంతో చిన్న చిన్న పొట్లాలుగా మార్చి హైదరాబాదు తీసుకెళ్లడానికి ప్లాన్ చేసుకుని ఈ యొక్క పథకంలో భాగంగా అంతర్వేది దేవస్థానం గ్రామం బీచ్ వద్దకు వచ్చి పొట్లాలు తీసుకుని వెళ్ళుచుండగా వారిని పోలీసులు అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుండి 4.69 కిలోల గంజాయిని స్వాధీన పరుచుకున్నారు. పోలీసు వారు వీరిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

# పేదరికం అడ్డు కాదని ప్రతిభ చాటిన ఇంటర్ విద్యార్థిని

ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం

మండలంలోని జగ్గవరం గ్రామానికి చెందిన జక్కుల సౌమ్య ఇంటర్మీడియట్‌లో 1000 మార్కులకు 960 మార్కులు సాధించి నాలుగు మండలాల్లో టాపర్‌గా నిలిచింది. ఈ ప్రతిభకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతిష్ఠాత్మక షైనింగ్ స్టార్ అవార్డు'ను మంగళవారం రంపచోడవరంలో జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ చేతుల మీదుగా అందుకుంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ఈ అవార్డు ప్రదానం చేయగా, సౌమ్యకు రూ.20 వేల నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. అనంతరం జిల్లాలో అవార్డు అందుకున్న 17 మంది విద్యార్థులతో కలిసి కలెక్టర్, రంపచోడవరం ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవి భోజనం చేసి వారిని అభినందించారు.





పేదరికాన్ని జయించిన ప్రతిభ

నిరుపేద కుటుంబానికి చెందిన జక్కుల సౌమ్య చిన్నప్పటి నుంచే ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాభ్యాసం చేసింది. అనంతరం కూనవరం మండలంలోని టేకులబోరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఈ ఘన విజయం సాధించింది. సౌమ్య తండ్రి రాజా, తల్లి మధుమాలిని (ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయిని). తన తల్లి ప్రోత్సాహమే ఈ విజయానికి ప్రధాన కారణమని సౌమ్య తెలిపింది. భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం, ఆయనతో కలిసి భోజనం చేయడం జీవితంలో మరచిపోలేని అనుభూతిగా నిలిచిందని సౌమ్య ఆనందం వ్యక్తం చేసింది.

### కాజులూరు మండలంలో

# త్రాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకోండి

- కాకినాడ జిల్లా కలెక్టర్ హరేందధీర ప్రసాద్ అధికారుకు ఆదేశాలు.
- కలెక్టర్ సుడిగాలి పర్యటనలో పలు కీలక శాఖలు కార్యాలయాలు అఖస్మిక తనికీ .
- సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు పరిశీలన.
- చేదువాడలో అంగన్వాడి చిన్నారులతో ముచ్చట్లు.
- కాజులూరులో విద్యార్థులతో సంభాషణ పలు సూచనలు.
- ఉపాధ్యాయులకు కఠినమైన ఆదేశాలు.

ప్రజాభూమి ప్రతినిధి-కాజులూరు

బుధవారం కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధీర ప్రసాద్ కాజులూరు మండలంలో విస్తృతంగా పర్యటించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి కార్య క్రమాల అమలు తీరును పరిశీలించడంతో పాటు పలు కీలక శాఖల కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ తన పర్యటన లో భాగంగా తొలుత గొల్లపాలెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి ద్వారా అందిస్తున్న వైద్య సేవల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఓపీ రిజిస్ట్రేషన్,మందుల నాణ్యత,పంపిణీ తీరును పరిశీలించడంతో పాటు వివిధ వార్డులను తనిఖీ చేశారు. వైద్యం కోసం వచ్చిన రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం సీపీడబ్ల్యూఎస్ పథకంలో భాగంగా గొల్ల పాలెంలోగల సమ్మర్ స్టోరేజ్ చెరువును పరిశీలించారు. మండలంలో అన్ని గ్రామాలకు ఈ చెరువు ద్వారా అందుతున్న తాగునీటి సరఫరా,ఫిల్టరేషన్ ప్రక్రియను పరిశీలించి అధికారులతో చర్చించారు. మండలంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని, అలాగే నీరు లేకుండా ఉన్న సంబరం స్టోరేజ్ చెరువును పరిశీలించిన కలెక్టర్ చేపలు పట్టుకున్న వెంటనే ఆలస్యం చేయకుండా చెరువుని నింపి ప్రజలకు తాగునీరు సమస్య లేకుండా చేయాలని సంబంధిత అధికారులను ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు.



**గొల్లపాలెంలో మరో అదనపు చెరువు మంజూరు.**

ఇక్కడ సిపిడబ్ల్యుఎస్ స్కీమ్ ద్వారా సుమారు 16 ఎకరాల చెరువు ద్వారా నీరు సరఫరా జరుగుతుండగా పూర్తిస్థాయిలో త్రాగునీరు ఆయా గ్రామాల అందకపోవడంతో మరో ఎనిమిది ఎకరాలు అదనంగా చెరువును మంజూరు చేయాలని గతంలో ప్రపోజ్ పంపించడంతో కలెక్టర్ పర్యటనలో భాగంగా ఎంపీడీవో జె. రాంబాబు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పూర్తి సమాచారాన్ని ఆయనకు వివరించారు. దీంతో త్రాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకున్న కలెక్టర్ స్పందించి త్వరలో ఆచెరువు మంజూరు చేయనున్నట్లు కలెక్టర్ ఈసందర్భంగా హామి ఇచ్చినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

**కలెక్టర్ దృష్టికి కార్మికుల జీతాలు సమస్య.**

జిల్లాకలెక్టర్ సిపిడబ్ల్యు ఎస్ స్కీమ్ పరిశీలనలో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న కార్మికులకు గత తొమ్మిది నెలల నుండి సంబంధిత కాంట్రాక్టర్ జీతాలు ఇవ్వటం లేదని ఏడిద సత్య వీర వెంకట నాగేశ్వరరావు సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి సంబంధిత కాంట్రాక్టర్ తో మాట్లాడి సమస్యపై పరిష్కారం చూపనున్నట్లు హామీ ఇచ్చారు.

**ఆర్యావటంలో 'స్వర్ణ గ్రామ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.**

అనంతరం ఆర్యావటంలోని స్వర్ణ గ్రామ కార్యాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించడంతో పాటు, కార్యాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవల వివరాలు,పాజిటివ్ పబ్లిక్ పెర్సెప్షన్ నివేదిక, గ్రామంలోని పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసు కున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గ్రామ ప్రజలకు మరింత చేరువ చేయడంలో సిబ్బంది కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

**చేదువాడ అంగన్వాడి కేంద్రంలో చిన్నారులతో ముచ్చటించిన జిల్లాకలెక్టర్.**

కలెక్టర్ పర్యటనలో భాగంగా చేదువాడ గ్రామంలో ఎస్సీ కాలనీగల అంగన్వాడి కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. అక్కడ చిన్నారులతో ముచ్చటించి, వారు అభ్యసించిన కృత్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా చిన్నారులకు మెరుగైన, నాణ్యమైన పౌష్టికాహారాన్ని ఎల్లప్పుడూ సకాలంలో అందించాలనినిర్వాహకులకు సూచించారు.

**జడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులతో జిల్లా కలెక్టర్ సంభాషణ.**

మండల కేంద్రమైన కాజులూరులో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం' కింద అందుతున్న భోజన తయారీ విధానం, కిచెన్ షెడ్డును తనిఖీ చేశారు. పాఠశాలలో తాగునీరు,మరుగుదొడ్ల వసతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులతో ముచ్చటించి వారి విద్యా సామర్థ్యాలను ఈ సందర్భంగా పరిశీలించారు. గత పబ్లిక్ పరీక్షల్లో రాష్ట్ర,జిల్లా స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ పట్టుదలతో చదవాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. 10వ తరగతి విద్యార్థులను ఇప్పటి నుంచే పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేయాలని, ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు కలెక్టర్ కఠినమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట కాజులూరు తహశీల్దార్ టి. ఠాగూర్, ఎంపీడీవో జే. రాంబాబు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రూప, లతో పాటు పలు శాఖల ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# నాణ్యమైన గణాంకాల సేకరణతోనే స్వర్ణాంధ్ర విజన్ సాకారం

### జిల్లా కలెక్టర్ డా.ఆర్.మహేష్ కుమార్.

ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జిల్లా, మండల స్థాయి ఆర్థిక పురోభివృద్ధి దిశ ప్రణాళికలపై ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్ మహేష్ కుమార్ జిల్లా అధికారులకు తెలియజేసారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి భవన్ నందు స్వర్ణాంధ్ర-2047 విజన్ లక్ష్యాల సాధనకు రూపొందించిన 'పది సూత్రాలు' గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (జీడీడీపీ), గ్రాస్ మండల్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (జీఎండీపీ) పురోగతి అంశాలపై నిర్వహించిన సామర్ధ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (జీడీడీపీ), గ్రాస్ మండల్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (జీఎండీపీ) పురోగతి అంశాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఒక ప్రొఫెసర్ ఐదుగురు ఎనలిస్టుల నిపుణుల బృందంతో శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. జిడిడీపి, జిఎండీపి కెపాసిటీ బిల్డింగ్ యొక్క శిక్షణ కార్యక్రమంలో ఎలాంటి సందేహాలు ఉన్న నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని జీడిడిపి, జిఎండిపి ఏ శాఖ వెనుకంజలో ఉందో ఆ శాఖ ఆర్థిక పూరోభివృద్ధిలో ముందంజలో ఉండాలని తెలియజేసారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత కలిగిన స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో ప్రతి శాఖ లక్ష్యం, ప్రతి జిల్లా రూపొందించే కార్యాచరణ ప్రణాళిక 'పది సూత్రాలు'లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ అంశాలకు అనుగుణంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా రూపొందించే ప్రతి అభివృద్ధి కార్యక్రమం స్వర్ణాంధ్ర విజన్ పరిధిలోకి వస్తుందో లేదో నిర్ధారించేందుకు ఈ పది సూత్రాలే ప్రామాణికంగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-2047 సాధనకు ప్రభుత్వం నిర్దేశించిన పది సూత్రాలలో జీరో పావర్టీ (పేదరిక నిర్మూలన),ఉపాధి కల్పన,నైపుణ్యాభివృద్ధి, పరిశోధన-అభివృద్ధి ,నీటి భద్రత,రైతు సంక్షేమం - అగ్రి టెక్నాలజీ,ప్రపంచ స్థాయి లాజిస్టిక,శక్తి, ఇంధన వ్యయ ఆప్టిమైజేషన్, ఉత్పత్తి పరిపూర్ణత,స్వచ్ఛ ఆంధ్ర, డీప్ టెక్నాలజీని అన్ని రంగాల్లో విస్తృతంగా వినియోగించడం అంశాలపై అవగాహన కలిగి జిల్లా ఆర్థిక పురో అభివృద్ధిపై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. జిల్లా, మండల స్థాయిలో వ్యవసాయం, పశుసంవర్ధక, మత్స్య, పారిశ్రామిక, సేవారంగాల్లో సృష్టించబడుతున్న ఆర్థిక విలువను ఖచ్చితంగా అంచనా వేయడమే జీడీడీపీ, జీఎండీపీ ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. ఈ గణాంకాల ద్వారా స్థానిక ఆర్థిక పరిస్థితులపై సమగ్ర అవగాహన ఏర్పడి, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు రూపొందించేందుకు ప్రభుత్వం మరింత సమర్ధవంతమైన నిర్ణయాలు తీసుకోగలదన్నారు. స్వర్ణాంధ్ర-2047లో నిర్దేశించిన పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, రైతు సంక్షేమం, నీటి భద్రత, పారిశ్రామికాభివృద్ధి, పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్, ఆధునిక సాంకేతికత వినియోగం వంటి లక్ష్యాల సాధనకు విశ్వసనీయ గణాంకాలే పునాదిగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న నియోజకవర్గ ఆర్థిక ప్రొఫైలింగ్ కార్యక్రమం కూడా స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో కీలక భాగమని కలెక్టర్ తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోని ఆర్థిక పరిస్థితులు, ఉపాధి అవకాశాలు, సహజ వనరులు, వ్యవసాయ, పారిశ్రామిక, సేవారంగాలపై సమగ్ర సమాచారాన్ని సేకరించడం ద్వారా స్థానిక అవసరాలకు అనుగుణమైన అభివృద్ధి వ్యూహాలు రూపొందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలోని ప్రతి శాఖ అధికారి తమ శాఖకు సంబంధించిన గణాంకాలను నాణ్యతతో, ఖచ్చితత్వంతో సేకరించాలని, ఒక శాఖ అందించే సమాచారం మరో శాఖ ప్రణాళికలకు కూడా ఉపయోగపడుతుందని, అందువల్ల శాఖల మధ్య సమన్వయం అత్యంత అవసరమని కలెక్టర్ సూచించారు. గణాంకాల నాణ్యత ఎంత మెరుగ్గా ఉంటే ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాలు అంత సమర్థవంతంగా అమలవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన శిక్షణలో జీడీడీపీ, జీఎండీపీ అంచనా విధానం, డేటా సేకరణ, గణాంకాల విశ్లేషణ, నివేదికల తయారీ, శాఖల సమన్వయం తదితర అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి, విశ్వసనీయ గణాంకాల సేకరణతో పాటు స్వర్ణాంధ్ర-2047 'పది సూత్రాల' అమలులో ప్రతి అధికారి భాగస్వామి కావాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్. నైడియా దేవి, డిఆర్ఓ వి. సుబ్బారావు, ముఖ్య ప్రణాళికాధికారి జెడి సౌజన్య, ముఖ్య ప్రణాళిక అధికారిని ఎడి రోహిణి కుమారి,సీపీవో మురళి కృష్ణ, ముంబై యూనివర్సిటీ ప్రొఫెసర్ సత్యనారాయణ, కోఆర్డినేటర్ పిఐఎఫ్ ఫైజాన్, శిక్షణ అనాలిస్టులు కె.వి నారాయణ, అబ్దుల్లా, గౌరీ,తమీమ్ జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు, గణాంక విభాగం సిబ్బంది, సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.



## విజయ సాధన పబ్లిక్ స్కూల్ విద్యార్థి షైనింగ్ స్టార్ అవార్డు తీసుకోవడం మా స్కూల్‌కి గర్వకారణం



ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం

మండలంలోని విజయ సాధన హై స్కూల్ విద్యార్థి చెలికాని హర్షిత్ సాయి సచిన్ కి నిన్న జరిగిన షైనింగ్ స్టార్ అవార్డు గౌరవ కలెక్టర్ దినేష్ కుమార్ పోలవరం వారు, ఎమ్మెల్యే మిరియాల శిరీష చేతుల మీదుగా తీసుకోవటం జరిగింది. ఈ విద్యార్థి 10 వ తరగతి ఫలితాలలో మండల స్థాయిలో మొదటి ర్యాంక్ 562/ 600 మార్కులు సాధించటం జరిగింది, ఈ సందర్భంగా విజయ సాధన హై స్కూల్ యాజమాన్యం సన్మా నించటం జరిగింది, షైనింగ్ స్టార్ అవార్డు రావటం ఎంతో సంతోషం గా ఉన్నది అని అలాగే మా పాఠశాల నుండి ఇంగ్లీష్ మీడియం తెలుగు మీడియం విద్యార్థులు ప్రతి సంవత్సరం అత్యధిక ర్యాంకులతో ఉన్నత చదువులకు అర్హులుగా ఉంటున్నారని ఎల్ కె జి నుండి పదవ తరగతి వరకు మా పాఠశాలలో క్రమశిక్షణతో కూడిన విద్య ఇంగ్లీష్, సైన్స్, గణితం, పై ప్రత్యేక శ్రద్ధ అలాగే నర్సరీ పిల్లలకు అన్ని వసతులతో కూడిన విద్యను వారికి అందించడం ఆటల నందు ప్రాముఖ్యతను పెంపొందించడం టాలెంట్ టెస్ట్ కండక్ట్ చేసి వారి ప్రతిభను బయటకు తీసే విధంగా చూడటం వారు ఎందులో వెనుకబడి ఉన్నారు ఎందులో ముందు ఉన్నారు తెలుసుకుని వారికి సరైన విధంగా వారికి విద్యను అభ్యసించడం అన్నివేళలా స్కూల్ కరస్పాండెంట్ ప్రతి ఒక్క విషయాన్ని గమనిస్తూ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు వారికి సూచనలు ఇవ్వడం జరుగుతుంది అలాగే ప్రతి నెల విద్యార్థుల తల్లిదండ్రులతో మీటింగ్ ఏర్పాటు చేసి వారి పిల్లలు బాగోగుల గురించి ఎందులో వెనుకంజలో ఉన్నారు తెలుసుకొని వారికి ఇంటి వద్ద ఎటువంటి సూచనలు ఇవ్వాలని విషయంపై తల్లిదండ్రులకు తెలియజేయడం జరుగుతుందని స్కూల్ కరెస్పాండంట్ ధనిసిరి రజని అన్నారు. అదేవిధంగా షైనింగ్ స్టార్ అవార్డు తో పాటు నవోదయ ఎటపాక లో కూడా సీట్ సాధించటం జరిగింది ప్రధాన ఉపాధ్యాయురాలు ఎ.రమాదేవి స్కూల్ సిబ్బంది అభినందనలు తెలియ చేసారు,

## ఎస్ఎల్‌డీపీ అమలు సంతృప్తికరం

### -రాష్ట్ర సీమాట్ ట్రైనింగ్ అసోసియేట్ శైలజ




ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో స్కూల్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎస్-ఎల్‌డీపీ) అమలు తీరు సంతృప్తికరంగా ఉందని రాష్ట్ర సమగ్ర శిక్షా సీమాట్ ట్రైనింగ్ అసోసియేట్ కె. శైలజ తెలిపారు. బుధవారం రావులపాలెం మండలంలోని రావులపాలెం బాలుర ఉన్నత పాఠశాల, ఈతకోట జెడ్పీ ఉన్నత పాఠశాలలను సమగ్ర శిక్షా ఏఎంఓ పి. రాంబాబుతో కలిసి ఆమె సందర్శించారు. ఎస్ఎల్‌డీపీ పూల్-1, పూల్-2లో శిక్షణ పొందిన ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించి, శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాల పరిపాలనలో ఎలా అమలు చేస్తున్నారో పరిశీలించారు. స్కూల్ లీడర్‌షిప్ కాంపిటెన్సీస్‌లో భాగమైన సెల్ఫ్ అవేర్‌నెస్, మేనేజ్‌మెంట్, నాన్-వయిలెంట్ కమ్యూనికేషన్, టీమ్ బిల్డింగ్, కొలాబరేషన్, ఇన్ఫ్లుయెన్స్ విత్‌అవుట్ అథారిటీ, కోచింగ్ అండ్ ఫీడ్‌బ్యాక్, స్కూల్ రీసోర్సుల నిర్వహణ తదితర అంశాల అమలు తీరును సమీక్షించారు. భవిష్యత్తులో ప్రధానోపాధ్యాయులకు మరింత సమర్థవంతమైన శిక్షణ అందించేందుకు వారి నుంచి ఫీడ్‌బ్యాక్‌ను సేకరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎం. జానకీదేవి, పి. శ్రీరామచంద్రమూర్తి ఎస్ఎల్‌డీపీపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఎస్ఎల్‌డీపీ శిక్షణ అమలు పట్ల శైలజ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రావులపాలెం ఎంఈవో బి. శ్రీనివాసరాజు, సీఆర్ఎంటీ ఎం. రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీని అరెస్టు చేయటం అమానుషం

### -రాహుల్ గాంధీని అరెస్టు చేయటం అమానుషం ..



ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం

ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద గత సుమారు 20 రోజుల నుండి కాక్రో జనతా పార్టీ పేరుతో యువతి యువకులు ధర్నా చేస్తూ ఉంటే వారు అడిగిన మాటలకు సమాధానం చెప్పకుండా వారిపై అమానుషంగా టియర్ గ్యాస్ వదిలి వాళ్లపై లాఠీ ఛార్జ్ చేయడం ఇది భారతావలికి మాయని మచ్చగా రానున్న యువతను అనగా తొక్కాలని ఉద్దేశంతో చేసిన పనిల ఉంది వారు చేసిన ధర్నాకు మద్దతుగా అనేకమంది ప్రముఖులు పాల్గొనడం వారికి మద్దతు తెలియచేయడం జరుగుతుంది ఇందులో భాగంగా నిన్న జరిగిన ఈ సంఘటనకు రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ ఎంపీలు అందరూ కలిసి జంతర్ మంతర్ వద్ద ఉన్న యువతీ యువకులను కలిసేందుకు వారు చేస్తున్న ధర్నాలో పాల్గొనేందుకు వెళ్లిన రాహుల్ గాంధీని ప్రియాంక గాంధీ వారి ఎంపీలను అమానుషంగా లాఠీచార్జి చేస్తూ వారిని అరెస్టు చేయటం ఈ బీజేపీ లో కుట్రలో భాగంగా ఉంది తప్ప యువతి యువకులకు సమాధానం చెప్పలేక ఇలాంటి చర్యలకు చేపడుతున్నారు ఇకనైనా భారతమాత ముద్దు బిడ్డలైన మనం సంఘటితంగా పోరాడుదాం అన్నందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులను అరెస్టును ఖండిస్తూ ఈ బీజేపీ కుల రాజకీయాలకు ఎంతో కాలం లేదు అని మండలాధ్యక్షుడు శ్రీమంతుల వెంకటరమణ తెలియజేశారు ఈ కార్యక్రమంలో నందికొండ శ్రీనివాసరావు, షేక్ అహ్మద్ బాషా, ఇస్మాయిల్, వేనుపల్లి రామారావు, బొత్తుల భరతమూర్తి, పాల్గొన్నారు.

ప్రజాభూమి

జనరల్ 14

గురువారం 23 జూలై 2026

## రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం

ప్రజాభూమి ప్రతినిధి–వి.ఆర్.పురం.



భవిష్యత్తు కోసం రోడ్డెక్కిన విద్యార్థుల గొంతుకగా నిలిచి, వారికి కొండంత అండగా నిలిచిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అండిమేని లీల కృష్ణ నాగేంద్రప్రసాద్ అన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టును ఖండిస్తూ విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ మీరు ఎన్ని అరెస్టులు చేసినా ఎంతమందిని జైల్లో వేసిన విద్యార్థుల తరపున కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆగదనీ అన్నారు. విద్యార్థుల ఆందోళనలకు అండగా జంతర్ మంతర్ వద్ద రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ధర్నా ఇటీవల నీట్, ఇతర పోటీ పరీక్షల పేపర్ లీకేజీలు, అక్రమాల వల్ల దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు తమ భవిష్యత్తుపై తీవ్ర నిరాశలో ఉన్నారనీ, ఈ అన్యాయానికి వ్యతిరేకంగా, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు, యువజన సంఘాలు చేపట్టిన నిరసన ప్రదర్శనకు కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ నేరుగా వెళ్లి పాల్గొని తమ పూర్తి మద్దతును ప్రకటించారనీ తెలిపారు. విద్యార్థులతో పాటు రోడ్డుపై కూర్చొని ధర్నా చేస్తూ, వారి ఆవేదనను ఆలకించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వారు పోరాడారన్నారు. మీరు ఎన్ని అరెస్టులు చేసినా ఎంత మందిని జైల్లో వేసిన విద్యార్థుల తరపున కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆగదనీ, విద్యార్థుల శ్రమ వృధా కాకూడదనీ, తక్షణమే అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి న్యాయం జరపాలనీ పేర్కొన్నారు.

## సున్నంవారిగూడెంలో కనీస వసతులు లేక గ్రామస్తులు తీవ్ర అవస్థలు



ప్రజాభూమి ప్రతినిధి–వి.ఆర్.పురం.

మండలంలోని సున్నంవారిగూడెం గ్రామంలో కనీస మౌలిక వసతులు లేక గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు, గ్రామానికి త్రీఫేస్ విద్యుత్ సరఫరా లేకపోవడంతో తాగునీటి పథకాలు పనిచేయక కనీసం తాగడానికి నీళ్లు కూడా దొరకని పరిస్థితి నెలకొందని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వీధిలైట్లు వెలగక పోవడంతో రాత్రి వేళల్లో ఎటువైపు నుంచి ఏ విషపురుగు వస్తుందోనని భయాందోళనల మధ్య కాలం వెళ్లదీస్తున్నామని వాపోతున్నారు. ఈ సందర్భంగా తమ సమస్యలను సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సున్నం రాజులు దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. సమస్యలపై సున్నం రాజులు మాట్లాడుతూ గ్రామస్తులు మంచినీరు లేక, వీధిలైట్లు లేక నానా ఇబ్బందులు పడుతుంటే సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. చీకటి కారణం వల్ల రహదారులపై వెళ్లే బాటసారులకు, గ్రామస్తులకు విషసర్పాలు, పురుగుల నుండి ప్రాణాపాయ ప్రమాదం పొంచి ఉందన్నారు. పంచాయతీ విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి సున్నంవారిగూడెం గ్రామానికి 3–ఫేస్ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి, వీధిలైట్లను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారులు నిర్లక్ష్యం వీడి సమస్యలను పరిష్కరించకపోతే గ్రామ ప్రజలను కూడగట్టి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## జనసేన పార్టీ కార్యాలయ నిర్మాణ ప్రారంభోత్సవం

ప్రజాభూమి ప్రతినిధి–వి.ఆర్.పురం



మండల కేంద్రం రేఖపల్లి గ్రామంలో బుధవారం మండల జనసేన పార్టీ కార్యాలయ నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమంనీ బుధవారం నిర్వహించారు. వీరమహిళ బాగుల ప్రమీళారాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ములకాల సాయికృష్ణ మాట్లాడుతూ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు మరింత చేరువగా వారికి సేవ చేసే విధంగా, పార్టీ తమ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, పార్టీ కార్యకలాపాలను పార్టీ సమావేశాలు, ఎన్నికల ప్రణాళికలు, మరియు వ్యూహాలను రూపొందించడానికి పటిష్టంగా, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండటానికి వారి సమస్యలను చెప్పుకోవడానికి, నాయకులను కలవడానికి ఒక నిర్దిష్టమైన చిరునామాగా కార్యాలయం ఉంటుందని, సెప్టెంబర్ రెండవ తేదీ జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవం రోజున అంగరంగ వైభవంగా ముఖ్య అతిథుల ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తామని అన్నారు. ఇది పార్టీకి కొత్త వైభవం తీసుకురానుందని, మండలంలో కార్యాలయ నిర్మాణం శుభ పరిణామమని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బాగుల అంజనరావు, కెచ్చుల పోసిరెడ్డి, యూత్ ప్రెసిడెంట్ పెడపెట్ల పవన్ కళ్యాణ్, గూటాల సమ్మరాజు, మండల సహాయ కార్యదర్శులు మాచర్ల వేణుబాబు, ముంజపు శ్రీరామ్, సీనియర్ నాయకులు మాదిరెడ్డి బోసు తదితరులు పాల్గొన్నారు.

## ద్రాక్షారామంలో ఘనంగా జాతీయ జెండా దినోత్సవం.

గాంధీజీ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించిన సతీష్ రావు.

పలువురు బిజెపి శ్రేణులు హాజరు.

ప్రజాభూమి ప్రతినిధి–రామచంద్రపురం.



డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామలో కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి సతీష్ రావు ఆధ్వర్యంలో మండల బిజెపి అధ్యక్షులు ఆకేటి శ్రీకృష్ణ అధ్యక్షతన జాతీయ జెండా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సతీష్ రావు ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.1947 జులై 22న భార త రాజ్యాంగ సభ మన త్రివర్ణ పతాకాన్ని భారత జాతీయ జెండాగా అధికారికంగా ఆమోదిం చిందని,అప్పటి నుండి మన జాతీయ జెండా దేశ స్వాతంత్ర్యానికి,ఐక్యతకు, సార్వభౌ మత్వానికి,త్యాగానికి ప్రతీకగా నిలిచిందని సతీష్ రావు సతీష్ రావు తెలియజేశారు. పింగళి వెంకయ్య రూపొందించిన మన జాతీయ జెండా త్రివర్ణ పతాకంలో కాషాయం ధైర్యం, త్యాగానికి,తెలుపు శాంతి, సత్యానికి,ఆకుపచ్చ అభివృద్ధి, శ్రేయస్సుకు ప్రతీకలని,మధ్యలోని అశోక చక్రం ధర్మాన్ని, న్యాయాన్ని, నిరంతర ప్రగతిని సూచిస్తుంది అని సతీష్ రావు పేర్కొన్నా రు.జాతీయ జెండాను గౌరవించడం ప్రతి భారతీయుడి పవిత్ర బాధ్యతని మన త్రివర్ణ పతాకం స్ఫూర్తితో దేశాభివృద్ధికి కృషి చేస్తూ,జాతీయ ఐక్యతను కాపాడుతూ,భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటుదాని మండల బిజెపి అధ్యక్షులు ఆకేటి శ్రీకృష్ణ తదితర బిజెపి నాయకులు పిలుపునిచ్చారు.

# ప్రభుత్వం అందించే సంక్షేమ అభివృద్ధి ఫలాలు ఇంటింటికీ తెలియజేయాలి

- ఈనెల 27 నుంచి తలపెట్టే డోర్ టు డోర్ ప్రచారాన్ని విజయవంతం చేయాలి.
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్ పిలుపు.



ప్రజాభూమి ప్రతినిధి–రామచంద్రపురం

కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పారదర్శక పాలనను ప్రతి ఇంటికి చేరవేసే లక్ష్యంతో ఈ నెల 27వ తేదీ నుంచి నెల రోజులపాటు నిర్వహించనున్న "కూటమి ప్రభుత్వం సంక్షేమ విజయాలు" డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రామచంద్రపురంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సవివరంగా వివరించాలని మంత్రి సూచించారు.అదేవిధంగా ప్రజల అభిప్రాయాలు, సమస్యలు, అవసరాలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రతి కార్యకర్త బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు. ప్రజలతో ఆత్మీయంగా మమేకమవుతూ ప్రభుత్వంపై వారి విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే విధంగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.రాష్ట్ర అభివృద్ధి, గ్రామీణ మౌలిక వసతుల కల్పన, ఉపాధి అవకాశాల పెంపు, పెట్టుబడుల ఆకర్షణ, సంక్షేమ పథకాల సమర్థ అమలు వంటి అంశాలతో పాటు, భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి ప్రణాళికలను కూడా ప్రజలకు తెలియజేయాలని మంత్రి సూచించారు.ప్రజల ఆశయాలే ప్రభుత్వ లక్ష్యం ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అనే భావనతో ప్రతి కార్యకర్త అంకిత భావంతో పనిచేసి ఈ ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి సుభాష్ పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్, ఉండవిల్లి శివ, కొత్తపల్లి శ్రీనుబాబు, మేడిశెట్టి రవికుమార్, క్లస్టర్, కో కస్టర్, బూత్, డివిజన్, వార్డు కమిటీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల తరహాలో మరో తిరుమలగా అభివృద్ధి చేయడానికి అన్ని విధాలా కృషి చేస్తున్నాం

- వాడపల్లి ఆలయ అభివృద్ధిపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి..
- అభివృద్ధి పనులను కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే బండారు.




ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట.

తిరుమల తరహాలో మరో తిరుమలగా వాడపల్లి ని టెంపుల్ టౌన్ గా అభివృద్ధి చేయడానికి అన్ని విధాల కృషి చేస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలియజేశారు. బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ నదియా కుమారి,అడిషనల్ ఎస్పీ, దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు మరియు పాలక మండలి సభ్యులు,తదితర జిల్లా అధికారులతో కలిసి వాడపల్లి లో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ముందుగా శ్రీనివాసం 1 కాంప్లెక్స్ నిర్మాణాన్ని, వకుళమాత అన్నదాన భవన కేంద్ర నిర్మాణాన్ని, మాడవీధులను పరిశీలించారు. అనంతరం లొల్ల పార్కింగ్ ఏరియాను, గోదావరి ఘాట్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ నాలుగు మాడవీధులను 40 అడుగుల వెడల్పులో విస్తరించాలని ఆలోచన చేస్తున్నామన్నారు.దర్శనానికి వచ్చిన వృద్ధులు, చంటి పిల్లల తల్లులు, మహిళలు ఇబ్బందులు పడకుండా ఉండడానికి తిరుమల తరహాలో కంపార్ట్మెంట్లు నిర్మాణాన్ని చేపట్టడానికి కృషి చేస్తున్నామన్నారు. రాబోయే భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ముందు ముందు ఏ విధంగా ఈ ఆలయ అభివృద్ధికి చేయాల్సిన పనులపై కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ దృష్టి సారించడం మంచి పరిణామం అన్నారు. ఊహించని రీతిలో భక్తులు వాడపల్లి తరలివస్తున్నారన్నారు. భక్తుల రాక అంచనాలు అందకుండా ఉండడంతో అందుకు తగ్గ ఏర్పాట్లు చేయడానికి సతమతమవుతున్న పరిస్థితి కనపడుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సైతం వాడపల్లి అభివృద్ధి పై దృష్టి సారించారన్నారు. ఆలయం అభివృద్ధి చెందితే ఈ ప్రాంతమంతా అభివృద్ధి చెందుతుందని తన భావనని వ్యక్తం చేశారు. వచ్చిన భక్తులకు సరైన వసతి సౌకర్యాలు కల్పించాలని అందుకోసం 54 రూములతో శ్రీనివాసం 1 నిర్మాణం జరుగుతుందన్నారు. గత రెండు సంవత్సరాల్లో 140 బాత్రూములు నిర్మించడం జరిగిందన్నారు. ఇంకా డార్మటరీలు, రూములు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఒక నెల రోజుల్లో వకుళమాత అన్నదాన భవన కేంద్రం నిర్మాణం పూర్తి అయ్యే అవకాశం ఉందన్నారు. పార్కింగ్ కి ఉన్న ఇబ్బందులు తొలగించడానికి కృషి చేశామన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిధులు అందించిన ఏటిగట్టు రహదారి పనులు కూడా త్వరలో ప్రారంభిస్తా మన్నారు. భక్తులు వస్తే ఇక్కడే ఉండే విధంగా తగిన ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రూ.12 కోట్లతో శ్రీనివాసం 2 నిర్మాణానికి టీటీడీ నిధులు అందేలా ముఖ్య మంత్రి స్వయంగా సిఫార్సు చేశారన్నారు. త్వరలో అది కూడా సాకా రం అవుతుందన్నా రు. టెంపుల్ సిటీగా అభి వృద్ధి చేయడానికి ఒక ప్లాన్ రూపొందించి ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. రానున్న పుష్కరాల్లో భాగంగా రూ.5కోట్ల నిధులతో గోదావరి ఘాట్ నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

# నిడదవోలు విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌పై జాతీయ స్థాయిలో ప్రశంసల జల్లు

- 'మింట్' దినపత్రికలో ప్రత్యేక కథనం రాసిన పిఎంఓ ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ఎస్. మహేంద్ర దేవ్
- అభివృద్ధికి దిక్సూచి 'నిడదవోలు మోడల్' అంటూ జాతీయ స్థాయి గుర్తింపు రావడంపై హర్షం వ్యక్తం చేసిన పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్
- నిడదవోలు నియోజకవర్గంలో స్వర్ణాంధ్ర--2047 విజన్ అమలుకు రూపొందించిన నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ ను, యూనిట్ కార్యకలాపాలను ప్రశంసిస్తూ నమూనాగా పేర్కొనడం ఎంతో ఆనందదాయకం:మంత్రి దుర్గేష్



ప్రజా భూమి ప్రతినిధి–నిడదవోలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్య సాధనలో భాగంగా రూపొందించిన నియోజకవర్గ స్థాయి పరిపాలనా నమూనా జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకోవడం పట్ల రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. నిడదవోలు నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ క్షేత్రస్థాయిలో అద్భుత ఫలితాలు సాధిస్తూ, దేశానికే ఒక నమూనాగా నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి కార్యాలయానికి చెందిన ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ఎస్. మహేంద్ర దేవ్ ప్రముఖ జాతీయ పత్రిక 'మింట్' లో రాసిన కథనంలో.. ప్రజలే కేంద్రంగా సాగుతున్న ఏపీ ప్రభుత్వ పాలనా విధానాన్ని, ముఖ్యంగా నిడదవోలు నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ పనితీరును ప్రత్యేకంగా ఉదహరిస్తూ కొనియాడటం ఆనందంగా ఉందన్నారు. నిడదవోలు నియోజకవర్గంలో విజన్ యూనిట్ ద్వారా పర్యవేక్షణ మెరుగుపడిందని, ప్రజలకు జీవనోపాధి అవకాశాలు పెరగడంతో పాటు అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని, వ్యవసాయం, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, మహిళా సాధికారత, మౌలిక సదుపాయాలు, డిజిటల్ సేవలు వంటి అన్ని రంగాలను సమగ్రంగా అనుసంధానిస్తూ, స్థానిక అవసరాలకు అనుగుణంగా రూపొందించిన ఈ కార్యాచరణ ప్రణాళిక ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధిని వేగవంతం చేస్తోందని అభిప్రాయపడుతూ మహేంద్ర దేవ్ తన వ్యాసంలో పేర్కొనడం నిడదవోలుకే గర్వకారణమని మంత్రి దుర్గేష్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ యూనిట్లు కేవలం డేటా సేకరించే కేంద్రాలు కావు అని, నియోజకవర్గ స్థాయిలో 'అభివృద్ధి మేధస్సు'ను పెంపొందించే ప్రధాన కేంద్రాలని పిఎంఓ ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ అభివర్ణించడం రాష్ట్ర ప్రభుత్వ పాలనా సంస్కరణలకు లభించిన గుర్తింపు అని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. పాలనలో వివిధ శాఖలను ఒకే తాటిపైకి తెస్తూ, ప్రజల ఆకాంక్షలకు అగ్రపీఠం వేస్తూ రూపొందించిన ఈ నియోజకవర్గ స్థాయి ఫ్రేమ్‌వర్క్. 'వికసిత్ భారత్' సాధనలో ఒక దిక్సూచిలా నిలుస్తుందని మంత్రి దుర్గేష్ ఆకాంక్షించారు. సామాజిక–ఆర్థిక పరిస్థితులు, మౌలిక వసతుల పురోగతి, సేవల నాణ్యత, స్థానిక ఆర్థిక లావాదేవీల తీరు మరియు సంక్షేమ పథకాల అమలుపై ఈ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లు నిరంతరం దృష్టి సారిస్తున్నాయని మంత్రి దుర్గేష్ వివరించారు. దీనివల్ల ప్రతి నియోజకవర్గానికి సంబంధించి వాస్తవిక ఆధారాల నిధి తయారవుతోందని తెలిపారు. రాష్ట్రంలోని 28 జిల్లాలు, 175 నియోజకవర్గాలు, 686 మండలాల్లో అమలవుతున్న ఈ బృహత్తర ప్రణాళికలో నిడదవోలు నియోజకవర్గం జాతీయ స్థాయి గుర్తింపు పొంది అందరికీ ఆదర్శంగా నిలవడం పట్ల మంత్రి దుర్గేష్ విజన్ యూనిట్ కు చెందిన నిడదవోలు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, యంగ్ ప్రొఫెషనల్, విజన్ బృందం, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు ఈ ప్రక్రియలో భాగస్వాములైన ప్రతి ఒక్కరిని హృదయపూర్వకంగా అభినందించారు. వారి అంకితభావం, వినూత్న ఆలోచనలు, క్రమబద్ధమైన కార్యాచరణ, నిరంతర పర్యవేక్షణ వల్లే ఇది సాధ్యపడిందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, శాస్త్రీయ ప్రణాళికతో, సమిష్టి కృషితో రూపొందించిన ఈ నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ స్వర్ణాంధ్ర–2047 లక్ష్యాల సాధనలో ఒక మైలురాయిగా నిలుస్తుందని విశ్వసిస్తున్నాను అని పేర్కొన్నారు.

ఈ కథనం తన దృష్టికి రాగానే నియోజకవర్గ విజన్ ప్లాన్ స్పెషల్ ఆఫీసర్,డిప్యూటీ కలెక్టర్ ఎన్. మనో జ్ రెడ్డి, యంగ్ ప్రొఫెషనల్ జె. ఎస్. సుధీ ర్ కుమార్, స్టాఫ్ అగ్రికల్చర్ సెక్టార్ కోఆర్డినేటర్ కాటంరెడ్డి అనిల్ కుమార్,ఆక్వా ఁ లైవ్ స్టాక్ సెక్టార్ కోఆర్డినేటర్ కారింకి దుర్గప్రసాద్, ఇండస్ట్రీ సెక్టార్ కోఆర్డినేటర్ గార రాజేశ్వరి, సర్వీస్ ఆర్టీజీఎస్ సెక్టార్ కోఆర్డినేటర్ మేడికాయల ప్రజ్వల్ కుమార్, పబ్లిక్ ఇంటర్ఫేస్ ఁ పీ4 కోఆర్డినేటర్ చోడిశెట్టి నాగ వెంకట హరి దుర్గ తదితరులను మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా నిడదవోలు క్యాంపు కార్యాలయంలో అభినందించారు.

# విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన కూటమి ప్రభుత్వం

## రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

ప్రజాభూమి ప్రతినిధి–రామచంద్రపురం



రాష్ట్రంలో విద్యా రంగాన్ని ప్రాధాన్యతగా తీసుకుని విద్యార్థుల భవిష్యత్తు కోసం కూటమి ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు."తల్లికి వందనం" పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయడం ద్వారా విద్యకు మరింత ప్రోత్సాహం అందిస్తున్నామని మంత్రి సుభాష్ తెలిపారు. ఈ పథకం కింద ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న లక్షలాది మంది విద్యార్థులకు లబ్ధి చేకూరిందన్నారు. రాష్ట్రంలో మొత్తం 67.47 లక్షల మంది విద్యార్థులకు రూ.10,120.78 కోట్ల ఆర్థిక సాయం అందించబడిందని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు దూరం కాకుండా చూడటమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమన్నారు.గత వైసిపి ప్రభుత్వం అర్హులైన విద్యార్థులకు ఇవ్వకుండా దగా చేసిందని ఈ సందర్భంగా విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సహకారంతో విద్యా రంగంలో నాణ్యత పెంపు, ఆధునిక సదుపాయాల కల్పన, డిజిటల్ విద్యా వ్యవస్థ బలోపేతం వంటి కార్య క్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన అభ్యాస వాతావరణం కల్పించడం, సాంకేతిక విద్యను ప్రోత్సహించ డం ద్వారా విద్యా వ్యవస్థను మరింత బలో పేతం చేస్తున్నామని చెప్పారు.ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి ఉప యోగపడే పౌరుడిగా ఎదగాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తు విద్యార్థుల చేతు ల్లోనే ఉందని, వారి అభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

# చర్చ్ ఆఫ్ హోప్ మినిస్ట్రీస్ నూతన ప్రార్థనా మందిరం ప్రారంభం

ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు




నగరంలోని 29వ డివిజన్ తాపీ మేస్త్రి కాలనీలో చర్చ్ ఆఫ్ హోప్ మినిస్ట్రీస్ నూతన ప్రార్థనా మందిరాన్ని ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ఏలూరు ఎమ్మెల్యే,జిల్లా టీడీపీ అధ్యక్షుడు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), ఏపీఎస్ఆర్టీసీ జోన్–2 చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రార్థనా మందిర నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ,సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, మానవతా విలువల పెంపునకు మత సంస్థలు చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, కో–ఆప్షన్ సభ్యుడు ఎస్.ఎం.ఆర్. పెదబాబు,డివిజన్ కార్పొరేటర్ ఉచ్చుల సుజాత సన్నీ,స్థానిక టీడీపీ,జనసేన నాయకులు,పాస్టర్ పి. సుదర్శనం,సంఘ సభ్యులు,మత పెద్దలు, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.